






www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



ఎన్నికల సంఘం ఎల్లప్పుడూ.. మోదీ ప్రభుత్వం చేతిలో 'కీలుబొమ్మ'

జైళ్ళల్లో హింసాత్మక ధోరణులపై నిఘా వేయండి

ఐదేళ్లలో యువతకు కోటి ఉద్యోగాలు

కేరళ సిఎం నివాసానికి బాంబు బెదిరింపు

లోపలి పేజీల్లో



సంపుటి 28, సంచిక: 25 | సోమవారం | 14-07-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00




## విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు కన్నుమూత

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు సంతాపం

ప్రజాపక్షం/హైదరాబాద్

విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు శకం ముగిసింది. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న కోట శ్రీనివాస రావు (83) ఆదివారం ఉదయం ఫిలిం నగర్‌లోని ఆయన నివాసంలో కోట కన్నుమూశారు. కోటకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 2010 జూన్ 21న రోడ్డు ప్రమాదంలో కోట కుమారుడు కోట ప్రసాద్ చనిపోయారు. 1942 జూన్ 10వ తేదీన కోట శ్రీనివాసరావు కృష్ణా జిల్లా కంకిపాడులో జన్మించారు. 1968లో రుక్మిణీని పెళ్ళి చేసుకున్నారు. సినిమా పరిశ్రమకు రాక ముందు కోట శ్రీనివాసరావు బ్యాంకులో ఉద్యోగం చేశారు. 1978లో 'ప్రాణం ఖరీదు' సినిమాతో కోట సినీ రంగ ప్రవేశం చేశారు. నాలుగు దశాబ్దాలకు పైగా వెండి తెరపై వెలిగిపోయిన కోట శ్రీనివాసరావు సుమారు 750కు పైగా సినిమాల్లో నటించారు. తెలుగు, తమిళ , కన్నడ, హిందీ సినిమాల్లో తనదైన శైలిలో నటనను ప్రదర్శించారు. తెలుగు తెరపై కోట ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. కెరీర్ ప్రారంభంలో సహ నటుడు, ప్రతి నాయకుడి పాత్రలను పోషించిన కోట హాస్య రసాన్ని కూడా పండించడంలో దిట్ట అని మెప్పించారు. అహ నా పెళ్ళంట, ప్రతి ఘటన ఖైదీ నెంబర్ 786,

తరువాయి 2లో

## సిపిఐ 4వ రాష్ట్ర మహాసభల లోగో ఆవిష్కరణ

- పార్టీ బలోపేతానికి మరింత ప్రచారం చేయాలి
- ఇంటింటికి వెళ్లి లక్ష్యాలను వివరించాలి
- చాడ వెంకట్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

సిపిఐ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని సిపిఐ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి పార్టీ లక్ష్యాలను వివరించడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ

తరువాయి 2లో





## కన్నుల పండువగా ఉజ్జయిని బోనాలు

- పట్టువస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ప్రభుత్వం తరపున తొలి బోనం సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- కట్టుదిట్టమైన పోలీసు భద్రత, భక్తుల ఆనందోత్సాహాల మధ్య జాతర

ప్రజాపక్షం/హైదరాబాద్

చారిత్రాత్మకమైన సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల పండుగ కన్నుల పండుగగా జరిగింది. వైభవోపేతంగా మహంకాళి బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరిపారు. భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో తెల్లవారు జాము నుంచే మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు వివిధ జిల్లాల నుంచి మహంకాళి జాతరకు ప్రజలు తరలివచ్చారు. బోనాల జాతర పురస్కరించుకొని సికింద్రాబాద్ పరిసర ప్రాంతాలు కోలాహలంగా మారాయి. ఉజ్జయిని మహంకాళి దేవాలయ పరిసర ప్రాంతాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ అధికారులు దేవాలయం మొత్తం రంగులు, పువ్వులు, విద్యుత్ దీపాలతో

తరువాయి 2లో



## కొత్త రేషన్‌కార్డుల పంపిణీకి సర్వం సిద్ధం

- నేడు సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ
- తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలో భారీ బహిరంగ సభ

ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి

ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల ప్రారంభానికి సూర్యాపేట జిల్లా మరోసారి వేదిక అవుతోంది. ఉగాది పర్వదినాన రేషన్ దుకాణాల ద్వారా పేదలకు పంపిణీ చేస్తున్న సన్న బియ్యం పథకాన్ని హుజూర్‌నగర్ కేంద్రంలో సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభం చేసిన విషయం అందరికి తెలిసిందే. ఆనాడు తొలిసారిగా సిఎం హోదాలో సూర్యాపేట జిల్లాలో అడుగుపెట్టిన రేవంత్‌రెడ్డి మరోసారి నూతన రేషన్‌కార్డుల పంపిణీకి నేడు (సోమవారం) తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మున్సిపల్ కేంద్రానికి రానున్నారు. ఈ కార్డుల పంపిణీకి అధికారులు ఇప్పటికే సర్వం సిద్ధం చేశారు. సిఎం చేతుల మీదుగా 11 మంది లబ్ధిదారులకు కార్డులను అందించనున్నారు. కొత్త రేషన్‌కార్డుల పంపిణీ సందర్భంగా నిర్వహించే బహిరంగ సభ విజయవంతం చేసేందుకు రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేలు గత వారం రోజులుగా వరుస సమీక్ష, సమావేశాలు జరిపారు. సంబంధిత జిల్లా అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేశారు. రేషన్‌కార్డుల పంపిణీ

తరువాయి 12లో

## 'భాయ్.. బచ్చా ఆగయా భాయ్'

- గంజాయి వినియోగదారులపై 'ఈగల్ టీమ్' డెకాయ్ ఆపరేషన్
- పోలీసులు పంపిన లొకేషన్‌కు 14 మంది వినియోగదారులు
- అదుపులోకి తీసుకుని, డీ అడిక్షన్ సెంటర్‌కు తరలింపు




**హైదరాబాద్:** తెలంగాణలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలన కోసం ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ టీమ్ చాలా చురుగ్గా పని చేస్తోంది. ఇప్పటికే పలు డ్రగ్స్ రాకెట్‌లను బయటపెట్టింది. తాజాగా గంజాయి వినియోగదారులని చాలా తెలివిగా పట్టుకుంది ఈ టీమ్. గంజాయి వినియోగదారులను పట్టుకొనేందుకు డెకాయ్ ఆపరేషన్ నిర్వహించింది. ఇటీవల మహారాష్ట్రకు చెందిన సందీప్ అనే గంజాయి సరఫరాదారును ఈగల్ టీమ్ అరెస్ట్ చేసింది. అతని ఫోన్‌లోని కాంటాక్ట్ లిస్ట్ ద్వారా ఈ డెకాయ్ ఆపరేషన్ చేసింది. గంజాయి వచ్చిందంటూ కస్టమర్లకు పోలీసులు మెసేజ్ పెట్టారు. 'భాయ్ బచ్చా ఆగయా భాయ్' అనే వాట్సాప్ కోడ్‌తో గంజాయిని సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ కోడ్ పంపి గచ్చిబౌలిలోని ఓ ప్రదేశానికి రావాలని ఈగల్ టీమ్ పేర్కొంది. దీంతో రెండు గంటల్లో 14 మంది వినియోగదారులు

తరువాయి 2లో



## దేశవ్యాప్తంగా ఓటరు జాబితా సమగ్ర సవరణ

- వచ్చే నెల నుంచి కసరత్తు మొదలు పెట్టేందుకు ఇసి సన్నాహాలు
- చివరిసారిగా 'సవరణ' చేసిన ఓటరు లిస్టులు అందుబాటులోకి తెస్తున్న సిఇఒలు

**న్యూఢిల్లీ :** వచ్చే నెల (ఆగస్టు) నుంచి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఓటరు జాబితా సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ను చేపట్టేందుకు కేంద్ర ఎన్నికల సంఘం (ఇసి) సమాయత్తం అవుతోంది. ఇందుకోసం ఎక్కడికక్కడ ఎన్నికల యంత్రాంగాలను క్రియాశీలం చేస్తోంది. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌తో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ ఓటరు జాబితా సమగ్ర సవరణను మొదలుపెట్టేందుకు ఇసి సన్నాహాలు చేస్తోంది. వివిధ రాష్ట్రాల చీఫ్ ఎలక్టోరల్ అధికారులు (సిఇఒలు) ఆయా రాష్ట్రాల్లో చివరిసారిగా ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) జరిగిన తర్వాత ప్రచురితమైన ఓటరు జాబితాలను బయటికి తీస్తున్నారు. వాటిని తమ అధికారిక వెబ్‌సైట్లలో అందుబాటులోకి తెస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో 2008లో, ఉత్తరాఖండ్‌లో 2006లో చివరిసారిగా ఓటరు జాబితాల సవరణకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించారు. ఆయా సంవత్సరాల్లో ప్రచురించిన ఓటరు జాబితాలను ఢిల్లీ సిఇఒ, ఉత్తరాఖండ్ సిఇఒ అధికారిక వెబ్‌సైట్లలో ఇప్పుడు అందుబాటులోకి తెచ్చారు. ఈ ఏడాది అక్టోబరు నవంబరులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో చివరిసారిగా 2003లో ఓటరు జాబితా సమగ్ర సవరణ జరిగింది. ఆ ఏడాది ప్రచురితమైన ఓటరు జాబితాలోని సమాచారం ఆధారంగానే ఇప్పుడు బిహార్‌లో ఓటరు

తరువాయి 12లో

## ఉప్పు తెగ బుక్కేస్తున్నారు

భారతీయులే అధికంగా వినియోగిస్తున్నట్లు ఐసిఎంఆర్ అధ్యయన నివేదిక వెల్లడి

జీవనశైలి సమస్యలు ప్రతి ఒక్కరిలో పెరుగుతాయని హెచ్చరిక



**న్యూఢిల్లీ :** భారతీయులు చాలా ఎక్కువ ఉప్పు (సోడియం క్లోరైడ్) తింటున్నారని ఐసిఎంఆర్ (భారత వైద్య పరిశోధనా మండలి) అధ్యయన నివేదిక వెల్లడించింది. ఇలా చాలా ఎక్కువగా ఉప్పు తినడంవల్ల నిశ్శబ్ద జీవనశైలి సమస్యలు ప్రతిఒక్కరిలో పెరిగిపోతున్నాయని హెచ్చరించింది. ఐతే లో సోడియం సాల్ట్ (ఎల్ ఎస్ ఎస్) ఎక్కువమంది వినియోగదారులకు అందుబాటులో లేకపోవడం ఒక సమస్యగా ఉందని కూడా అధ్యయనం వెల్లడించింది. డిమాండ్‌కు తగినవిధంగా సరఫరాలు కూడా ఉండాలని తెలిపింది. సాధారణ ఉప్పు చాలా ఎక్కువగా తినడంవల్ల భరించలేని అధికరక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు, గుండెకు రక్తాని సరఫరాచేసే నాళాలలో సమస్యలు, కాలేయ సంబంధ వ్యాధులతోపాటు మధుమేహం, మతిమరపు, ఆలోచనాధోరణిలో సమతుల్యత లోపించడం వంటి అనేక సమస్యలు కూడా జీవనశైలిలో మనకు తెలియకుండానే పెరిగిపోతున్నాయని ఐసిఎంఆర్ నేషనల్ ఎపిడెమియోలొజీ ఇనిస్టిట్యూట్ (ఎన్ఐఇ) సైంటిస్టుల నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. తొలుత ఈ శాస్త్రవేత్తలు ఆరంభంలో ఒక వర్గంలో ఉప్పును తగ్గించేందుకు అధ్యయనం ప్రారంభించింది. ఆ సమస్య పరిష్కారానికి మార్గాలు ఆలోచించారు. సోడియంను తక్కువ మోతాదులో ఉపయోగించే విషయాలను పరిశీలించారు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు హెచ్ ఓ) చేసిన సూచన ప్రకారం ప్రతి మనిషీ రోజుకు ఐదు గ్రాముల ఉప్పు మాత్రమే ఆహారంలో తీసుకోవాలి, కానీ పట్టణ ప్రాంతాలలో భారతీయులు ప్రతి రోజూ 9.2 గ్రాముల ఉప్పు తింటున్నారు. చివరకు గ్రామీణ

తరువాయి 12లో

## పాలస్తీనా అనుకూల సంస్థపై ఉగ్రముద్ర బ్రిటన్‌లో ప్రదర్శనలు

70 మంది అరెస్టు




**లండన్ :** పాలస్తీనా అనుకూల సంస్థపై ఉగ్రవాద ముద్ర వేయడాన్ని వ్యతిరేకిస్తూ బ్రిటన్‌లో పలుచోట్ల ప్రదర్శనలు జరిగాయి. ఈ సందర్భంగా పోలీసులు 70 మందిని అరెస్టు చేశారు. లండన్‌లో జరిగిన ప్రదర్శనలో 42 మందిని అరెస్టు చేశారు. మాంఛెస్టర్‌లో 16 మందిని, సౌత్ వేల్స్‌లో 13 మందినీ పోలీసులు నిరసన ప్రదర్శనల సందర్భంగా అరెస్టు చేశారు. పాలస్తినా ప్రజలు తమ హక్కులకోసం స్వదేశంలో పోరాడుతున్నారు. వారికి మద్దతుగా అమెరికా, యూరప్‌లలో కూడా విద్యార్థులతో పాటు పాలస్తినా వలస ప్రజలు నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. కానీ ఈ ఏడాది జూన్ 20వ తేదీన లండన్‌లోని

తరువాయి 2లో

## ముందుకు సాగని ఖరీఫ్ సాగు

నేటికీ 26 శాతం లోటు వర్షపాతమే

నెలన్నరగా అంతంత మాత్రమే

గత సీజన్‌లో ఇప్పటికే 74 శాతం సాగు.. ప్రస్తుతం 35 శాతమే

వానల కోసం అన్నదాతల ఎదురు చూపులు



ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి

ఈ ఏడాది వానాకాలం ఖరీఫ్ సాగు ముందుకు సాగడం లేదు. గత ఏడాది ఈ పాటికే 74 శాతం సాగు నమోదు అవగా ప్రస్తుతం 35 శాతం సాగు మాత్రమే నమోదు అయింది. నేటికీ సరైన వర్షాలు కురువక రైతులు వరినార్లు పోయడం ఆలస్యం అవుతుండడమే కారణంగా చెబుతున్నారు. ఈ ఏడాది రుతు పవనాలు ముందుగానే ప్రవేశించడంతో వర్షాలు పుష్కలంగానే కురుస్తాయని ఆశించిన రైతులకు నిరాశే ఎదురైంది. రోహిణి కార్తెలో ముందస్తుగా మురిపించిన వానలు... ఆ తర్వాత ఆశించినంతగా ఉండకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయాలు వెతుక్కోవలసిన పరిస్థితి ఏర్పడింది. తొలకరి వర్షాలకే మురిసిపోయి దుక్కులు దున్ని విత్తనాలు వేశారు. కానీ ఇప్పటి వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆశించినంతగా వర్షాలు కురవలేదు. దాదాపు ఆరు జిల్లాల లోనూ సాధారణ వర్షపాతం కన్నా తక్కువ వర్షపాతం నమోదైంది. జూన్ నెలారంభం నుంచి ఈనెల 11వ తేదీ వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో సగటున 25.8 శాతం తక్కువ వర్షం పడింది. జనగామ జిల్లాలో అత్యధికంగా 41శాతం లోటు వర్షపాతం రికార్డయింది. వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం ఆరు జిల్లాల్లో రెండింటిలోనే సాధారణ వర్షం కురవగా, మిగతా నాలుగు జిల్లాల్లో లోటు వర్షమే పడింది. 20 నుంచి 59 శాతం మేర తక్కువ వర్షం పడితే దానిని లోటుగా, 19 శాతం కన్నా తక్కువ వర్షం కురిస్తే దానిని సాధారణ వర్షపాతంగా, 59 నుంచి 100శాతం కన్నా తక్కువ వర్షం కురిస్తే దానిని తీవ్రమైన

తరువాయి 12లో

## దశాబ్ద కాలంగా క్రీడారంగం భ్రష్టు పట్టింది

- ప్రజాప్రభుత్వంలో విప్లవాత్మక మార్పులు
- స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా ఏడాది పూర్తి సందర్భంగా 'ప్రజాపక్షం' ప్రత్యేక ఇంటర్వ్యూలో కె.శివసేనారెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వంలో క్రీడా రంగం భ్రష్టు పట్టిపోయిందని.. ప్రజాపాలనలో క్రీడారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో తెలంగాణ క్రీడారంగ ముఖచిత్రం పూర్తిగా మారిందని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రోత్సాహంతో యువ క్రీడాకారుల్లో ఉత్సాహం నిండడంతో పాటు అనేక జాతీయ అంతర్జాతీయ టోర్నమెంట్‌లకు హైదరాబాద్ వేదికగా మార్చామని తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా శివసేనారెడ్డి 'ప్రజాపక్షం'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

**ప్రశ్న : ఏడాది కాలంలో క్రీడారంగంలోఎలాంటి అభివృద్ధి చేశారు..**

చైర్మన్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పది సంవత్సరాలు పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక విధానం అంటూ లేకుండా, క్రీడాకారులు యువకుల పట్ల పూర్తి నిర్లక్ష్యంతో వ్యవహరించింది. యువత డ్రగ్స్‌కు గంజాయికి బానిసలు అవుతుంటే చోద్యం చూసింది. సిఎం రేవంత్ రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే తెలంగాణ యువత డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాలకు లోను కాకుండా ఎటువంటి చర్యలు చేపడితే బాగుంటుందనే ఆలోచనతో యువకులను వైన్స్‌లు బార్లు వైపు కాకుండా

తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## అమెరికాపై ప్రతీకార సుంకాలు
### ఇయు కమిషన్ హెచ్చరిక



**పారిస్:** అదనంగా 30 శాతం సుంకాలు విధించిన ట్రంప్‌పై యూరోపియన్ యూనియన్ (ఇయు), మెక్సికోలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఆగస్టు ఒకటో తేదీ నుండీ అమలయ్యేవిధంగా ఈ దేశాలకు ట్రంప్ టారిఫ్ లేఖలు పంపారు. ట్రంప్ తీరు చాలా అన్యాయంగా ఉందని మెక్సికో విమర్శించింది. తమ దేశ సార్వభౌమాధికారంతో రాజీపడేదిలేదని స్పష్టం చేసింది. ఇ యు కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వోండర్‌లేయన్ కూడా విమర్శల దాడి చేశారు. అవసరమైతే అమెరికాపై ప్రతీకార సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. అదేసమయంలో అమెరికాతో టారిఫ్‌లపై సంప్రదింపులకు తాము సిద్ధంగా ఉన్నామని కూడా మెక్సికో, ఇయు దేశాల ప్రతినిధులు ప్రకటించారు. కానీ ట్రంప్ కూడా ఏ మాత్రం వెనక్కు తగ్గలేదు. ప్రతీకార సుంకాలు గనుక విధిస్తే పరిస్థితులు తీవ్రంగా విషమిస్తాయని, అనూహ్యస్థాయిలో భారీ పన్నులు విధిస్తామని ఆయన ఎదురుహెచ్చరిక చేశారు.

## హ్యూమానిటేరియన్ సిటీకి ఆరు లక్షల మంది..
# రఫాలో ముమ్మరంగా ఐడిఎఫ్ ఏర్పాట్లు





**రఫా:** గాజా కోస్తా తీర ప్రాంతం అల్ మవాసీ నుండి పాలస్తినా ప్రజలను బలవంతంగా తరలించేందుకు వీలుగా ఉద్ధృతంగా రఫాలో విధ్వంస కార్యక్రమాలను కొనసాగిస్తోంది. సనద్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ చేసిన దర్యాప్తులో ఈ విషయం బహిర్గతమైంది.పాలస్తీనియన్లను సగం ప్రాంతం నుండి పూర్తిగా తరలించేందుకు ట్రంప్ జోక్యంతో నెతన్యాహూ చాలాకాలంగా ప్రణాళిక చేస్తున్నారు. ఇదే ప్రణాళిక రఫాలో కొనసాగుతున్నది. నిర్మాణాల విధ్వంస కార్యక్రమం చాలా చురుగ్గా కొనసాగుతోంది. ఆరులక్షలమందిని దక్షిణ గాజాలో నిర్బంధ కేంద్రాల నుండి తరలించే ప్రణాళిక అమలు చేసేందుకు ఇదంతా జరుగుతోంది.ఈఏడాది జులై నాలుగోతేదీన లభ్యమైన ఉపగ్రహ ఛాయాచిత్రాల సమాచారం ప్రకారం రఫాలో ధ్వంసం చేసిన భవనాల సంఖ్య28,600కు పెరిగింది. గడచిన ఏప్రిల్ నెలలో ఇలా ధ్వంసమైన భవనాలసంఖ్య 15,800మాత్రమేఉండేవి.అంటేఏప్రిల్ నుండిఇప్పటివరకూమూడున్నర నెలల కాలంలో 12,800 భవనాలను శరవేగంగా సామూహికంగా ధ్వంసం చేశారు. గడచిన సోమవారం నాడు ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రాథమికంగా 6,00,000 మందితో హ్యూమానిటేరియన్ సిటీ ఏర్పాటు చేస్తామన్నారు. అల్ మవాసీ నుండి పాలస్తీనియన్లనురఫాకు తరలించేందుకు ఈ హ్యూమా నిటేరియన్ సిటీని తయారుచేస్తున్నారు.ఒకవేళహమాస్‌తో ఏదైనా 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం జరిగితే ఈ గడువు సమయంలోఈహ్యూమానిటేరియన్ సిటీని పూర్తి గా సిద్ధంచేస్తారన్న మాట. గాజాలో మొత్తం గా ఉన్న 20 లక్షల మంది పాలస్తీనియన్లను ఈ హ్యూమానిటేరియన్ సిటీకి తరలించే ప్రయత్నం జరుగుతోంది.ఈచర్యలను ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంఘం, ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలు తీవ్రంగా ఖండిస్తున్నాయి.ఈ విధంగా బలవంతంగా ప్రజలను తరలించడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని వారు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ఐతే ఇజ్రాయెల్ రక్షణమంత్రి కట్జ్ మాత్రం, పాలస్తీనా ప్రజల రక్షణ కోసమే హ్యూమానిటేరియన్ సిటీ నిర్మిస్తున్నట్లుబుకాయిస్తున్నారు.

**మంచినీళ్ళు పట్టుకుంటే పదిమందిని చంపేశారు**

గాజాలోఇజ్రాయెల్‌సైన్యం మితిమీరిన దురాగతాలకు పాల్పడుతున్నది. మంచినీటి సరఫరా కేంద్రం వద్ద మంచినీరు తాగుతున్నవారిని, మంచినీటిని పీపాలలో నింపుకుంటున్న పాలస్తినా ప్రజలపై ఇజ్రాయెల్ సైన్యం ఆదివారం దాడులు చేసి పదిమందిని చంపేసింది. మృతదేహాలను నుజ్రెత్ అల్అవ్దా ఆసుపత్రికి తరలించారు. ఈవీడియోలను ఆన్‌లైన్‌లో షేర్ చేశారు. మృతుల్లో పిల్లలు కూడా ఉన్నారు. పొరుగునున్నవారు గాయపడినవారిని గాడిదబండ్లపై ఆసుపత్రికి తరలించారు. రెడ్‌క్రాస్ ఇంటర్నేషనల్ కమిటీ ఈ చర్యలను ఖండించింది.గడచిన ఆరువారాలుగా దక్షిణ గాజాలో అమాయకులైన ప్రజలపై దాడులు సర్వసాధారణంగా మార్చేశారని విమర్శించింది. ఈ విధంగా గాజాలో ఆదివారం 50 మంది పాలస్తీనియన్లు మరణించినట్లు గాజా సివిల్ డిఫెన్స్ ఏజన్సీ తెలిపింది. ముందు రోజు శనివారం చేసిన గగనతల దాడుల్లో 110మంది మరణించారు. రఫాలో ఆహార సరఫరా కేంద్రంవద్ద ఆహారం కోసం ఎదురుచూస్తున్న34మందిని ఇజ్రాయెల్‌సైన్యం కాల్చిచంపింది. శనివారంనాడు ఆసుపత్రిలో 132 మందికి చికిత్స చేశామని, వీరిలో 32 మంది మరణించారని రఫా ఆసుపత్రివర్గాలు చెప్పాయి. గడచిన మే నెల 27 నుండి తమ ఆసుపత్రిలో తూటాలవల్ల గాయపడిని 3,400 మందికి చికిత్సలు చేయగా, మరో 250 మంది మరణించారని వర్గాలు తెలిపాయి.

## స్త్రీ హక్కులకోసం కోర్టుకెక్కిన పెలికాట్‌కు ఫ్రాన్స్‌ఉన్నత పౌర పురస్కారం



**పారిస్:** దారుణ అణచివేతకు గురిచేసి లైంగిక దోపిడీకి పాల్పడిన తన భర్తకు వ్యతిరేకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయిం చి బాహాటంగా హక్కులకోసం పోరాడిన గిసెల్ పెలికాట్ (72)కు ఫ్రాన్స్ అత్యున్నత పౌర పురస్కారం లభించింది. ఈ నెల 14వతేదీ ఫ్రాన్స్ జాతీయ దినోత్సవానికి ముందుగా పురస్కారాలకు అర్హులైన వారి పేర్ల జాబితాలో గిసెల్ పెలికాట్‌ను "నైట్ ఆఫ్ ద లెజియన్ ఆఫ్ ఆనర్" పురస్కారంతోసత్కరిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మెరిట్‌ప్రాతిపదికపై జాతికి సేవలు అందించినవారిని ఎంపిక చేసిన 589మందిలో పెలికాట్‌ను కూడా ఈ అత్యున్నత పురాస్కారానికి ఎంపిక చేశారు. పెలికాట్ కేసులో న్యాయస్థానం 2024 డిసెంబరు 19వ తేదీన అంతిమతీర్పు ప్రకటించింది. ఈ కేసులో 50మందిని దోషులుగా తేల్చింది. గిసెల్ పెలికాట్ భర్త డొమినిక్ పెలికాట్ తను చేసిన నేరాలను ఇటీవల కోర్టులో అంగీకరించాడు. తన భార్య గిసెల్‌కు మత్తుమందు ఇచ్చి స్పృహలో లేకుండా చేసి తాను అత్యాచారం చేయడమే కాకుండా తన మాస్టర్ బెడ్‌రూమ్‌కు అనేకమంది మగవాళ్ళను ఆహ్వానించి వారికి కూడా భార్యశీలాన్ని తాకట్టుపెట్టానని ఒప్పుకున్నాడు. ఈ విధంగా పది సంవత్సరాలపాటు గిసెల్ పెలికాట్ లైంగిక దోపిడీకి గురైంది. వందలమంది ఆమెను లైంగికంగా చిత్రహింస చేశారు. కానీ గిసెల్ తర్వాత ఏ మాత్రం సిగ్గు పడకుండా తన భర్త తనకు చేసిన అన్యాయాన్ని బాహ్య ప్రపంచానాకి ఎలుగెత్తి చాటింది. వీధుల్లోకి వచ్చి న్యాయంకోసం అర్థించింది. తన హక్కులను రక్షించాలని న్యాయస్థానాన్ని కోరింది. దీంతో గిసెల్ పెలికాట్ ప్రపంచవ్యాప్తంగా హక్కులకోసం పోరాడిన మహిళామణిగా పేరు ప్రఖ్యాతి సాధించారు. ఈ కేసు పరిష్కారమయ్యాక ఫ్రాన్స్ ప్రభుత్వం కూడా ఆమెను దేశ అత్యున్నత పౌర పురస్కారానికి ఎంపిక చేసింది.



## ఎప్స్టీన్ ఫైల్స్‌ను బయట పెట్టకపోతే
# ట్రంప్‌ను ఎవ్వరూ నమ్మరు : ఎలాన్‌మస్క్

**వాషింగ్టన్ :** ఎప్స్టీన్ ఫైల్స్‌ను బయట పెట్టకపోతే అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను ఎవ్వరూ నమ్మే అవకాశం ఉండదని ఆయన పూర్వ సన్నిహితుడు, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ అన్నారు. దేశంలో మెల్లిగా ట్రంప్‌పట్ల తీవ్ర వ్యతిరేకత ఉద్ధృతం అవుతున్న తరుణంలో ఎలాన్‌మస్క్ తాజాగా ఎప్స్టీన్ ఫైల్స్ ప్రస్తావన చేశారు. ఈ సమస్య ఇంకా పరిష్కారం కాలేదనీ, ఇది మరుగున పడిపోలేదనీ, ఈ సమస్య ఇంకా రాజుకుంటూనే ఉందని మస్క్ అన్నారు. ట్రంప్ మాజీ సహాయకుడు స్టీవ్ బానన్ ఎప్స్టీన్ ఫైల్స్‌లో ఉన్నారని ఆయన ఆరోపించారు. వేలాదిమంది పిల్లలను లైగింకంగా వేధింపులకు గురిచేసిన వీడియోలు ప్రభుత్వం వద్ద ఉంటే మరి ఇంతవరకూ అత్యాచారాలకు పాల్పడినవారు ఎందుకు న్యాయస్థానం ముందు కేసులు ఎదుర్కోవడంలేదని మస్క్ ప్రశ్నించారు. చిన్న పిల్లలను మభ్యపెట్టి వారిని లైంగికంగా వేధించి దుర్వినియోగం చేయడమే కాకుండా వారిని వ్యభిచార వృత్తిలోకి దింపాడన్న నేరారోపణలపై రెండుసార్లు జైలుపాలైన జెఫ్రీ ఎప్స్టీన్ 2019 ఆగస్టులో రెండోసారి జైలుకు వెళ్ళాక జైలులోనే అనుమానాస్పదంగా మరణించాడు. డోనాల్డ్ ట్రంప్ తనకు ప్రియమిత్రుడుని, ఆయన గురించి పూర్తి వివరాలు తనకు తెలుసుననీ ఎప్స్టీన్ తరచు చెప్పుకునేవాడు. ఎప్స్టీన్ జైలులో ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పినప్పటికీ, అతడి మరణం ఇప్పటికీ మిస్టరీగా మారింది. ఎప్స్టీన్‌కు, ట్రంప్‌కు మధ్య ప్రపంచానికి తెలియని ఏదో విడదీయరాని అనుబంధం ఉందన సందేహాలు అందరినీ పీడిస్తున్నాయి. ట్రంప్‌తో వ్యవహారం చెడిన తర్వాత ఎలాన్‌మస్క్ 'ద అమెరికన్ పార్టీ' ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. దానిని జూన్‌నెలలోనే రిజిస్టర్ చేసుకున్నట్టు కూడా చెప్పారు. ఇదిలా ఉండగా, అటార్నీ జనరల్ పామ్ బాండీకి, ఎఫ్‌బిఐ డిప్యూటీ డైరెక్టర్ డాన్ బాంగినో మధ్య ఎప్స్టీన్ ఫైల్స్‌పై జరుగుతున్న వివాదంలో డోనాల్డ్ ట్రంప్ తన అటార్నీ జనరల్‌ను వెనకేసుకొచ్చారు. "ఆయన ఎంతో సమర్థవంతంగా తన బాధ్యతలు నిర్వహించారు, ఫెంటాస్టిక్ జాబ్ చేశారు, అందువల్ల అందరూ ఆయన వెనక నిలబడి మద్దతు ఇవ్వాలి, అదేవిధంగా కాష్ పటేల్ నాయకత్వంలో ఉన్న ఎఫ్‌బిఐ కూడా ఇక ఎప్స్టీన్ ఫైల్స్‌పై దృష్టి సారించకుండా, 2020 అధ్యక్ష ఎన్నికల్లో ఓటర్ల జాబితాల్లో జరిగిన అవకతవకలకు సంబంధించిన దర్యాప్తుపై పూర్తి దృష్టి కేంద్రీరించాలని ట్రంప్ తన సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టారు. దీంతో ట్రంప్ ఇప్పుడు విమర్శల్లో చిక్కుకున్నారు. సరిగ్గా ఇదే సమయంలో వచ్చే ఏడాది ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఈ ఎప్స్టీన్ ఫైల్స్ తగాదాలో జోక్యం చేసుకుని రంగంలోకి దిగుతారంటున్నారు.

## ఆసిఫ్ మునీర్‌కు అధ్యక్షపదవి అంటూ విదేశీశక్తుల దుష్ప్రచారం : షరీఫ్, నక్వీ ఖండన

**ఇస్లామాబాద్:**పాకిస్థాన్‌లో ఈ మధ్య బాగా అందరినోళ్ళల్లో నానుతున్న సర్వసేనాధిపతి, చీఫ్ ఫీల్డ్ మార్షల్ సయ్యద్ ఆసిఫ్ మునీర్‌కు అధ్యక్ష పదవి కట్టబెడతారన్న వార్తలను ఆ దేశ ప్రధాని షెహబాస్ షరీఫ్ తోసిపుచ్చారు. అసలు మునీర్‌కు దేశాధ్యక్షపదవిపై ఆసక్తి లేదని షరీఫ్ చెప్పారు. మునీర్–జర్దారీ ఇద్దరు విశ్వసనీయ వాతావరణంలో పాకిస్థాన్‌ను బలిష్ఠంగా తీర్చిదిద్దేందుకు కలిసి పని చేస్తున్నారనీ, అందువల్ల పదవీ మార్పులు జరిగే అవకాశాలు లేవన్నారు.ఆ తర్వాతపాకిస్థాన్ హోం శాఖామంత్రి ఇదే తరహాలో ఎక్స్ వేదికగాఒక ప్రకటన చేస్తూ విదేశీ శత్రుమూకలతో కలిసి కొందరు ఇలాంటి ప్రచారం చేస్తున్నాయన్నారు. ఇలాంటి వార్తలను ఎవరు ప్రచారం చేస్తున్నారో తనకు బాగా తెలుసునన్నారు. ఐతే ఆ పేరు మాత్రం చెప్పలేదు. అవన్నీ వదంతులేననీ, ఆధార రహితంగా చేసే బూటకపు ప్రచారాలేననీ షరీఫ్ కొట్టిపారేశారు. ఆసిఫ్ అలీ జర్దారీని అధ్యక్ష పదవి నుండి తొలగించి ఆ స్థానంలో మునీర్‌ను కూర్చోబెడతారని ఇటీవల వార్తలు చక్కెర్లు కొడుతున్నాయి. అలాంటి చర్చలు జరగలేదు, ఆ ఆలోచనలు రాలేదు, అలాంటి ప్రణాళిక లేదు, ఆ ఉద్దేశం లేదన్నారు. సైన్యంతో జర్దారీ చాలా గౌరవప్రదమైన సంబంధాలు కొనసాగిస్తున్నారన్నారు. కాగా జనరల్ జియావుల్ హక్ 1977లో కుట్ర ద్వారా ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకున్న వార్షికోత్సవ వేళ సోషల్ మీడియాలో మునీర్‌కు అధ్యక్ష పదవీ బాధ్యతలపై జోరుగా ప్రచారం సాగుతోంది.

## ఉజ్జయిని బోనాలు
**(మొదటి పేజీ తరువాయి)**

ఆలంకరించారు. సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దర్శించుకున్నారు. సిఎంకు పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. సిఎం రేవంత్‌రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ముఖ్యమంత్రికి వేదాశీర్వచనాలు అందించారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, సిఎం సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, ఎంపి అనిల్‌కుమార్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్ తదితరులు ఉన్నారు. రాష్ట్రంలో ప్రజలందరికీ మంచి జరగాలని అమ్మవారిని సిఎం రేవంత్ రెడ్డి ప్రార్థించారు.

**తొలిబోనం సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు..** సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఘనంగా ప్రారంభమయ్యే సందర్భంగా అమ్మవారికి తెల్లవారుజామునే మహా మంగళ హారతి ఇచ్చారు. అమ్మవారిని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు దర్శించుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, తొలి బోనం సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలునిర్వహించారు. రాష్ట్ర ప్రజలకు మంత్రి పొన్నం బోనాల ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మంచి వర్షాలు కురిసి పాడి పంటలతో రైతులంతా సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అమ్మవారికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బోనం సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులకు అనుమతించారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర వైభోపేతంగా జరిగింది. దేవాలయం వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా 6వరుసలుగా క్యూలైన్లు ఏర్పాటు చేశా రు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా పోటెత్తుతున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించారు. సాయంత్రం ఫలహారబండ్ల ఊరేగింపు అట్టహాసంగా ఊరేగింపులు జరిపారు. ఆలయ పరిసరాల్లో నగర పోలీసులు పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు. అమ్మవారిని హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ దత్తాత్రేయ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే టి.పద్మా రావు లు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారికి బోనం సమర్పించారు. మాజీమంత్రి మల్లారెడ్డి, దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

**బోనాలతో బారులు తీరిన ఆడపడుచులు..** పెద్ద సంఖ్యలో ఆడపడుచులు అమ్మ వారికి బోనం సమర్పించేందుకు బారులు తీరారు. దీంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు 6 క్యూలైన్లు ఏర్పాటు చేశారు. శివసత్తులకు ప్రత్యేకంగా మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు రీ రోడ్ బాట షోరూం నుంచి ప్రవేశం కల్పించారు. ఫలహారం బండి ఊరేగింపు ఘనంగా జరిపారు. సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో భక్తులకు అలరించేందుకు ప్రత్యేక వేదికల ద్వారా కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా కళాకారులతో కార్యక్రమాలతో ఉర్రతలూగించారు.

**2,500. మంది పోలీసులు బందోబస్తు**

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతరలో సుమారు 2,500. మంది లాఅండ్ ఆర్డర్, షీ టీమ్స్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. ప్రత్యేకంగా 200 సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. దేవాలయానికి భక్తులు వెళ్లేందుకు వివిధ మార్గాలలో పార్కింగ్ సదుపాయం కల్పించారు. జిహెచ్‌ఎంసి అధికారులు 24 గంటలు పారిశుధ్య నిర్వహించారు. మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేశా రు. జలమండలి ద్వారా వాటర్‌బాటిళ్లు, మంచినీటి ప్యాకె ట్లు అందచేశారు. మహంకాళి పోలీస్ స్టేషన్ సమీపంలో డిఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా శిబిరంలో వైద్యులను అందుబాటులో ఉంచారు. అత్యవసర పరిస్థితుల కోసం అంబులెన్సలను సిద్ధంగా పెట్టారు.

## ఆగయా భాయ్
**(మొదటి పేజీ తరువాయి)**

లోకేషన్‌కి వచ్చారు. వాళ్లందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో ఐటి ఉద్యోగులు, రిలేషన్‌షిప్ మేనేజర్లు, ఆన్‌లైన్ ట్రేడర్లు, విద్యార్థులు, డెంటల్ టెక్నీషియన్లు ఉన్నారు. ఓ వ్యక్తి గంజాయి కొనేందుకు భార్య, నాలుగేళ్ల కుమారుడితో సహా వచ్చాడు. 14 మందికి నిర్వహించిన యూరిన్ టెస్ట్‌లో డ్రగ్ పాజిటివ్ అని తేలింది. 14 మందిని డీఅడిక్షన్ సెంటర్లకు తరలించారు. నిందితుడు సందీప్ మహారాష్ట్ర నుంచి గంజాయి తెప్పిస్తున్నట్లు గుర్తించారు. 50 గ్రాముల చొప్పున 100 గంజాయి ప్యాకట్లు తెప్పిస్తున్నట్లు తెలుసుకున్నారు. ఒక్కో ప్యాకెట్‌ని రూ.3 వేలకు సందీప్ విక్రయిస్తున్నాడు. సందీప్ వద్ద 100 మందికి పైగా కస్టమర్లు ఉన్నట్లు ఈగల్ టీమ్ గుర్తించింది.

## భ్రష్టు పట్టింది
**(మొదటి పేజీ తరువాయి)**

మైదానాల వైపు మళ్లించే విధంగా ఆలోచనలు చేసి ఆచరణలకు శ్రీకారం చుట్టాము.స్పోర్ట్స్ సిటీ వైపు అడుగులు వేస్తున్నాము.

**ప్రశ్న: క్రీడాభివృద్ధికి నిధుల కొరత ఏమైనా ఉందా**

**చైర్మన్:** ప్రజాపాలన ప్రభుత్వం క్రీడారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రవేశపెట్టిన మొదటి బడ్జెట్లో రూ.364 కోట్లు, రెండవ బడ్జెట్లో మరో రూ. 100 కోట్లు పెంచారు. మొత్తం రూ. 464 కోట్లు బడ్జెట్ కేటాయించి క్రీడారంగానికి నూతన ఉత్తేజం కలిగించాము. నిధుల కొరత లేదు.

**ప్రశ్న: ఇప్పటి వరకు ఏఏ క్రీడా పోటీలు నిర్వహించారు**

**చైర్మన్:** క్రీడాకారుల్లో ఉత్సాహం కలిగించడానికి ఏడాది కాలంలోనే అనేక జాతీయ అంతర్జాతీయ టోర్నమెంట్‌లకు హైదరాబాద్ వేదికగా మార్చము. ఇంటర్ కాంటినెంటల్ ఫుట్ బాల్ కప్2024, ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్, 57 సంవత్సరాల అనంతరం హైదరాబాదులో సంతోష్ ట్రోఫీ నిర్వహించి హైదరాబాదులో తెలంగాణలో ఫుట్ బాల్ క్రీడకు పునర్ వైభవం తీసుకొచ్చాము. జాతీయ మహిళా సబ్ జూనియర్ హాకీ చాంపియన్ షిప్ 2024 ఎనిమిది దేశాలు పాల్గొన్న ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌కు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం ఆతిథ్యం ఇచ్చింది. అదేవిధంగా 49వ సబ్ జూనియర్ జాతీయ బాస్కెట్ బాల్ ఛాంపియన్షిప్ అండర్ 17 చెస్ పోటీలను నిర్వహణ, 4వ కియో కరాటే ఛాంపియన్షిప్ 20 25, 26వ సబ్ జూనియర్ జాతీయ రోయింగ్ ఛాంపియన్షిప్ హుస్సేన్ సాగర్ వద్ద, సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఎలైట్ నేషనల్ ఓపెన్ బాక్సింగ్ ఛాంపియన్షిప్, గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో 24వ జూనియర్ వుషూ ఛాంపియన్ షిప్ బ్రహ్మాండంగా నిర్వహించడం జరిగింది. అంతేకాకుండా మొన్న జరిగిన మిస్ వరల్డ్ అందాల పోటీల సందర్భంగా క్రీడా దినోత్సవాన్ని నిర్వహించి అందరి ప్రశంసలు అందుకోవడం జరిగింది.

**ప్రశ్న:ముఖ్యంగా గ్రామీణ ప్రాంతా యువకులకు ఎలాంటి ఉత్సాహాన్ని కల్పిస్తున్నారు.**

**చైర్మన్:** తెలంగాణ గ్రామీణ క్రీడా రంగానికి బలం చేకూర్చే లక్ష్యంతో రాష్ట్ర స్థాయిలో సిఎం కప్ 2024 నిర్వహించాము. అందులో పాల్గొన్న వివిధ గ్రామీణ క్రీడాకారుల సమాచారాన్ని నిక్షిప్తం చేశాము.. 33 జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన సిఎం కప్ టార్చ్ రిలే యువ క్రీడాకారుల్లో ఉత్సాహం నింపింది. అదే స్ఫూర్తితో సిఎం కప్ 2025 ఆగస్టు నెలలో నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నాము.

**ప్రశ్న: రాష్ట్రంలో క్రీడా స్టేడియాల పరిస్థితి ఎలా ఉంది..కొత్త స్టేడియాలు కడతారా..**

**చైర్మన్:**2002 జాతీయ క్రీడల సందర్భంగా హైదరాబాద్ నగరంలో నిర్మించిన వివిధ అంతర్జాతీయ స్టేడియాలను మరో 20 ఏళ్లకు సరిపడే విధంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో అథ్లెటిక్ స్టేడియంలో రూ.14 కోట్లు ఇండోర్ స్టేడియం లో రూ. 11 కోట్లతో వివిధ ఆధునీకరణ పనులు చేపట్టామని, త్వరలో నగరంలోని అన్ని స్టేడియాల్లో వివిధ ఆధునీకరణ పనులు చేపడుతాము. వివిధ నియోజకవర్గాల్లో స్టేడియాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, రాబోయే మూడు సంవత్సరాల్లో జిల్లాలలో స్టేడియాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు క్రీడ మైదానాలు నిర్మించడమే కాకుండా వాటిని నిర్వహించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాము.

**ప్రశ్న:భవిష్యత్తుల్లో క్రీడాభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.**

**చైర్మన్:** హకీంపేట,అదిలాబాద్, కరీంనగర్‌లో ఉన్న స్పోర్ట్స్ స్కూళ్లలో సీట్లకు తీవ్రమైన పోటీ ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో ప్రతి లోకసభ నియోజకవర్గానికి ఒకటి చొప్పున క్రీడా పాఠశాలలను ఏర్పాటు చేయాలనిఆలోచన ఉంది. అదేవిధంగా నూతన క్రీడా విధానం 2025 ప్రకారం రాష్ట్రంలో యంగ్ ఇండి యా ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్టర్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్నాం. స్పోర్ట్స్‌స్కూల్‌లను యూనివర్సిటీకి అనుసంధానం చేస్తూ క్రీడలకు విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చే విధంగా చర్యలు తీసుకోబోతున్నాం.

## బ్రిటన్‌లో ప్రదర్శనలు
**(మొదటి పేజీ తరువాయి)**

రాయల్ ఎయిర్‌ఫోర్స్ స్థావరంలోకి కొంతమంది ప్రవేశించి వైమానిక దళ విమానాలపై ఎర్రరంగుపూసి వాటిని ధ్వంసం చేశారన్న ఆరోపణలపై అధికారులు దర్యాప్తు చేశారు. ఈ దర్యాప్తులో పాలస్తినా అనుకూలవాదులే ఈ చర్యకు పాల్పడ్డారని నిర్ధారించారు. పాలస్తినా అనుకూల గ్రూపును ఉగ్రవాద సంస్థగా గుర్తించి ఉత్తర్వుచేశారు. దానిని నిషేధించారు.కోర్టు కూడా ఈ కేసు విచారణ సందర్భంగా ఇచ్చిన ఒక తీర్పులో ఈ గ్రూపునకు మద్దతు ఇచ్చినా, సభ్యత్వం తీసుకున్నాగానీ 14 సంవత్సరాలు జైలుశిక్షకు గురవుతారని తెలిపింది. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ, పాలస్తినా అనుకూల ప్రదర్శనలను నిషేధించినందుకు నిరసనగా లండన్‌లో తాజా గా ప్రదర్శన జరిగింది. లండన్‌లో గడచిన వారం రోజులుగా పాలస్తినా అనుకూల గ్రూపును సమర్థిస్తూ ప్రదర్శనలు జరుగుతున్నా యి. ఇంతకుముందుకూడా 29 మంది ప్రదర్శకులను లండన్‌లో పోలీసులు అరెస్టు చేశారు. పాలస్తినా నుండి ఇజ్రాయెల్ వైదొలగాలనీ, సామూహిక హత్యాకాండను ఆపేయాలని ప్రదర్శకులు డిమాండ్ చేశారు.

## లోగో ఆవిష్కరణ
**(మొదటి పేజీ తరువాయి)**

మహాసభల ఆహ్వాన సంఘ సమావేశం ఆదివారం సిపిఐ హైదరాబాద్ సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లోని రాజ్ బహదూర్ గౌర్ విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల లోగోను చాడ వెంకటరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ. నర్సింహా, కలవేణి శంకర్, శ్రామిక మహిళా ఫోరం జాతీయ నాయకురాలు ప్రేమ్ పావని, రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ అధ్యక్షుడు ఎండి. యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఈ. ఉమామహేష్ ,సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్ రెడ్డి, జె.లక్ష్మీ , డిహెచ్‌పిఎస్ అధ్యక్షులు ఏసురత్నం, రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, ఎఐటియుసి సీనియర్ నేత రత్నాకర్ రావు, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్‌లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చాడవెంకటరెడ్డి మాట్లాడుతూ మహాసభలను జయప్రదం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. మేడ్చల్ జిల్లాలో పార్టీ వేలాది ఎకరాల్లో లక్షలాది గుడిసెలు వేసి పేదలకు భూములు పంచిన చరిత్ర సిపిఐది అన్నారు. ప్రజల కోసం నిత్యం పని చేసే పార్టీ సిపిఐ అని విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. రానున్న రోజులో మహాసభల అనంతరం ప్రభుత్వ భూములను పేదలకు పంచడానికి ఉద్యమం కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రచ్చ కిషన్, స్వామి,హరినాథ్,కృష్ణ,శ్రీనివాస్, సత్య ప్రసాద్, జిల్లా నాయకులు ,ప్రమీల, మహాలక్ష్మి , గిరిజ, యాదయ్య, బాబు, జంగయ్య, బాపూరాజు, అజీజ్,పరమేశ్వర్, ఐలయ్య, రమేష్, వెంకటేష్,మనోహర చారీ తదితరులు పాల్గొన్నారు.

## కోట శ్రీనివాసరావు కన్నుమూత
**(మొదటి పేజీ తరువాయి)**

బొబ్బిలి రాజా, ఇడియట్ , సంతోషం, యమలీల, యముడికి మొగుడు, బొమ్మరిల్లు, జంబలకిడిపంబ, అతడు, ఆర్‌జీవి సర్కార్ వంటి సినిమాల్లో నటించిన కోట తన నటనకు గాను పలు సినిమాలకు నంది అవార్డు అందుకున్నారు. ప్రతి ఘటన, గాయం, తీర్పు, లిటిల్ సోల్జర్స్, గణేష్, చిన్న, పెళ్ళైన కొత్తలో, ఆ నలుగురు, పృథ్వి నారాయణ వంటి చిత్రాలలో నటనకు తొమ్మిది సార్లు నంది పురస్కారం అందుకున్నారు. 2012లో వచ్చిన వందే జగద్గురుమ్ సినిమాకు సైమా అవార్డు అందుకున్నారు. సూపర్ స్టార్ క్రిష్ణ, చిరంజీవి, వెంకటేష్, నాగార్జున, బాలకృష్ణ నుంచి మొదలుకొని వరుణ్ సందేశ్, సాయి ధరమ్ తేజ్ వరకు కోట శ్రీనివాసరావు నాలుగు తరాల నటీనటులతో కలిసి నటించారు. 2015లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతులమీదుగా కోట శ్రీనివాస రావు పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు.

**ఎమ్మెల్యేగా...**బ్యాంకులో ఉద్యోగిగా ఉన్న కోట శ్రీనివాసరావు రంగస్థలంలో నాటకాలు వేస్తూ వెండితెరపై వెలిగిపోయారు. తెరపై ఫుల్ బిజిగా ఉన్న సమయంలోనే కోట శ్రీనివాసరావు రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 1999–2004 వరకు తూర్పు విజయవాడ నియోజకవర్గం నుంచి శాసన సభ్యుడిగా సేవలందించారు. భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యేగా కోట శ్రీనివాసరావు పని చేశారు. సినీ ప్రముఖులు, అభిమానుల కన్నీటి వీడ్కోలు మధ్య ప్రముఖ నటుడు కోట శ్రీనివాస రావు అంత్యక్రియలు ముగిశాయి. ఫిల్మ్‌నగర్ లోని ఆయన నివాసం నుంచి మహాప్రస్థానం వరకు అంతిమ యాత్ర జరిగింది. ఇందులో అభిమానులు పాల్గొని నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యుల సమక్షంలో పెద్ద మనవడు శ్రీనివాస్ అంతిమ సంస్కారాలు చేశారు.

**'కోట'కు సిఎం రేవంత్‌రెడ్డి సహా పలువురు సంతాపాలు...** తెలుగు చలనచిత్ర నటుడు కోట శ్రీనివాస రావు మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. చలన చిత్ర పరిశ్రమకు ఆయన లేని లోటు తీర్చలేనిదని తెలిపారు. కోట శ్రీనివాస్‌రావు భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన పోషించిన విభిన్న పాత్రలతో తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. కోట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

**విభిన్నమైన పాత్రలతో అలరించిన మహా నటుడు కోట శ్రీనివాస రావు : ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

విభిన్నమైన పాత్రలతో వైవిధ్యభరిత నటనతో సినిమా అభిమానులను అలరించిన ప్రముఖ నటులు పద్మశ్రీ కోట శ్రీనివాస రావు మరణం విచారకరమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. 4 దశాబ్దాల పాటు సినీ, నాటక రంగాలకు ఆయన చేసిన కళా సేవ, ఆయన పోషించిన పాత్రలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. విజయవాడ ఎంఎల్‌ఎ కోట శ్రీనివాసరావు ప్రజాసేవలోనూ తనదైన ముద్రను వేశారన్నారు. కోట శ్రీనివాసరావు మరణం పట్ల నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రగాఢ సంతాపం ప్రకటించారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్లు ఆయన చెప్పారు. కోట శ్రీనివాసరావు మృతిపట్ల పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కోట శ్రీనివాస్ రావు మరణం బాధాకరమని వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాక్షించారు. విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు మరణం తెలుగు చిత్ర పరిశ్రమకు తీరని లోటు ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుణ్ణి ప్రార్థిస్తున్నానని తెలంగాణ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి పేర్కొన్నారు.

**వైవిధ్యమైన పాత్రలు పోషించిన గొప్ప నటుడు కోట శ్రీనివాసరావు : కూనంనేని సాంబశివరావు**

ప్రముఖ విలక్షణ నటుడు, మాజీ ఎంఎల్‌ఎ కోట శ్రీనివాసరావు మరణం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు సంతాపం తెలిపారు. కోటా శ్రీనివాసరావు చిత్ర పరిశ్రమలో అనేక వైవిద్యమైన పాత్రలు పోషించి ప్రేక్షకులను అలరించారన్నారు. ఆయన మరణం చిత్ర పరిశ్రమకు తీరని లోటని కూనంనేనిసాంబశివరావు పేర్కొన్నారు. కోట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

**కళామతల్లికి అంకితమైన కోటశ్రీనివాస రావు : డాక్టర్ కె.నారాయణ**

ప్రముఖ సినీ నటుడు కోట శ్రీనివాసరావు మరణం పట్ల సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. . కళామతల్లికి అంకితమమై సేవలందించిన విలక్షణమైన వ్యక్తి కోట శ్రీనివాస రావు మరణం కళారంగానికి తీరని లోటు అన్నారు. ఆయన సహజ నటనను ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరని నారాయణ పేర్కొన్నారు. కోట శ్రీనివాస రావు మరణం పట్ల నారాయణ ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు

**కోట శ్రీనివాసరావు మరణం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది : సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**

ప్రముఖ సినీ నటుడు కోట శ్రీనివాసరావు మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. కోట శ్రీనివాసరావు మరణం చిత్ర పరిశ్రమకు తీరని లోటన్నారు. ఆయన మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని , వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

**సినీరంగం ఓగొప్ప నటున్ని కోల్పోయింది : కెసిఆర్**

ప్రముఖ నటుడు కోటా శ్రీనివాసరావు మరణం పట్ల మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సంతాపం ప్రకటించారు. విభిన్న పాత్రలను పోషించి, ప్రేక్షక హృదయాల్లో తన స్థానాన్ని పదిలపరుచుకున్న విలక్షణ వెండితెర నటుడు కోటా శ్రీనివాసరావు అని కెసిఆర్ కొనియడారు. ఆయన మరణంతో సినీమా రంగం ఓ గొప్ప నటున్ని కోల్పోయిందని కెసిఆర్ విచారం వ్యక్తం చేశారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రాష్ట్రంలో రానున్న రెండు రోజులు మోస్తరు వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో రాగల రెండురోజులు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయన్నారు. ఆయా జిల్లాలకు అలెర్ట్ జారీ చేశామన్నారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్క తేలికపాటి నుంచి మోస్తరు కురుస్తాయన్నారు. గంటకు 30 నుంచి 40 బలమైన ఈదురుగాలులు వీస్తాయన్నారు.

# ప్రజా సమస్యలు గాలికి

### కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న బిజెపి ప్రభుత్వం
### భూపాలపల్లి జిల్లా సిపిఐ 5వ మహాసభలను ప్రారంభించిన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** బిజెపి ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలిందని, దేశంలో బిజెపి ప్రభుత్వం పేద వర్గాలకు న్యాయం చేయకుండా కార్పొరేట్ శక్తులకు, ఆదాని అంబానీలకు కొమ్ముకాసే విధానాలు అవలంబిస్తుందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రేగొండలో ఎస్ఎల్ఎన్ గార్డెన్‌లో సిపిఐ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 5వ మహాసభలు ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభలకు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా మహా సభల సందర్భంగా శ్రీనివాసరావు అరుణ పతాకాన్ని ఎగురవేసి మహా సభలను ప్రారంభించారు. అనంతరం ఇటీవలే మరణించిన అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించి సంతాపాన్ని తెలిపారు. ప్రతినిధుల సభకు కొరిమి సుగుణ, సొత్కు ప్రవీణ్ కుమార్, క్యాతరాజు సతీష్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ జిల్లా నివేదికను ప్రవేశపెట్టారు. ఈ మహా సభల సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బిజెపి అధికారంలోకి వచ్చే 12 సంవత్సరాలు గడుస్తున్నా ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని అన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని అన్నారు. ఎంతోమంది ప్రాణ త్యాగాలు చేసిన చరిత్ర సిపిఐ పార్టీదని, స్వతంత్ర ఉద్యమంలో బిజెపి ఆర్ఎస్ఎస్ పాత్ర శూన్యమని స్వతంత్ర ఉద్యమంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ ఎక్కడుందని ఆయన సూటిగా ప్రశ్నించారు. దేశంలో బడా పెట్టుబడిదారులు కార్పొరేట్ కంపెనీలకు బిజెపి ప్రభుత్వం ఊడిగం చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంతో సిపిఐ మద్దతు ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే గద్దె దించే శక్తి కమ్యూనిస్టులకే ఉందని ఇలాంటి ప్రజావ్యతిరేక విధానాల అవలంబిస్తే బిఆర్ఎస్ కు పట్టిన గతే కాంగ్రెస్ పార్టీకి పడుతుందని హెచ్చరించారు. పాలపల్లి జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వాలు నిధులు కేటాయించాలని జిల్లా అభివృద్ధికి తవిష్యత్తులో జిల్లా అభివృద్ధికి పాటుపడే విధంగా ఉద్యమాలు రూపొందించాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక శాతం ప్రజాప్రతినిధులను గెలిపించుకోవాలని కోరారు. పార్టీతోపాటు ప్రజాసంఘాలను బలోపేతం చేయాలని ఈ సందర్భంగా శ్రీనివాసరావు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మామిడాల సమ్మిరెడ్డి, పైళ్ళ శాంతి కుమార్ మాతంగి రామచందర్, కుడుదుల వెంకటేష్, పైళ్ల క్రాంతి కుమార్, పెరుమాండ్ల రాజయ్య, జి.సుధాకర్ రెడ్డి, గుంటి చంద్రమౌళి, మండల కార్యదర్శి పెంట రవి,నూకల భూలక్ష్మి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

#### నేడు బహిరంగ సభ, ర్యాలీ

సిపిఐ జిల్లా 5వ మహాసభల్లో భాగంగా నేడు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో నిర్వహించే ర్యాలీ, భారీ బహిరంగ సభను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ బహిరంగ సభకు సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావులు హాజరు కానున్నారని తెలిపారు. కావున జిల్లాలోని పార్టీ శ్రేణులు ప్రజా సంఘాలు ఏఐటీయూసీ నాయకులు, మేధావులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని రాజ్ కుమార్ విజ్ఞప్తి చేసారు.

## ఎప్పటికైనా శాంతి, సామరస్యతలే గెలుస్తాయి



మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎప్పటికైనా సమాజంలో శాంతి, సామరస్యతే గెలుస్తాయని, 'లాంగ్ లీవ్ గాంధీ' అని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. 'గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ స్వర్ణోత్సవాల' సందర్భంగా హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో 'మహాత్మా గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు స్వదేశీ మేళ'లో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాలకు మంత్రి సీతక్క పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఆలోచన విధానాన్ని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు ఇటువంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడ అభినందనీయమన్నారు. 1500 గాంధీ విగ్రహాలను ఏర్పాటు చేసి, వారి త్యాగాన్ని, ఆలోచన విధానాన్ని దేశానికి, సమాజానికి గుర్తు చేస్తున్నారన్నారు. గాంధీ బాటలోనే అందరూ నడిచి నియంతలను, దుర్మార్గులను తరిమి కొట్టామని చెప్పారు. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి నాయకత్వంలో గాంధీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామన్నారు. మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆలోచన విధానాన్ని గ్రామ గ్రామానికి తీసుకెళ్తున్నామని సీతక్క చెప్పారు.

## మహిళా సంఘాలకు.... సకాలంలో వడ్డీ లేని రుణాల చెల్లింపు



### ఈనెల 18 వరకూ నియోజకవర్గాల వారీగా చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళా సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన రూ.344 కోట్ల వడ్డీ నిధులను ఈనెల 18లోపు అన్ని మహిళా సంఘాల ఖాతాలలో జమ చేయనున్నారు. వడ్డీ రాయితీ చెక్కులతో పాటు ప్రమాద బీమా, రుణ బీమా చెక్కులను పంపిణీ చేయనున్నారు. నియోజకవర్గాల వారీగా మంత్రులు, ప్రజాప్రతినిధులు మహిళా సంఘాలకు చెక్కులను పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమం మహిళలకు ఆర్థిక భద్రతను కల్పించే దిశగా మరో కీలక అడుగుగా నిలవనుందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. కాగా 2019 నుంచి 2023 సంవత్సర మధ్యకాలంలో రూ.3,075 కోట్లకు పైగా వడ్డీ రాయితీలు బకాయిలుగా ఉన్నాయి.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశా నిర్దేశనలో, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చొరవతో పథకం మరింత సమర్థవంతంగా అమలవుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. బ్యాంకుల ద్వారా మహిళలు తీసుకునే రుణాలపై వడ్డీ రాయితీని ప్రభుత్వమే భరిస్తోంది. ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత రూ.518. 69 కోట్లు మహిళా సంఘాలకు వడ్డీల రూపంలో ప్రభుత్వం చెల్లించగా, ప్రస్తుతం తాజాగా మరో రూ.344.35 కోట్లను విడుదల చేసింది. దీంతో మహిళా సంఘాలకు మొత్తం రూ.862.04 కోట్లు విడుదల చేసింది. ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా అన్ని నియోజకవర్గాల్లో బ్యాం కుల ద్వారా మహిళా సంఘాలు తీసుకున్న రుణాలకు చెక్కుల రూపంలో వడ్డీలను ప్రభుత్వం చెల్లించనుంది. ప్రజా ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత సకాలంలో నిధులు జమవుతుండటంతో మహిళా సంఘాల్లో విశ్వాసం, ఉత్సాహం పెరిగిందని అధికారులు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభు త్వ చిత్తశుద్ధికి ప్రతీక అని సంఘాల సభ్యులు పేర్కొంటున్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారతే తమ ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి ఏటా రూ.25 వేల కోట్లకు తగ్గకుండా రుణాలను మహిళా సంఘాలకు సమకూర్చుతున్నామని చెప్పారు. మహిళల సంఘాలకు వడ్డీల భారం లేకుండా, వారి తరఫున ప్రభుత్వమే వడ్డీలను చెల్లిస్తుందని స్పష్టం చేశారు.

# ప్రజల చైతన్యంతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

### మేధావుల సదస్సులో ప్రొఫెసర్ హరగోపాల్

**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** గత పాలకుల విధానాల వల్ల విద్య, వైద్యం లాంటి మౌలిక రంగాలు నాశనమయ్యాయని, ప్రజల రాజకీయ చైతన్యంతో, రాజకీయ పార్టీల స్వభావంలో మార్పుతోనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బాగుపడి సమగ్రాభివృద్ధి జరుగుతుందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. అప్పుల ఊబిలో తెలంగాణ ప్రభుత్వం కారణాలు పరిష్కారాలు అనే అంశంపై హనుమకొండ జిల్లా కేంద్రం హరిత కాకతీయ హోటల్‌లో తెలంగాణ ఉద్యమకారుల వేదిక, ఫోరం ఫర్ బెటర్ వరంగల్ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన మేధావుల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వంలో రాష్ట్రానికి నాయకత్వం వహించిన కెసిఆర్ మేధావుల సూచనలను పట్టించుకున్న పాపాన పోలేదని, కెసిఆర్ ఎవరి మాట వినలేదని, నేటి పాలకులు మేధావుల సూచనలను విన్నప్పటి వాటి అమలుపై నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ఆర్థిక శాస్త్రంలో విశ్లేషణలు, సూచనలు ఉంటాయని, రాజకీయ శాస్త్రంలో, రాజకీయాల్లో పరిష్కారాలుంటాయని అన్నారు. విలువలు, ప్రజల అభివృద్ధి లేని రంగాల్లో అభివృద్ధి జరగడం వల్ల సమగ్ర అభివృద్ధి జరగడం లేదని, గత పాలకుల విధానాల వల్ల విద్య, వైద్య, వ్యవసాయ, ఉపాధి రంగాలు కుదేలయ్యాయని, ఆరోగ్యశ్రీ వల్ల ప్రభుత్వ ఆసుపత్రులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వల్ల ప్రభుత్వ విద్య నాశనమయిందని అన్నారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ మాట్లాడుతూ అన్ని రకాలుగా ఆగమైన వర్గాలకు న్యాయం జరిగే కొరకు ఏర్పడిన తెలంగాణలో దొరల పాలనలో మరింత ఆగమైందని, మానవాభివృద్ధితో కూడిన ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రణాళికలు రచించి అమలుపరచాలని, ఆర్థిక రంగాన్ని బాగుపరచే నూతన అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో మేధావులను, ఆర్థిక నిపుణులను, ఉద్యమకారులను భాగస్వామ్యం చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బాగుపడడానికి ప్రజల నుండి వారి విలువైన సూచనలను తీసుకోవడానికి రాష్ట్రమంతా సదస్సులను నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, ప్రొఫెసర్లు డి నర్సింహారెడ్డి, ఆర్ వి రమణమూర్తి, సదానందం, ఫోరమ్ ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షులు పుల్లూరు సుధాకర్, తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామమూర్తి, ఆల్ ఇండియా ఒబిసి జాక్ చైర్మన్ సాయిని నరేందర్, విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలకర శ్రీనివాస్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నమనేని జగన్ మోహన్ రావు లు మాట్లాడుతూ అప్పులు చేయని దేశం ఉండదని, అభివృద్ధి నమూనాలో అప్పులు సహజమని, వారసత్వంగా వచ్చిన అప్పుల నమూనాలో భాగంగానే కొత్తగా ఏర్పడిన తెలంగాణలో నయా ఉదారవాద ఆర్థిక విధానాల వల్ల ఆగమైందని అన్నారు. ఆర్థిక సహాయం అవసరం లేని పెద్ద రైతులకు పంట సహాయం చేయడం వల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు. ప్రత్యామ్నాయ వ్యవసాయ అభివృద్ధిని, ఉన్నత విద్య అభివృద్ధిని పట్టించుకోవాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించి ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలని అన్నారు. ఈ సదస్సు అతిథులకు వీరమల్ల బాబురావు స్వాగతం పలుకగా మల్లారెడ్డి, సంపత్ రెడ్డి, సుశీల, చాపర్తి కుమార్ గాడ్గే, డాక్టర్ ప్రవీణ్ కుమార్, బుసిగొండ ఓంకార్, వల్లాల జగన్ గౌడ్, సంఘాని మల్లేశ్వర్, కొంగ వీరాస్వామి, మేకల కేదారి యాదవ్, నలిగింటి చంద్రమౌళి, లంకా పాపిరెడ్డి, బొమ్మినేని పాపిరెడ్డి, పల్లపు సమ్మయ్య, న్యాయవాదులు విలాసాగరం సురేందర్ గౌడ్, ఎగ్గడి సుందర్ రామ్, జన్ను పద్మ, బండి మొగిలి, జె జె స్వామి, వివిధ సంఘాల నాయకులు పెండ్లి అశోక్ బాబు, మంద వీరస్వామి, పరిశరాములు, తిరుపతి, బట్టి శ్యామ్ యాదవ్, దిడ్డి ధనలక్ష్మి, సద్గుణ, సురేఖ, స్వరూప, గోధుమల కుమారస్వామి, కొంగర జగన్, సాంబలక్ష్మి, సూరం నిరంజన్, కూరపాటి భార్గవి, సద్గుణ, రౌతు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## మార్కెట్‌లోకి 'కాక్‌టెయిల్స్' కలెక్షన్ వాచ్‌లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** టైటాన్ రాగ నేతృత్వంలో మార్కెట్‌లోకి 'కాక్‌టెయిల్స్' కలెక్షన్ సరికొత్త లేడీస్ వాచ్‌లను ఆదివారం విడుదల చేసింది. హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో టైటాన్ రాగ, మల్టీ బ్రాండ్ రిటైల్‌నేషనల్ సేల్స్ హెడ్ రాహుల్ పాండే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేటి మహిళలు తమదైన ముద్ర వేయడానికి ఈ వాచ్‌లను విడుదల చేశామని తెలిపారు. రాగ భాగస్వామి అయిన కమల్ వాచ్ కంపెనీ డైరెక్టర్ రాజేందర్ తోట్ల ప్రత్యేకంగా రూపొందించిన స్టేట్‌మెంట్ వాచ్‌ల ప్రత్యేక ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో థీమ్ ఇన్‌ఫ్లుయెన్సర్లు లక్ష్మి రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.



## సామాజిక న్యాయం కల్పించడమే కాంగ్రెస్ లక్ష్యం


### సీనియర్ కాంగ్రెస్ నేత మురళి గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో బిసిలకు రిజ్వేషన్‌లు అమలు చేసేందుకు కట్టుబడి ఉందని సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుర్రం మురళి గౌడ్ అన్నారు. ప్రత్యేక ఆర్డినేన్స్ తీసుకొచ్చి, స్థానిక సంస్థలల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించేందుకు కేబినెట్ నిర్ణయించినందున మురళి గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఆదివారం నాయకులు, కార్యకర్తలతో బాణసంచా కల్చి హర్షం వ్యక్తం చేశారు. స్థానికులు స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా మురళి గౌడ్ మాట్లాడుతూ బిసిలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లు కల్పించేందుకు నిర్ణయం తీసుకున్న సిఎం రేవంత్ రెడ్డి, కేబినెట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జనాభాలో అత్యధిక శాతం ఉన్న బిసిలకు రిజర్వేషన్‌లు కల్పించడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా కులగణనను విజయవంతంగా పూర్తి చేసిన రాష్ట్రం తెలంగాణ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నూటికి నూరు శాతం సామాజిక న్యాయం అమలు చేయడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి రమేష్, వినోద్, మహ్మద్ గౌస్, మహ్మద్ ఖాదర్, వెంకట్, చంద్రమౌళి పాల్గొన్నారు.



బోయిన్‌పల్లిలోని వెజిటేబుల్ మార్కెట్ హమాలీ యూనియన్ (ఎఐటియూసి) ఆధ్వర్యంలో నిర్వహించిన మహంకాళి బోనాల ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించిన సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ బాబు, ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ్మ, హమాలీ యూనియన్ నాయకులు..

## బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రాణాలు



### విందు ఏర్పాటు చేసిన మంత్రి పొన్నం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉజ్జయిని మహంకాళి బోనాల పండుగను పురస్కరించుకొని ఆదివారం హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ బంజారాహిల్స్‌లోని తన అధికారిక నివాసంలో విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, కొండ సురేఖ, వాకిటి శ్రీధర్, జూపల్లి కృష్ణారావు, ప్రముఖ సినీనటి, ఎమ్మెల్సీ విజయశాంతి, ఎంపిలు రఘునందన్ రావు, అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపిలు కె.కేశవ్‌రావు, వి.హనుమంతరావు, కాంగ్రెస్ నాయకులు మహ్మ ద్ హజరుద్దీన్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా ఈ సందర్భంగా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులను కలిశారు. మంత్రి మాతృమూర్తిని కలిసి, బాగోగులు అడిగి తెలుసుకున్నారు.

# 'క్యూన్యూస్' కార్యాలయంపై ఎమ్మెల్సీ కవిత అనుచరుల దాడి

### గాల్లోకి గన్‌మెన్ ఐదు రౌండ్ల కాల్పులు
### మల్లన్న చేతికి స్వల్ప గాయాలు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతనిధి :** ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నకు చెందిన మేడ్చల్ జిల్లా మేడిపల్లిలోని క్యూన్యూస్ కార్యాలయంపై ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి కార్యాలయంలోని ఫర్నీచర్, కంప్యూటర్లను ధ్వంసం చేసారు. ఈ దాడిలో తీన్మార్ మల్లన్న చేతికి స్వల్ప గాయాలు కాగా ఆయననను రక్షించే క్రమంలో దాడికి పాల్పడిన వారిని అదుపు చేసేందుకు ఆయన గన్‌మెన్‌లు గాల్లో ఐదు రౌండ్ల కాల్పులు జరిపారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితపై ఆమె చేస్తున్న బిసి ఉద్యమాన్ని మల్లన్న తప్పు పడుతూ అనుచిత వ్యాఖ్యలు చేసారన్న ఆగ్రహంతో బిఆర్ఎస్ కార్యకర్తలు, జాగృతి సంస్థకు చెందిన ఆమె అనుచరులు ఈ దాడికి పాల్పడ్డారని పోలీసుల ప్రాథమిక విచారణలో తేల్చిచెప్పారు. క్యూన్యూస్ కార్యాలయంలో మల్లన్న ఉన్న సమయంలో ఒక్కసారిగా ఎమ్మెల్సీ కవితకు బేషరతుగా మల్లన్న క్షమాపణ చెప్పాలంటూ కార్యాలయంపై పెద్ద సంఖ్యలో చొచ్చుకొని వచ్చి ఆమె అనుచరులు ఫర్నీచరును ధ్వంసం చేస్తూ అక్కడి సిబ్బందిపైనా దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో వారిని క్యూన్యూస్ సిబ్బంది సైతం అడ్డుకోవటంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. అదే సమయంలో బయటకు వచ్చిన మల్లన్న చేతికి స్వల్ప గాయాలయ్యాయి. మల్లన్న గన్‌మెన్‌లు దాడికి వచ్చిన వారిని వెళ్లి పొమ్మని ఎంత నచ్చచెప్పినా వినకుండా దాడులను తీవ్రతరం చేస్తుండటం, పరిస్థితి అదుపు తప్పుతుండటంతో చేసేది లేక గన్‌మెన్ గాల్లోకి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో దాడికి వచ్చిన జాగృతి కార్యకర్త సాయికి బుల్లెట్ గాయాలవటంతో అతడిని రామ్‌నగర్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయంపై సమాచారం అందుకొన్న పోలీసులు అక్కడికి చేరుకొని దాడికి పాల్పడిన వారిలో కొందరిని అదుపులో తీసుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొని వచ్చారు. ఈ సంఘటనపై సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నామని మల్కాజిగిరి డిసిపి పద్మజ తెలిపారు. అనంతరం రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఘటన జరిగిన క్యూన్యూస్ కార్యాలయాన్ని స్వయంగా పరిశీలించి మీడియాతో



మాట్లాడుతూ గన్‌మెన్‌ల వల్ల కానీ, గాల్లోకి కాల్పులు జరపటం వల్ల కానీ ఎవరికీ గాయాలు కలుగలేదని, ఇరువర్గాల మధ్య జరిగిన తోపులాటలో కార్యాలయ అద్దాలు పగిలిపోవటం, కొందరికి గాజు పెంకులు గుచ్చుకొని రక్తపు గాయాలయ్యాయని, దాడి చేసిన వారిని జాగృతి కార్యకర్తలను అదుపులోకి తీసుకొని సిసి పుటేజి దృశ్యాల ఆధారంగా విచారణ జరుపుతామని తెలిపారు.

**హత్యాయత్నం చేసేందుకు వస్తారా, తేల్చుకొందాం అన్న మల్లన్న**

దాడి సంఘటనపై తీన్మార్ మల్లన్న జాగృతి కార్యకర్తలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు.. కవిత ఫ్రస్టేషన్‌తోనే మాపై హతమార్చటానికే గూండాలను పంపించిందని ఆరోపించారు. ఇలాంటి డాడులతో భయపడేది లేదని, ఇక తాడో పేడో తేల్చుకుంటామన్నారు.

## కవితకు మల్లన్న క్షమాపణ చెప్పాలి

### మధుసూదనా చారి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బిఆర్ఎస్ శాసనమండలి ప్రధాన ప్రతిపక్ష నేత మధుసూదనా చారి అన్నారు. మహిళల గౌరవాన్ని కాపాడటం మన సంస్కృతి అని, వ్యక్తిగత దూషణలు, మహిళలను కించపరిచే వ్యాఖ్యలకు రాజకీయాల్లో చోటు లేదని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తీన్మార్ మల్లన్న వెంటనే కవితకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## కవితపై తీన్మార్ వ్యాఖ్యలు గర్హనీయం

### మల్లన్న కార్యాలయంపై దాడి చట్ట వ్యతిరేకం: టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

మహిళలను గౌరవించుకోవడం మన సంప్రదాయమని, ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలు ఖండించాల్సిందేనని, అదే సమయంలో మల్లన్న కార్యాలయంపై దాడి చట్ట వ్యతిరేకమని, చట్ట పరిధిలో అందరూ పని చేసుకోవాలని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కవితపై మల్లన్న చేసిన వ్యాఖ్యలు గర్హనీయమన్నారు. మల్లన్న కార్యాలయంపై దాడి, గన్‌మెన్ కాల్పులు జరిపిన అంశాలపై వచ్చిన ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ జరుగుతుందని మహేష్ కుమార్ గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిసి బిల్లు, రిజర్వేషన్లు అన్ని కాంగ్రెస్ కృషి ఫలితమేనని, బిసి రిజర్వేషన్ల అంశంలో ఇతరులు లబ్ధి పొందాలని చూడడం సమంజసం కాదని ఆయన హితవు పలికారు.

## ఎమ్మెల్సీ మల్లన్నపై కవిత ఫిర్యాదు



ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని, జాగృతి జాగృతి అధ్యక్షులు, ఎమ్మెల్సీ కవిత కార్యకర్తలపైన కాల్పులకు పాల్పడిన మల్లన్న గన్‌మెన్‌ను విధుల నుంచి సస్పెండ్ చేయాలని కవిత డిమాండ్ చేశారు. తీన్మార్ మల్లన్న మాట్లాడిన తీరు పట్ల తమ కార్యకర్తలకు కోసం వచ్చి నిరసన వ్యక్తం చేశారని, ఇంత మాత్రానికే కాల్పులు చేసి చంపేస్తారా? అని ప్రశ్నించారు. ఒక ఆడబిడ్డ ప్రశ్నిస్తే సహించలేకపోతున్నారని, ఇక తాను ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా, కించపర్చేలా చేసిన వ్యాఖ్యలపై తగిన చర్యలు తీసుకునేలా 'కమిటీ ఆన్ ఎథిక్స్'కు రెఫర్ చేయాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం రాష్ట్ర ఐజి (ఎల్ అండ్ఆర్) రమణకుమార్‌ను డిజిపి కార్యాలయంలో కలిసి కవిత ఫిర్యాదు చేశారు.



# సాహితీ విహారి



ఎస్‌వి సత్యనారాయణ
పూర్వ ఉపకులపతి, పొ.శ్రీ. తెలుగు విశ్వవిద్యాలయం

## ఎర్రజెండా కవి ఏటుకూరి

'ఎర్రజెండేరా తమ్ముడ
ఎర్రజెండేరా మనది
ఎర్రజెండేరా తమ్ముడ !
ఎర్రజెండేరా
'ఎర్రజెండరా త్యాగాల కండరా'.....
'ఎర్రబాటరా ఇదే ఎర్రపాటరా
శ్రమవీరుల రక్తంతో ఎరుపెక్కిన బాటరా'

అభ్యుదయ సాహిత్యోద్యమంలోకి, ప్రజానాట్యమండలి సాంస్కృతికోద్యమంలోకి అప్పుడప్పుడే ప్రవేశిస్తున్న మా తరాన్ని అపారంగా ప్రభావితం చేసిన ఉద్యమ గీతాలవి. ఈ పాటలు రచించిన ఉద్యమకవి ఏటుకూరి ప్రసాద్. ఎర్రజెండా నీడలో ఎర్రపాటలు పాడుతూ, ఎర్రబాటపై నడుస్తున్న ఉద్యమబాటసారి ఆయన. కేవలం కవి మాత్రమే కాదు.. ఆధునిక తెలుగు సాహిత్యంలో నిర్విరామ కృషిని కొనసాగిస్తున్న మౌనకృషీవలుడు కూడా. పరిచయమైన ప్రతి వ్యక్తినీ ప్రభావితం చేసే స్నేహశీలి. ఎంతో మంది యువ పరిశోధకులకు అప్రకటిత మార్గదర్శకుడు. తమ ఇంటి గ్రంథాలయం నుండి విలువైన, అరుదైన గ్రంథాలను పరిశోధకులకు ఇవ్వడమే కాక, తగిన సూచనలు, సలహాలనిస్తూ ఉత్సాహపరిచే సౌజన్యశీలి ప్రసాద్. 1970వ దశకంలో హైదరాబాద్ నగరంలో ఒకవైపు 'యువభారతి' నెల నెలా కార్యక్రమాలతో యువ సాహితీవేత్తల్ని సంప్రదాయ సాహిత్యం వైపు ఆకర్షిస్తూ వుండేది. మరోవైపు విప్లవ సాహిత్య ఉధృతి యువతరంపై బలమైన ప్రభావం వేస్తూ ఉండేది. అలాంటి పూర్వరంగంలో అభ్యుదయ సాహిత్యోద్యమ వారసత్వాన్ని కొనసాగిస్తూ, ఇటువైపున రచయితల్ని ఆకర్షించి నిలపడం, ముందుకు నడిపించడం కత్తిమీద సాము. ఈ బాధ్యత నిర్వహించిన రథసారథులు రాంభట్ల, తుమ్మల, గజ్జల మల్లారెడ్డిలు కాగా అందులో ప్రసాద్ పాత్ర విశిష్టమైనది. అభ్యుదయ సాహిత్యోద్యమ విస్తృతికి ఉపయోగపడింది. జాతీయ స్థాయిలో అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఏర్పడిన 1936వ సంవత్సరం జులై 19న గుంటూరులోని అరండల్‌పేటలో వజ్రమ్మ, కోటయ్య దంపతులకు పుట్టిన రెండవ సంతానం ఆయన. గుంటూరులోని మాజేటి గురవయ్య హైస్కూల్‌లో ప్రసాద్ ప్రాథమిక విద్య పూర్తయింది. దేశభక్త కుటుంబంలో పుట్టడం, ఇంట్లో కాంగ్రెస్ రాజకీయ సమావేశాలు జరగడంతో బాల్యం నుండే ఆయనకు రాజకీయాల పట్ల అవగాహన ఏర్పడసాగింది. పెదనాన్న సీతారామయ్య ప్రభావం, వారి కుమారులు బలరామమూర్తి, కృష్ణమూర్తిల సాహచర్యం ప్రసాద్‌ని కమ్యూనిస్టు భావాల వైపు ఆకర్షించాయి. 1951లో గుంటూరులోని హిందూ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరగానే అఖిల భారత విద్యార్థి సమాఖ్య సభ్యులయ్యారు. అదే సంవత్సరం గుంటూరులో జరిగిన శాంతి సంఘం మహాసభలకు శ్రీశ్రీ మొదలైన సాహితీవేత్తలెందరో హాజరయ్యారు. విద్యార్థి సమాఖ్య పక్షాన శ్రీశ్రీకి ప్రసాద్ వలంటీర్‌గా వ్యవహరించారు. శ్రీశ్రీ పాటలు విని ఉత్తేజితులయ్యారు. తరువాతి కాలంలో హిందూ కాలేజీ తెలుగు అసోసియేషన్ కార్యదర్శిగా ప్రసాద్ ఎన్నికయ్యారు. 'గుంటూరు వాణి' పత్రికలో ప్రూఫ్ రీడర్‌గా చేరి, ఆ పత్రికకు కొన్ని వ్యాసాలు రాశారు. వట్టికొండ విశాలాక్షి నడిపిన 'ప్రజావాణి' పత్రిక ఇయర్స్‌కు ప్రసాద్ కవితలు రాశారు. 1955లో ఆయన హిందూ కాలేజీలోనే బి.ఎ. కోర్సులో చేరారు. అప్పటి ఆంగ్ల అధ్యాపకులు అమరేంద్ర (చతుర్వేదుల నరసింహశాస్త్రి) ప్రతిరోజూ క్లాసు ముగిసే లోపు శ్రీశ్రీ కవితలు వినిపించేవారు. అమరేంద్ర ప్రోద్బలంతోనే ప్రసాద్ 1955లో అరసం సభ్యత్వం స్వీకరించారు. 1957లోనే విశాఖలో తమ సీనియర్లయిన కె. సత్యమూర్తి, సహవిద్యార్థులైన వకుళాభరణం రామకృష్ణ, ఆర్వీఆర్‌లతో కలిసి 'ప్రగతి' అనే రాత పత్రికను వెలువరించారు. రాజకీయ తరగతులకు హాజరయ్యారు. 1958లో ఉదయపూర్‌లో జరిగిన అఖిలభారత విద్యార్థి సమాఖ్య జాతీయ మహాసభలకు ఆంధ్ర రాష్ట్ర ప్రతినిధుల నాయకుడిగా హాజరయ్యారు. సభా నిర్వహణలో అధ్యక్షవర్గ సభ్యులుగా క్రియాశీలంగా పాల్గొన్నారు. సమాఖ్య జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

1960లో బి.ఎ.ఆనర్స్ పూర్తిచేసిన ప్రసాద్ గుంటూరు ఎ.సి. కళాశాలలో తెలుగు ట్యూటర్‌గా పనిచేస్తూనే ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ వారి 'యువజన' పత్రిక సంపాదక బాధ్యతలు స్వీకరించి తర్వాత పార్టీ నిర్ణయం మేరకు హైదరాబాద్‌కు మకాం మార్చారు. తాపీ ధర్మారావు వంటి సాహితీ ప్రముఖుల సాహచర్యం లభించింది. పత్రిక బాధ్యతలు నిర్వర్తిస్తూనే 1961వ సంవత్సరంలో హైదరాబాద్ పాత నగరంలోని 'అగర్వాల్ శిక్షా సమితి' వారి మల్టీపర్పస్ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయులుగా చేరారు. 1970లో జూనియర్ లెక్చరర్‌గానూ, 1980లో డిగ్రీ అధ్యాపకులుగాను పదోన్నతిని పొందిన ప్రసాద్ 1994 జులై 31న ఎస్‌డిఎస్‌డిగ్రీ పిజి కళాశాలలో రీడర్‌గా పదవీ విరమణ పొందారు. 1970–73 మధ్య కా లంలో అరసం పునర్నిర్మాణ ప్రయత్నాల్లో ప్రసాద్ చురు గ్గా పాల్గొన్నారు. హిమాయత్‌నగర్‌లోని 'ఇస్కస్' కార్యాలయం మేడమీద ప్రతి ఆదివారం సాయంత్రం సాహితీ సమావేశాలు, సాహిత్య తరగతులు జరిగేవి. వీటి ద్వారా పలువురు యువ రచయితలు ఉద్యమానికి సన్నిహితులయ్యారు. హైదరాబాద్ నగర అభ్యుదయ రచయితల సం ఘ నిర్మాణంలోను, రాష్ట్ర 'అరసం' పునర్నిర్మాణంలోను ప్రముఖమైన పాత్రను నిర్వహించిన ప్రసాద్, 1973లో గుంటూరులో జరిగిన ఆంధ్రప్రదేశ్ 'అరసం' రాష్ట్ర మహాసభల్లో కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1979లో కాకినాడలో జరిగిన రాష్ట్ర 'అరసం' మహాసభల్లో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై, దాదాపు దశాబ్దకాలానికిపైగా సంస్థ విస్తృతికి విరామమెరుగక కృషి చేశారు. ఎందరో యువ కవు లు, రచయితలు అభ్యుదయ సాహిత్యోద్యమానికి సన్నిహితం కావడానికి ఏటుకూరి ప్రసాద్ చేసిన కృషి ఫలితంగా ఉద్యమం కొత్త రక్తాన్ని నింపుకుని, పురోగమిస్తున్నది. 1982 డిసెంబర్‌లో జయపూర్ (రాజస్థాన్)లోనూ, 1986 ఏప్రిల్‌లో లక్నో (ఉత్తరప్రదేశ్)లోనూ జరిగిన 'అఖిల భారత అభ్యుదయ రచయితల సమాఖ్య' జాతీయ మహాసభల్లో డా॥ ఏటుకూరి ప్రసాద్ సమాఖ్య జాతీయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 'తాపీ ధర్మారావు జీవితంరచనలు' అన్న అంశంపై ప్రామాణికమైన పరిశోధన చేసిన ప్రసాద్‌కి 1983లో ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేసింది. విషయ సేకరణలోనూ, విశ్లేషణలోనూ ఈ గ్రంథం నేటికీ పరిశోధకులకు ఒక దారి దీపంలా తోడ్పడుతున్నది. 2023 సెప్టెంబర్‌లో పున:ముద్రణ చేయబడింది. 1980–92 మధ్య కాలంలో 'అభ్యుదయ' మాస పత్రికకు సంపాదక బాధ్యతలు వహించిన ప్రసాద్ నవల, వాడుక భాష, విమర్శ, కవిత్వంపై విశేష సంచికలు వెలువరించారు. మక్సిం గోర్కీ, రోణంకి అప్పలస్వామిలపై ప్రత్యేక సంచికలు తెచ్చారు. 'అరసం' స్వర్ణోత్సవాల సందర్భంగా 'అభ్యుదయ' 50 ఏళ్ళ పత్రాల ప్రత్యేక సంచిక ప్రసాద్ పట్టుదలకు, నిబద్ధతకూ కొలమానంగా రూపొందింది. 1983లో శ్రీశ్రీ మరణానంతరం శ్రీశ్రీ స్మారక సంస్థను నెలకొల్పి, అరసం సహకారంతో ప్రసాద్ 'మాచిరాజు దేవీప్రసాద్ పారడీలు', 'సాహిత్యాభ్యుదయ ం', 'కొంపెల్ల జనార్దనరావు జీవితంసాహిత్యం', 'శిష్ట్లా ఉమామహేశ్వరరావు కవిత్వం సమాలోచన', 'తుమ్మల వెంకట్రామయ్య జీవితం సాహిత్యం', వై. విజయకుమార్ 'సాహిత్యం వాస్తవికత' మొదలైన అరుదైన గ్రంథాలను వెలువరించారు. ప్రసాద్ రూపొందించిన 'పొయెట్రీ వర్క్‌షాప్' అన్న గ్రంథం కేవలం భారతీయ సాహిత్యంలోనే కాదు, ప్రపంచ సాహిత్యంలోనే ఒక అరుదైన రికార్డు. 1862–1962 (వంద సంవత్సరాల) మధ్యకాలంలో పు ట్టిన వందమందికి పైగా కవులు స్వదస్తూరితో రాసిన కవితలను సేకరించి, వెలువరించిన గొప్ప గ్రంథమిది. జాషు వా దస్తూరితో కవితను సేకరించడానికి ప్రసాద్ పడిన శ్రమ నాకు ప్రత్యక్షంగా తెలుసు. గురజాడ మొదలుకొని యాకూబ్‌దాకా సాహిత్య రంగంలో నిరంతర కృషిని కొనసాగిస్తున్న మొన్న, నిన్న, నేటితరం కవుల కవితలను సేకరించడంలో ప్రసాద్ ఆబ్జెక్టివిటీని ప్రదర్శించారు. సిద్ధాంత విభేదాలతో, భిన్నాభిప్రాయాలతో ప్రమేయం లేకుండా ఈ గ్రంథ రూపకల్పనను ఒక యజ్ఞంలా భావించి పూర్తిచేశారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌కి ఎక్కవలసిన ఈ గ్రంథానికి లభించాల్సినంత గుర్తింపు లభించలేదనే చెప్పాలి. 2022 అక్టోబర్‌లో పున:ముద్రణ చేయబడింది. ప్రసాద్ నిర్విరామకృషికి గుర్తింపుగా 'విజయలక్ష్మి స్మారక పురస్కారం', 'తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం', 'అమరజీవి పులుపుల శివయ్య సాహితీ సత్కా రం', 'తుమ్మల సాహితీ పురస్కారం', 'తాపీ ధర్మారావు సాహితీ పురస్కారం', 'శ్రీశ్రీ సాహితీ పురస్కారం', 'విశాలాంధ్ర ప్రచురణాలయం వారి సత్కారం' మొదలైన ఎన్నో పురస్కారాలు, సన్మాన సత్కారాలు లభించాయి. 1960 దశకం చివరి నాటికి తెలుగు సాహిత్యరంగంలో 'వచన కవిత' విజృంభించి, గేయ కవిత్వం నిరాదరణకు గురవుతున్న రోజుల్లో సుబ్బారావు ప్రాణిగ్రాహి, శివసాగర్, గద్దర్ తప్ప, తక్కిన కవులందరూ వచనాన్నే ఆశ్రయించిన **పూర్వరంగంలో 1968లోనే..**

**'ఎర్రజెండేరా తమ్ముడ ఎర్రజెండేరామనది
ఎర్రజెండేరా తమ్ముడ ! ఎర్రజెండేరా'**

అన్న పల్లవితో ప్రసాద్ రాసిన పాట దాదాపు అన్ని వామపక్ష రాజకీయ పార్టీలకు, ట్రేడ్ యూనియన్‌లకు, వ్యవసాయ కార్మిక సంఘాలకు, యువజన విద్యార్థి సంఘాలకు ప్రార్థనా గీతమయ్యింది. 1968 నుండి 1972 వరకు ఈ కవి రాసిన పాటల సంపుటిని ''ఎర్రజెండా'' పేరుతో ఆంధ్రప్రదేశ్ యువజన సమాఖ్య 1972లో ప్రచురించింది. ఈ పాటల సంపుటికి 'సంజాయిషీ' పేరుతో సుప్రసిద్ధ విమర్శకులు రాంభట్ల కృష్ణమూర్తి రాసిన విపులమైన పీఠిక ఆనాటి సాహిత్య వాతావరణానికి కావలసిన సైద్ధాంతిక దిక్సూచిలా నిలిచింది. తెలుగుపీఠికా సాహిత్యంలో అదొక విశిష్టమైన రచన. ఆ తరువాత 1975లో 'ఎర్రబాట', 1976లో 'పోరాటం' గీతికా సంపుటులు వెలువడి, వీరి పాటలు విశేష జనాదరణ పొందాయి. 2021 ఏప్రిల్‌లో 'జనం నుంచి... జనంలోకి' పాటల పుస్తకం వెలువరించారు. గత ఆరు దశాబ్దాలుగా తెలుగునాట సంభవించిన పరిణామాలకూ, పెల్లుబికిన ప్రజాపోరాటాలకూ ఈ పాటలు అద్దం పడుతున్నాయి. పోరాటం ఈ పాటలకు పల్లవి. ఎర్రజెండా ఈ గీతాలకు ఊపిరి. వర్గరహిత, వర్ణరహిత సమసమాజ నిర్మాణం ఈ పాటల లక్ష్యం. ఇందులో పీడిత తాడిత ప్రజల అనుభవాలు, ఆగ్రహాలు ఉన్నాయి. ఉద్యమ చైతన్యం అంతర్లయగా ఉన్నది. ప్రసాద్ రచించిన 'ఆరనిజ్వాల', 'శివాలయ్య' నృత్యరూపకాలను ఆం.ప్ర.ప్రజానాట్యమండలివారు అనేక వేదికలపై ప్రదర్శించారు.



కవిగా, విమర్శకులుగా, పరిశోధకులుగా, ఉత్తమ గ్రంథాలకు సంపాదకులుగా బహుముఖీయమైన కృషిని కొనసాగిస్తున్న ప్రసాద్ 'విశాలాంధ్ర ప్రచురణాలయం' సంపాదకులుగా అనేక అరుదైన, విలువైన గ్రంథాల ముద్రణకు, పునర్ముద్రణకు కృషి చేశారు. రాష్ట్ర విభజనానంతరం ఏర్పడిన నవచేతన ప్రచురణాలయం సంపాదకులుగా ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 89 సంవత్సరాలు పూర్తి చేసుకుంటూ 90వ జన్మదినోత్సవాన్ని జరుపుకోబోతున్న ప్రసాద్ ఈ వయసులోనూ సాహిత్య సృజన పరిశోధన రంగాల్లో విరామ మెరుగక పరిశ్రమిస్తూనే ఉన్నారు. ఇదివరకే శిష్ట్లా ఉమామహేశ్వర రావు జీవితాన్ని, సాహిత్యాన్ని తెలుగు పాఠకులకు పరిచయం చేసిన ప్రసాద్ గారు యామిజాల ఆనంద్ సహకారంతో 'శిష్ట్లా ఉమామహేశ్వర రావు సర్వలభ్య సంపుటి'ని ఇటీవల ప్రచురించారు. అలాగే 'కొంపెల్ల జనార్ధన రావు సర్వలభ్య సంపుటి'ని రూపొందించే పనిలో ఉన్నారు. తమ ఉద్యమ సహచరులు, సమకాలికులుకందిమల్ల ప్రతాపరెడ్డి ఎంతో శ్రమకోర్చి రూపొందించిన 'రాలిన రత్నాలు' గ్రంథ చిత్తుప్రతిని అక్షరాక్షరం చదివి అక్షర దోషాలను సరిచేశారు. తను ప్రోత్సహించి, వెన్ను తట్టిన అరసం కార్యకర్త, కావ్యకర్త వేల్పుల నారాయణ కథల సంపుటి 'వెలుగుల వెనుక' గ్రంథాన్ని నిండు హృదయంతో ఆహ్వానించారు. విశాలాంధ్ర ప్రచురణాలయం, నవచేతన ప్రచురణాలయం ప్రచురించిన వందలాది గ్రంథాలకు అట్ట వెనుక విశ్లేషణ, పరిచయాలను రాశారు. ఇంకా రాస్తూనే ఉన్న డాక్టర్ ఏటుకూరి ప్రసాద్ ఒక నిర్విరామ కర్మయోగి.

**(జులై 19న ఏటుకూరి ప్రసాద్ జన్మదినోత్సవం సందర్భంగా)**



## ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై రచనలకు ఆహ్వానం

ప్రజాయుద్ధం నౌక గద్దర్ అమరత్వంపై, ఆయన సాహిత్య సాంస్కృతిక విశిష్టత, కృషిని చెప్తూ వచ్చిన పాటలను ,కవిత్వం, వ్యాసాలను గద్దర్ ఫౌండేషన్ ఆహ్వానిస్తున్నది. నేటి సమాజానికి ఆయన చేసిన సాహిత్య, సాంస్కృతిక కృషిని, పోరాట చరిత్రను ప్రజలకు మరింత చేరువలోకి తీసుకెళ్లే ప్రయత్నంలో భాగంగా, కవులు, రచయితలు, ప్రజా కళాకారులు మేధావుల నుంచి ఆయన సాహిత్యం వ్యాసాలు, పాటలను ఆహ్వానిస్తున్నట్టు ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి జివి సూర్య కిరణ్ తెలిపారు. గద్దర్ సాహిత్యాన్ని, ఆయన సామాజిక ఉద్యమ చరిత్రను ప్రజలకు అందించే ప్రయత్నంగా, తమకు అందిన రచనలన్నింటినీ ప్రచురించి ఒక పుస్తక రూపంలో తీసుకురావాలని గద్దర్ ఫౌండేషన్ తలపెట్టింది. పాటలు, కవితలు ఇంతకుముందు ఎక్కడైనా ప్రచురితమైనా, కాకపోయినా పంపించాల్సిందిగా కోరింది. దీనితోపాటు యూట్యూబ్ చానల్‌లో ఉన్న పాటలను రచయితల అనుమతితో ప్రచురించాలని నిర్ణయించింది. కాబట్టి రచయితలంతా తమ పాటలను పంపించాలని కోరింది. రచనలు, పాటలను పంపించాల్సిన వారు.. వాట్సాప్ నెంబర్ +917396065999, +919000744l8కు గానీ, Email: info@gaddarfoundation.org కు గాని పంపించాలి. ప్లాట్ నెంబర్ : 26, ఇంటి నెంబర్ : 23/ 126/ 1/A, BESIDE NALL POCHAMMA TEMPLE BHOODEVI NAGAR COLONY, SECUNDERABAD: 500 015 అనే చిరునా మాకు పోస్టులో కూడా పంపవచ్చు. రచనలు పంపే వారు తమ అడ్రస్, ఫోన్ నెంబర్‌తో పాటు ఒక పాస్‌పోర్ట్ సైజు ఫోటో కూడా పంపించాల్సి ఉంటుంది.

ఈ వారం కవితలు

## జ్వాలలు రగిలించు

పారిపోకు, సమాజం చీకటి కమ్మినా,
నీ చుట్టూ అన్యాయం కత్తులు తిప్పినా,
భయం నీ గుండెను బంధించినా,
నీ రక్తంలో విప్లవ జ్వాల రగిలించు!
కన్నీటి సముద్రం నీ కళ్లలో నిండినా,
చీకటి గొలుసులను తెంచుకో,

అణచివేత గోడలను కూల్చివేయ్,
నీ గళంలో గర్జన ఉద్భవించనీ,
విప్లవ గీతం ప్రతి హృదయంలో మార్మోగనీ!
ఎదురు తిరుగు, ఎదిరించు, ఎగసిపడు,
సమాజం సౌరభం నీ చేతుల్లో పూయనీ,
నీ పిడికిలిలో ధైర్యం, నీ నడకలో విజయం,

విప్లవం నీ ఊపిరిలో జనించనీ!
నీ ఆత్మలో స్వాతంత్ర్య గీతం పాడనీ,
అసత్య గోడలను కాల్చి బూడిద చేయనీ,
ప్రతి అడుగులో న్యాయ దీపం వెలిగించు,

**రాము కోలా**
**9849001201**



## మఖ్దూం భవన్... మఖ్దూం భవన్..

మఖ్దూం భవన్ మఖ్దూం భవన్
సెల్యూట్ టూ యూ మఖ్దూంభవన్
రెడ్ సెల్యూట్ టూ యూ మఖ్దూం భవన్

ప్రకృతి ఒడిలో వసంతకాలం
హరిత అందమై మురిసినట్లు
మబ్బులు కమ్మిన ఆకాశం
అరుణబింబమై వెలిగినట్లు
వెలుగుతున్నది మన మఖ్దూం భవన్
మఖ్దూం భవన్ మఖ్దూం భవన్
సెల్యూట్ టూ యూ మఖ్దూం భవన్
రెడ్ సెల్యూట్ టూ యూ మఖ్దూం భవన్

అమరవీరుల సమర చరితవు
సమరయోధుల రగల్ జెండవు
కార్మిక శ్రేణుల కంటిపాపవు
పోరాట రచనకు కేంద్ర బిందువు
మఖ్దూం భవన్ మఖ్దూం భవన్
సెల్యూట్ టూ యూ మఖ్దూం భవన్ రెడ్
సెల్యూట్ టూ యూ మఖ్దూం భవన్

మార్క్స్ లెనిన్ సిద్ధాంతాన్ని
గుండె గుండెకు పంచుతుంటవు
సోషలిజం సాధించాలంటూ
విశ్వాసాన్ని పెంచుతుంటవు
మఖ్దూం భవన్ మఖ్దూం భవన్




సెల్యూట్ టూ యూ మఖ్దూం భవన్
రెడ్ సెల్యూట్ టూ యూ మఖ్దూం భవన్

బానిస బతుకుల చెరవిడిపించిన
సాయుధ పోరాట యోధుల చరితవు
ఉద్యమాల కీర్తి పతాకవు
ప్రతిధ్వనించే ప్రజాగొంతుకవు
మఖ్దూం భవన్ మఖ్దూం భవన్
సెల్యూట్ టూ యూ మఖ్దూం భవన్
రెడ్ సెల్యూట్ టూ యూ మఖ్దూంభవన్

దోపిడి శక్తుల కూల్చాలంటూ
చైతన్యాన్ని రగిలిస్తుంటవు
మనిషి మనిషిగా బతకాలంటే
సమ సమాజం రావాలంటవు
సరికొత్త కాంతులతో మఖ్దూం భవన్
పిడికిలి ఎత్తింది మఖ్దూం భవన్
మఖ్దూం భవన్ మఖ్దూం భవన్
సెల్యూట్ టూ యూ మఖ్దూం భవన్
రెడ్ సెల్యూట్ టూ యూ మఖ్దూం భవన్

**కెవి.ఎల్. 9490952649**

## చిట్టి చీమలు

పుట్ట పొట్టలో కుప్పలు కుప్పలు
చిన్ని పొట్టకు నిరంతర తిప్పలు
పుట్టలో చేరు తెప్పలు తెప్పలు!

శ్రమ విభజన సాంకేతిక నిపుణులు
శ్రమ సౌందర్య సాధన ప్రవీణులు
శ్రమ జీవన విధాన శైలి ప్రాణులు!

సంఘ జీవికి జీవన బాటలు
సహకార జీవన నవ పథాలు
సామ్యవాద జీవన సంకేతాలు!

క్రమశిక్షణ కాలానుగత సారిణి
కూడబెట్టు ముందు చూపు ధోరణి
కరువు క్షుదాభేధల నివారిణి!

పుట్ట కట్టి పాములకు ఇచ్చు
పుట్టలో కోటలు రాజులు మెచ్చు
చిన్ని ప్రాణులపై గౌరవం హెచ్చు!


పుట్ట లో వేలు పెడితే కుట్టి పెట్టు
పెద్ద పాము నైనా మట్టు పెట్టు
చిట్టి చీమలు మనసును కట్టి పెట్టు!

**పట్లోళ్ళ బక్కారెడ్డి**
**9705315250**

## చదవాల్సిన పుస్తకం

## ఏటుకూరి... అలుపెరుగని సాహితీ బాటసారి

ఒక అద్వితీయ సంఘర్షణ... ఒక బలీయమైన నిరసన... ఒక విశిష్టమైన దార్శనికత.. ఒక లోతైన అధ్యయనం... ఒక అలుపెరుగని పోరాటం ఏక రూపాన్ని దాల్చుకుంటే, అది ఏటుకూరి ప్రసాద్‌గా ఆవిష్కృతమవుతుంది. కమ్యూనిజం సిద్ధాంతాలు... నైతిక విలువలు... ప్రగతిశీల సాహిత్య సృష్టి... మొక్కవోని పరిశోధనా స్ఫూర్తి కలిస్తే ఏటుకూరి మాటవుతుంది. తాడితులు, పీడితుల వేదనకు స్పందనగా మారి ఏటుకూరి పాటవుతుంది. పదాలు కూడా కత్తులు.. బాకులు.. ఈటెలు.. పలుగులుగా ఎలా మారుయో, చదువరుల మెదళ్ల నుంచి అవి ఎలా దూసుకెళతాయో తెలియాలంటే, ఏటుకూరి రచనలు చదివి తీరాలి. ఆయన పాటల్లో ఆవేశాలు కట్టలు తెంచుకుంటాయి. ఒకవైపు సాహితీ సేద్యం చేస్తూనే, మరోవైపు విస్తారమైన పరిశోధన చేస్తున్న ఘనాపాటి ఏటుకూరి. వెలుగు చూడని ఎంతో మంది అభ్యుదయ తెలుగు కవుల రచనలు, వారి సాహిత్య విలువలు తెలుసుకోవడానికి ఏటుకూరి 'పొయిట్రి వర్క్‌షాప్' అధ్యయనం చేయాలి. ఒక కవి స్వయంగా పరిశోధకుడిగా మారితే ఎన్ని అద్భుతాలు జరుగుతాయో ఏటుకూరి జీవన ప్రస్థానం, చేస్తున్న సాహితీ సాగు చెప్పకనే చెపున్నది. ఆయన పరిశోధనా గ్రంథం 'తాపీ ధర్మారావు జీవితమూ–రచనలు' కేవలం పిహెచ్‌డి పట్టా కోసం చేసిన మొక్కుబడి రచన కాదు. లోతైన విశ్లేషణ. అతనితర సాధ్యమైన పరిశోధన. ఈ రెండు పుస్తకాలు చాలు.. ఏటుకూరి సాహితీ కృషీవలుడిగా, పరిశోధకుడిగా అధిరోహించిన ఉన్నత శికరాలను తెలుసుకోవడానికి. యామిజాల ఆనంద్‌తో కలిసి



ఆయన చేసిన అపూర్వ అన్వేషణ ఫలితమే 'పొయిట్రి వర్క్‌షాప్'. ఇందులో ఎంతో మంది ప్రముఖ కవుల రచనలు ఉన్నాయి. గొప్ప సాహితీ సృజన చేసినప్పటికీ, తగినంత గుర్తింపు రాని వారి కవితలు కూడా ఉన్నాయి. కవితలతో పాటు, వారి సొంత దస్తూరీని సేకరించి మరీ ముద్రించడం కేవలం తెలుగులోనేకాదు.. మరే ఇతర భాషల్లోనూ జరగని ఓ మహా అద్భుతం. యువ సాహితీవేత్తలకు, ఔత్సాహికులకేకాదు.. కాకలుతీరిన కలం యోధులకు కూడా ఇది రిసోర్స్ మెటీరియల్. అందుకే ఇది ముమ్మాటికీ 'గిన్నిస్' పుస్తకంలో చోటు సంపాదించాల్సిన పుస్తకం. నిజానికి, ఆయా రచయితలు రాసిన కవితలను వారి చేతిరాతలో ముద్రించాలనుకోవడం ఒక సాహసం. వాటి సేకరణ ఒక మహాయజ్ఞం. వీరిలో చాలా మంది కాలం చేసి ఎన్నో ఏళ్లు గడిచిపోయింది. కొందరి కుటుంబాలు ఎక్కడికి తరలివెళ్లాయో? ఎక్కడ స్థిరపడ్డాయో కూడా ఎవరికీ తెలియదు. వారు ఎక్కడ ఉన్నారో కనుక్కోవడం ఎంత కష్టమో ఊహించలేం. కవులు కాగితంపై రాసుకున్న కవితలను సేకరించాలన్న ఆలోచన పూర్వాపరాలను ప్రస్తావిస్తూ, 'కవి ఒక ఘటనకు తన స్పందన ఏ వర్గానికి వెళ్లాలో నిర్ణయించుకుంటాడు. ఆ వర్గ ఆలోచనలనూ, తానందించేదాన్ని స్వీకరించగల, శక్తి యుక్తులనూ, వారి సమాజిక అవగాహననూ, వారి సాంస్కృతిక స్థాయిని అంచనా వేసుకుంటాడు. తన రచనను రూపొందిస్తాడు. ఈ ప్రాసెస్‌లో కవిత అనేక మార్పులకూ, చేర్పులకూ, పాఠాంతరాలకూ గురవుతుంది. కొందరి కవుల విషయంలో ఇదంతా మనసులో జరిగితే, మరికొందరి విషయంలో కాగితం మీద జరుగుతుంది' అంటారు ఏటుకూరి. చాలా కవితల్లో కొట్టివేతలు, సరిచేయడాలను చూస్తే ఆ కవి అంతరంగాల్లో కొనసాగిన ఘర్షణ అర్థమవుతుంది. కేవలం కవితను లేదా రచనను ఎవరైనా సేకరించగలరేమో.. కానీ, దాని వెనుక కవి ఎంతగా మథన పడ్డాడో పాఠకులకు తెలియచేలానుకోవడం ఏటుకూరి విలక్షణమైన ఆలోచనా శైలికి అద్దం పడుతుంది. ఈ 'పొయిట్రి వర్క్‌షాప్' పుస్తకంలో గుజరాడ (పూర్ణమ్మ), గిడుగు రామమూర్తి (నేనెవరు), ఆదిభట్ల నారాయణ దాసు (ఈనాటి చదువు) ఉన్నాయి. వీళ్లేకాదు.. చెళ్లపిల్ల వేంకటశాస్త్రి, కొప్పరపు సోదర కవులు, ఉమర్ అలీషా, త్రిపురనేని రామస్వామి చౌదరి, రాయప్రోలు సుబ్బారావు, కవికొండల వేంకటరావు వంటి ఎంతో మంది దస్తూరీని ఇందులో అందించారు. వీటి సేకరణకు ఎంతగా తిరిగారో... ఎంత కష్టపడ్డారో! గుడిపాటి వెంకట చలం (చలం), పింగళి లక్ష్మీకాంతం, అడవి బాపిరాజు, దువ్వూరి రామిరెడ్డి, నార్ల వెంకటేశ్వరరావు, సుద్దార హన్మంతు, తెన్నేటి



సూరి, పుట్టపర్తి నారాయణాచార్యులు, కాళోజీ నారాయణ రావు, త్రిపురనేని మహారథి, డాక్టర్ సి. నారాయణ రెడ్డి, కుందుర్తి ఆంజనేయులు.. ఇలా ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. వందల మంది కవుల చేతిరాతను మన కళ్లముందు ఉంచారు. ఈ కవితల్లోని ప్రతి అక్షరం ఏటుకూరి, యామిజాల శ్రమకు, విధి పట్ల ఉన్న అంకిత భావానికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ పుస్తకం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఎంతటి వ్యాసమైనా చిన్నదే. అయినా... ఈ 'తెలుగు రచయితల చేతిరాతల కవితా సంకలం' పుస్తకాన్ని చూస్తే కలిగే ఆనందాన్ని కొలిచే సాధనం ఎక్కడ ఉంటుంది?. 'తాపీ ధర్మారావు జీవితమూ–రచనలు' పేరుకు తగ్గట్టే మొత్తంగా 'తాతాజీ' గురించి సమగ్ర సమచారాన్ని అందిస్తుంది. తాపీ రచనలు అనే అంశం డాక్టరేట్ కోసం పరిశోధనకు తీసుకున్న తర్వాతగానీ, ఇందులోని లోతు తెలియలేదని పరిచయ వాక్యంలో పేర్కొన్నారు రచయిత ఏటుకూరి. తాపీ ధర్మారావు హేతువాది... పత్రికా సంపాదకుడు.. వ్యావహారిక భాషావాది... సినీ రచయిత... కావ్య వ్యాఖ్యాత... సాహితీ విమర్శకుడు... పరిశోధకుడు. సూటిగా చెప్పాలంటే, తాపీ స్పృశించని సాహిత్య పార్శ్వం లేదు. ఆయన తన విశిష్టతను నిరూపించుకోని రంగం లేదు. ఆయనపై పరిశోధన కాబట్టి, రచయితకు అన్ని రంగాలనూ ప్రస్తావించక తప్పలేదు. 'ఆయా రంగాల పూర్వాపరాల నేపథ్యంలో తాపీ స్థానాన్ని అంచనా వేయడానికి చాలా వివరాల ప్రస్తావన తప్పనిసరైంది. ముఖ్యంగా రావేలుగల వాడరార పొలిగాడ అనే ప్రకరణంలో సామాజిక మానవ శాస్త్రాలనూ, సిద్ధాంతాలనూ, వీరి రచనల మూలతత్వాల విశదీకరణకు అన్వయించే ప్రయత్నం జరిగింది' అంటారు ఏటుకూరి. ఈ పుస్తకం తాపీ రచనల విశిష్టతనేకాదు.. ప్రత్యేకతలను కూడా వివరిస్తుంది. తెలుగు సాహితీ రంగంలో తాపీకి ఎందుకు అంత ఉన్న ఉన్నత స్థానం లభించిందనే ప్రశ్నకు ఈ పుస్తకమే సమాధానం. తాపీని ఆవిష్కరించిన ఏటుకూరి ధన్యజీవి.

### పుస్తకం పేరు

| | |
|---|---|
| పొయిట్రి వర్క్‌షాప్ (తెలుగు రచయితల చేతిరాతల కవితా సంకలం) వెల: రూ. 500 | తాపీ ధర్మారావు జీవితమూ రచనలు వెల: రూ. 350 |

ప్రతులకు

నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## బిహార్‌లో న్యాయవాది కాల్చివేత

**పాట్నా:** బిహార్‌లో కాల్పుల మోత మోగుతున్నది. తాజాగా ఒక న్యాయవాదిని దుండగులు కాల్చి చంపారు. దీంతో గత 24 గంటల్లో కాల్పుల్లో నలుగురు మరణించడం కలకం రేపింది. పాట్నాలోని సుల్తాన్‌పూర్ ప్రాంతంలో నివసిస్తున్న 58 ఏళ్ల జితేంద్ర కుమార్ మహతో న్యాయవాది. ఆదివారం యథావిధిగా టీ తాగేందుకు రోజూ వెళ్లే షాపు వద్దకు అతడు వెళ్లాడు. టీ తాగిన తర్వాత ఇంటికి తిరిగి వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ఆయనపై మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన జితేంద్ర కుమార్‌ను హాస్పిటల్‌కు తరలించగా అతడు మరణించాడు. కాల్పులు జరిగిన ప్రాంతం నుంచి మూడు బుల్లెట్ షెల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గాలింపు ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు గత రెండేళ్లుగా న్యాయవాది వృత్తిలో చురుగ్గా లేదని పోలీస్ అధికారి తెలిపారు. మరోవైపు అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న బిహార్‌లో గత 24 గంటల్లో కాల్పుల సంఘటనల్లో నలుగురు మరణించడం కలకలం రేపింది.

## 15న కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ భేటీ


### వర్షాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం ఖరారు



**న్యూఢిల్లీ :** రానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు పార్టీలు సమాయత్తమవుతున్నాయి. పలు సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు అస్త్రశస్త్రాలనుసిద్ధం చేసుకుంటున్నాయి. అందులో భాగంగా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ఈనెల 15న పార్టీ అగ్ర నాయకులతో సమావేశం కానున్నారు. సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేయనున్నారు. ఈ సమావేశంలో బిహార్‌లో ఇసి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, ఆపరేషన్ సిందూర్ వంటి అనేక అంశాలను లేవనెత్తాలని ప్రతిపక్షాలు యోచిస్తుండటంతో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు తీవ్ర గందరగోళంగా మారే అవకాశం ఉంది. పార్లమెంటరీ వ్యూహ బృంద సమావేశంలో రాజ్యసభ, లోక్‌సభలోని ప్రతిపక్ష నాయకులు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ఉభయ సభల్లోని డిప్యూటీ నాయకులు, పార్టీ చీఫ్ విప్‌లు, విప్‌లు పాల్గొంటారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. సోనియా గాంధీ అధ్యక్షత వహించే ఈ సమావేశం 10 జనపథ్‌లోని తన నివాసంలో జరగనుంది. వ్యూహాత్మక బృందంలో భాగమైన కొంతమంది సీనియర్ నాయకులు కూడా పాల్గొననున్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఈనెల 21న ప్రారంభమై ఆగస్టు 21 వరకు కొనసాగుతాయని ప్రభుత్వం ప్రకటించింది. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ కంటే వారం రోజులు ఎక్కువగా కొనసాగనున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బిహార్‌లో ఎన్నికల కమిషన్ (ఇసి) నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితా సమస్యలను కాంగ్రెస్ లేవనెత్తే అవకాశం ఉందని ఆ వర్గాలు తెలిపాయి. సుప్రీంకోర్టులో ఎస్ఐఆర్‌ను సవాలు చేయడంలో అనేక ప్రతిపక్ష పార్టీలతో కలిసి కాంగ్రెస్ కూడా సంతకం చేసింది. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, న్యాయవాది అభిషేక్ సింఘ్వి ఈ కేసును వాదిస్తున్నారు. ఎస్ఐఆర్ రాజ్యాంగ విరుద్ధమని, రాష్ట్రంలోని సుమారు రెండు కోట్ల మంది ఓటర్ల ఓటు హక్కును తొలగించడమే లక్ష్యంగా ఉందని ఆరోపిస్తూ, దానిని రద్దు చేయాలని కాంగ్రెస్ కోరుతోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో లోపాలు, నష్టాలు ఏమిటని, అణు యుద్ధాన్ని నివారించడానికి భారత్–పాకిస్థాన్ వివాదంలో మధ్యవర్తిత్వం వహించామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వాదనల తరువాత శత్రుత్వాలు నిలిపివేయడానికి దారితీసిన పరిస్థితులపై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నుండి సమాధానాలు కోరే అవకాశం ఉంది. పహల్గామ్ దాడి, ఆపరేషన్ సిందూర్ పై చర్చ జరగాలని ఇండియా కూటమి పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఏప్రిల్ 22న కశ్మీర్‌లో ఉగ్రవాదులు జరిపిన ఊచకోతకు ప్రతిస్పందనగా భారత సాయుధ దళాలు పాకిస్థాన్ నియంత్రణలో ఉన్న ప్రాంతాలలోని ఉగ్రవాద స్థావరాలపై దాడి చేయడం తెలిసిందే. ఆర్థిక స్థితి, ధరలు, నిరుద్యోగంతో పాటు, భారతదేశంపై అమెరికా సుంకాల అంశాన్ని కూడా చర్చల సమయంలో లేవనెత్తే అవకాశం ఉంది. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్‌ను తొలగించాలని తీర్మానం ప్రవేశపెట్టే నోటీసు కూడా రాజ్యసభ చైర్మన్ ముందు పెండింగ్‌లో ఉన్నందున ఆయనపై అభిశంసన అంశం కూడా సభ ముందుకు వచ్చే అవకాశం ఉంది. జస్టిస్ యాదవ్ చేసిన కొన్ని వ్యాఖ్యలు మతపరమైనవని, అలాంటివి పదవిలో ఉన్న వ్యక్తి నుండి ఊహించనివని కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. పార్లమెంటులో పార్టీ లేవనెత్తాలనుకుంటున్న అంశాలపై వ్యూహం ఖరారు అయిన తర్వాత, వర్షాకాల సమావేశాలకు ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను రూపొందించడానికి కాంగ్రెస్ ఇతర ప్రతిపక్ష పార్టీలతో సంప్రదింపులు జరుపుతుందని వర్గాలు తెలిపాయి. అణుశక్తి రంగంలో ప్రైవేట్ రంగ ప్రవేశాన్ని సులభతరం చేయడంతో సహా కీలక చట్టాలను తీసుకురావాలనే ప్రభుత్వ ప్రణాళికల మధ్య సెషన్ ఎక్కువ కాలం కొనసాగుతుందని ఆ వర్గాలు తెలిపాయి.

## ఎన్నికల సంఘం ఎల్లప్పుడూ...
# మోదీ ప్రభుత్వం చేతిలో 'కీలుబొమ్మే'

### రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ ఆరోపణ



**న్యూఢిల్లీ :** ఎన్నికల సంఘం (ఇసి) ఎల్లప్పుడూ నరేంద్రమోదీ ప్రభుత్వం చేతిలో కీలు బొమ్మగానే ఉందని, బీహార్‌లో ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్రసవరణ(ఎస్ఐఆర్)ఎన్నికల జాబితా మెజారిటీవర్గం అధికారంలో ఉండేలా చూసుకోవడానికి ఉద్దేశించిన 'రాజ్యాంగ విరుద్ధమైన చర్య' అని ప్రముఖసీనియర్‌న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ ఆరోపించారు. ఆయన ఆదివారం 'పిటిఐ'కిఇచ్చినఇంటర్వ్యూలోఈవిషయంపై మాట్లాడారు. ప్రతీ ఎన్నికల కమిషనర్ తన ప్రభుత్వంతో ఉన్న పొత్తులో భాగంగా ఆయనకు ముందు అదే హోదాలో ఉన్న కమిషనర్‌ను అధిగమిస్తుంటారని కపిల్ సిబల్ ఆరోపించారు. బిహార్‌లో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ఎన్నికల జాబితాను ఆయన విమర్శిస్తూ పౌరసత్వ సమస్యలను నిర్ణయించే అధికార పరిధి ఎన్నికల కమిషన్ (ఇసి)కి లేదని మాజీ న్యాయశాఖ మంత్రి కూడా అయిన కపిల్ సిబల్‌స్పష్టంచేశారు.22సంవత్సరాల తర్వాత సవరణ జరుగుతున్నదని, ఎన్నికల సంఘం అనర్హుల ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేస్తున్నదని, చట్టప్రకారం ఓటువేయడానికి అర్హులైన వారిని చేరుస్తుందనిఇసిఎప్పటినుండోవాదిస్తుందని అన్నారు. ఎస్ఐఆర్ విషయమై ఎన్నికల సంఘంపై ప్రతిపక్షాల దాడి గురించి ప్రశ్నించగా కపిల్ సిబల్ సమాధానమిస్తూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచిచాలాకాలంగాప్రభుత్వం చేతిలో కీలుబొమ్మలా మారిందన్నది వాస్తవమన్నారు. ఎన్నికల కమిషన్ ప్రవర్తన ఎంత తక్కువగా ఉంటే అంత మంచిదన్నారు. 'వాస్తవానికి ప్రతీ ఎన్నికల కమిషనర్ ఈ ప్రభుత్వానికి అనుగుణంగా ఉండటంలో మునుపటి వారిని అధిగమిస్తారు అని సిబల్ చెప్పారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ఎన్నికల జాబితా గురించి ఆయన మాట్లాడుతూ 'ఇది నా ప్రకారం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమైన ప్రక్రియను ముందుకు తీసుకెళుతున్నారు.పౌరసత్వ సమస్యలను పరిష్కరించే అధికారం కమిషన్‌కు లేదు. అదికూడా బ్లాక్ లెవల్ ఆఫీసర్ (బిఎల్ఓ)కు లేదు' అని సిబల్ స్పష్టం చేశారు. 'వారు (భిజెపి) ఎన్నికల్లో ఎలాగైనా గెలవగలరని నేను చెబుతూనే ఉన్నాను. వాస్తవానికి ప్రత్యేక సమగ్ర సవరణ యొక్క మొత్తం ప్రత్యేక ప్రక్రియ మెజారిటీ అన్ని వేళలా మెజారిటీ ప్రభుత్వాలను నిర్ధారించే ప్రక్రియగా మారుతోంది' అని కపిల్ సిబల్ చెప్పారు. 'పేద ప్రజలను, అణగారిన వర్గాలను, ఆదివాసీలను తొలగించడం ద్వారా మెజార్టీపార్టీఎల్లప్పుడూగెలుస్తుందనిమీరు భరోసా ఇస్తున్నారు. కాబట్టి ఇది మరొక మార్గంగా ఎంచుకోవడం ఆందోళనకర విషయం' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం స్వతంత్రతను తాను ఎల్లప్పుడూ ఆశించనని, ఎందుకంటే ఆ సంస్థ ఎల్లప్పుడూ వారి నుంచి ఆశించిన స్వాతంత్ర్యాన్ని ప్రతిబింబించలేదని అన్నారు. సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వుపై స్పందించడానికి రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ నిరాకరించారు. ఎందుకంటే తాను న్యాయవాదిని అని ఆయన ఎత్తి చూపారు. కోర్టు చెప్పినదానిని ఎన్నికల సంఘం పరిగణనలో నికితీసుకుంటుందనితాను ఆశిస్తున్నానని, తద్వారా ఈ వివాదాన్ని ముందుకు తీసుకెళ్ల కూడదని తానుఆకాంక్షిస్తున్నాననిచెప్పారు. ఈ విషయంలో మహారాష్ట్ర అంశం చాలా ముఖ్యమైనదని, ఎందుకంటే బిజెపి గెలిచిన స్థానాలలో మాత్రమే ఓటర్లు ఎలా భారీగా పెరిగారో ఎన్నికల సంఘం ఇప్పటికీ వివరించలేకపోయిందని మహారాష్ట్రలో ఇటీవలి ఎన్నికల్లో గెలుపు అంశాన్ని ప్రత్యేకంగా ఆయన ప్రస్తావించారు.

# బిహార్ ఓటర్ల జాబితాలో విదేశీయులు

### భారీ సంఖ్యలో బంగ్లాదేశ్, నేపాల్, మయన్మార్ దేశస్థులు ఉన్నట్లు అధికారులు వెల్లడి

**న్యూఢిల్లీ :**బిహార్‌లో శాసనసభ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ భారత ఎన్నికల సంఘం 'ఓటరు జాబితా సమగ్ర సవరణ' (ఎస్ఆఐర్)ను చేపట్టడం దేశవ్యాప్తంగా దుమారం రేపింది. విపక్షాల ఆందోళనలను తోసిపుచ్చుతూ బిహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన 'ఓటర్ జాబితా సమగ్ర సవరణ' ప్రక్రియలో కీలక విషయాలు తెలుస్తున్నాయి. బిహార్‌లో ఇంటింటినీ తనిఖీ చేస్తున్న ఇసి సిబ్బందికి భారీగా బంగ్లాదేశీయులు,నేపాలీలు,మయన్మార్ పౌరులు కనిపించారు. వారి వద్దఆధార్,రేషన్‌కార్డు, నివాస ధ్రువీకరణ పత్రాలు కూడా ఉన్నాయి. అంతేకాదు వారిలో చాలా మంది ఓటర్ లిస్టులో ఉండే అవకాశం ఉందని ఇసి భావిస్తోంది. అందుకే ఆగస్టు తర్వాత వారిని విచారించి జాబితా నుంచి తొలగిస్తామని తెలిపింది. సెప్టెంబర్‌లో విడుదల చేసే తుది ఓటర్ జాబితాలో విదేశీయుల పేర్లు ఉండవని స్పష్టం చేసింది. ప్రతిపక్షాలకు వచ్చే ఓట్లను తొలగించడానికే కేంద్రప్రభుత్వం కనుసన్నల్లో ఇసి ఈ ప్రక్రియ చేపట్టిందని కాంగ్రెస్ సహా ఇండియా కూటమి పక్షాలు ఆరోపిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఆధార్ కార్డును పౌరసత్వ గుర్తింపుగా పరిగణించకపోతే పేదలు, వృద్ధులు ఇప్పటికిప్పుడు కుల, నివాస, జననధ్రువపత్రాలు ఎలా తీసుకురాగలరని ప్రశ్నించాయి. పిటిషన్లను విచారించిన సుప్రీం ఓటర్ జాబితా సమగ్ర సవరణ రాజ్యాంగబద్ధమేనని స్పష్టం చేసింది. అయితే ఎస్ఐఆర్ కోసం ఆధార్ కార్డును పరిగణనలోకి తీసుకోవాలని ఇసికి సూచించింది. ఈ క్రమంలో ఎన్నికల అధికారులు బిహార్‌లో పర్యటిస్తూ ఎస్ఐఆర్ చేపట్టారు. ఇంటింటి తనిఖీల్లో నేపాల్, బంగ్లాదేశ్, మయన్మార్ దేశస్తులు భారీగా బిహార్‌లో ఉన్నారని గుర్తించారు. వారి పేర్లు ఓటర్ జాబితాలో ఉన్నాయా లేదా అన్నది వెల్లడించలేదు. బిహార్‌లో ప్రస్తుతం 77 వేలమంది బూత్ లెవల్ ఆఫీసర్లు, ప్రభుత్వ సిబ్బంది, రాజకీయపార్టీల కార్యర్తలు ఎస్ఐఆర్‌లో పాల్గొంటున్నారు. 7.8 కోట్ల మంది ఓటర్లను వీరు తనిఖీ చేయనున్నారు.

## జైళ్లల్లో హింసాత్మక ధోరణులపై నిఘా వేయండి

### రాష్ట్రాలకు హోంశాఖ హెచ్చరిక, మార్గదర్శకాలు

**న్యూఢిల్లీ :** జైళ్ళల్లో హింసాత్మక,ఉగ్రవాద,ప్రమాదకర ధోరణులు, సంబంధిత ఆలోచనలు పెరుగుతున్నాయని, ఇది రోజురోజుకూ ఒక కీలక సవాలుగా మారుతోందని కేంద్ర హోంమంత్రిత్వశాఖ పేర్కొంది. జైలు వాతావరణంలో ఒకరివల్ల మరొకరు ప్రభావితులయ్యే ధోరణులను తనిఖీలు చేయాలని కోరుతూ కేంద్ర హోంమంత్రిత్వశాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రమాదకర,హింసాత్మక లేదా రకకరాల ఆలోచనలున్న ఖైదీలను గుర్తించేందుకు, అంచనావేసేందుకు తగిన ప్రామాణికతలతో కొన్ని పద్ధతులు అభివృద్ధి చేయాలని కోరింది. వారి స్నేహాలు, సంఘాలు, సిద్ధాంతాలను కొలమానాలుగా తీసుకుని ప్రవర్తనలు అంచనావేయాలని కోరింది. ఈ కొలమానంవల్ల ఖైదీల ప్రవర్తనను అంచనావేసేందుకు తర్వాత అందరికీ ఉపయోగపడుతుందని తెలిపింది. వ్యక్తిగతంగా సమస్యాత్మకంగా ఉండేవారిని ఎప్పటికప్పుడు నిర్ణీత విరామాలతో తనిఖీచేసి మార్పులు తెచ్చేందుకు ఏర్పాటు చేయాలని కోరింది. జాతీయ భద్రతకు నష్టం కలగకుండా వారికి పునరావాసం ఉండాలని, శాంతి భద్రతలను కాపాడేవిధంగా వీరందరినీ తీర్చిదిద్దాలని కోరింది. జైళ్ళల్లో ఖైదీలను మార్చి విజయవంతంగా సమాజంలో తిరిగి కలిసిపోయేవిధంగా సమస్యలను పరిష్కరించడం చాలా ముఖ్యమైన విషయమని పేర్కొంది. జైళ్ళల్లో అందరూ సన్నిహితంగా మెలగడంవల్ల ఒంటరితనంతో ఉన్నవారు సులభంగా హింసాత్మక వైఖరులకు,సంఘ వ్యతిరేక ప్రవర్తనకు సులభంగా ఆకర్షితులవుతారని తెలిపింది. కొన్ని సందర్భాలలో జైలు సిబ్బందిపైన, తోటి ఖైదీలమీద కూడా దాడులు చేసేవిధంగా తయారవుతారని, వారి ధోరణి మారిపోకుండా అదుపుచేసి, శాంతిసాధనకు, జైళ్ళల్లో అంతర్గత భద్రతకు భరోసా ఇచ్చేవిధంగా తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంది. తీసుకోవాల్సిన వివిధ రకాల చర్యలను కూడా ఆ మార్గదర్శకాల్లో పొందుపరచింది. జైళ్ళ తమ తమ పరిధులలో ఈ సమస్యలను సమన్వయపూర్వకంగా ఎదుర్కోవాలని కోరింది. జైళ్ళల్లో ఉన్న ఖైదీల ధోరణులను ఎప్పటికప్పుడు కనిపెట్టి ఉండాలని, వారి ఆలోచనలు, ఉద్దేశాలు, వైఖరులలో మార్పులను గమనించాలని, వివిధ రకాలకు చెందిన దోషులు, నిందితులు వచ్చే జైళ్ళల్లో చాలా ఎక్కువ ప్రమాదం తెచ్చిపెట్టేవారు కూడా ఉంటారని, అలాంటివారిని పసిగట్టి వేరుచేయాలని, ఎప్పటికప్పుడు నిఘా చాలా అవసరమని తెలియజేసింది. హింసాత్మక ధోరణులతో వ్యవహరించే ఖైదీలను ఆ పరిస్థితి నుండి వెనక్కు తీసుకువచ్చేందుకు తగిన శిక్షణా చర్యలు తీసుకోవాలని మార్గదర్శకాల్లో తెలియజేసింది.జైళ్ళల్లో ఈ హింసాత్మక, ఆవేదనాత్మక ఆలోచనా ధోరణులవల్ల ఖైదీలు విసుగెత్తిపోయి ఉంటారని, ఇలాంటి ఆలోచనాధోరణులున్నవారు సన్నిహితంగా మెలగడంవల్ల సమస్యలు పెరుగుతాయని, ఇలాంటి గ్రూపులను గమనించి వారిని వేరు చేయాలని, ఒకవేళ నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తే తీవ్ర పరిణామాలకు దారితీసే ప్రమాదాలు ఉంటాయని, పోనుపోనుఇదిపెద్ద సవాలుగా మారుతుందని హోంశాఖ మార్గదర్శకాల్లో హెచ్చరించింది. ''ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పరిణామాల నేపథ్యంలో జైళ్ళల్లో కీలకమైన సవాళ్ళు పెరుగుతున్నాయి, ఒకరివల్ల మరొకరు ప్రభావితులు కావడంవల్ల అనేక నేరపూరిత కార్యకలాపాలు పెరుగుతున్నట్లు తరచుగా ప్రభుత్వాల దృష్టిలోకి వస్తున్నాయి. అందువల్ల ఈ విధమైన ధోరణులనుఅరికట్టేందుకుతక్షణనిఘా అవసరం ఉంది, సున్నితమైన వ్యక్తులు జైలు వాతావరణంలో తీవ్ర హింసాత్మకంగా ప్రవర్తించేవారి నుండి ప్రభావితమై నేర్చుకుంటున్నారు. వీళ్ళందరినీ ఈ ధోరణుల నుండి దూరం చేసి శాంతి భద్రతలను కాపాడేవిషయంలో వారినే కీలకపాత్ర వహించేవిధంగా తయారు చేయాలి'' కేంద్ర హోంమంత్రిత్వశాఖ మార్గదర్శకత్వాల్లో తెలిపింది.

## ఐదేళ్లలో యువతకు కోటి ఉద్యోగాలు

### ఎన్నికల వేళ నితీశ్ కుమార్ యువతను ఆకట్టుకునే కీలక హామీ



**పాట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి నితీష్ కుమార్ యువతను ఆకట్టుకునే కీలక హామీని ప్రకటించారు. 2030 నాటికి యువతకు కోటి ఉద్యోగాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అక్టోబర్–నవంబర్‌లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఎన్నికల తేదీలను ఎలక్షన్ కమిషన్ ప్రకటించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆదివారం తమ ప్రభుత్వం సాధించిన లక్ష్యాలను నితీష్ కుమార్ ప్రకటించారు. 2020–25 సంవత్సరానికి 50 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యం పూర్తి కావడానికి అతి చేరువలో ఉన్నామన్నారు. ఇంతవరకూ 10 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని, మరో 39 లక్షల మంది ప్రభుత్వ ప్రోత్సాహంతో ఉపాధి పొందారని చెప్పారు. 2030 కల్లా కోటి ఉద్యోగాల కల్పనకు పారిశ్రామిక రంగంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రైవేటురంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇందుకు సంబంధించి ఉపాధి విస్తరణ ప్లానింగ్ అమలు కోసం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పనా జర్నీలో భాగంగా 2005, 2020 మధ్య 8 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. బిహార్ యువతకు ఉద్యోగాల కల్పన, సాధికారత కల్పించానికి తమ ప్రభుత్వం చిరకాలంగా కట్టుబడి ఉందని తెలిపారు. స్కిల్ డవలప్‌మెంట్‌కు మరింత ఊతమిచ్చేలా సాత్ నిశ్చయ్ ఇనీషియేటివ్ కింద జననాయక్ కర్పూరి ఠాకూర్ స్కిల్ యూనివర్శిటీని ఏర్పాటు చేయనున్నట్టు నితీష్ కుమార్ ప్రకటించారు. యువతకు స్వయం ఉపాధి అవకాశాలు, ఇండస్ట్రీ రెలివెంట్ శిక్షణకు ఒక వేదికగా ఈ యూనివర్శిటీ ఉంటుందని చెప్పారు. అంతకు ముందు 300 అంతర్ రాష్ట్ర బస్సు సర్వీసులను నితీష్ ప్రకటించారు. బిహార్ నుంచి వలస వెళ్లి ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, పంజాబ్, హర్యానా, ఢిల్లీలో ఉంటున్న వారి కోసం, ముఖ్యంగా పండుగ సీజన్లలో వీరి ప్రయాణాలకు వెసులుబాటు కల్పించేలా ఈ అంతర్ రాష్ట్ర బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన బస్సుల్లో 75 ఎసి బస్సులు కూడా ఉన్నాయి. ఇందు కోసం జూన్ 24న రూ.105.82 కోట్ల బడ్జెట్‌కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపారు. అదనంగా మరో 150 ఎసి బస్సులను పబ్లిక్‌ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) మోడల్‌లో ప్రవేశపెట్టనున్నామని నితీష్ చెప్పారు. పండుగ సీజన్లలో బిహార్ ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వరాష్ట్రానికి చేరుకునేందుకు అదనపు ప్రత్యేక రైళ్లను నడపాలని కేంద్రాన్ని తమ ప్రభుత్వం కోరుతుందని తెలిపారు.

## కేరళ సిఎం నివాసానికి బాంబు బెదిరింపు



**తిరువనంతపురం:**కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధికారిక నివాసానికి బాంబు బెదిరింపు వచ్చింది. తంపనూరు పోలీస్ స్టేషన్‌కు గుర్తు తెలియని వ్యక్తులు ఇమెయిల్ పంపారు. క్లిఫ్‌హౌస్ వద్ద బాంబు పేలుళ్లు జరగబోతున్నాయంటూ ఇ–మెయిల్‌లో పేర్కొన్నారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆయన నివాసంలో విస్తృతంగా తనిఖీలు చేసి.. అది నకిలీ ఇమెయిల్‌గా తేల్చారు. 'బాంబు బెదిరింపు తర్వాత ముఖ్యమంత్రి నివాసాన్ని డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్‌లతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాం. కానీ ఎక్కడా అనుమానాస్పదంగా కనబడలేదు' అని పోలీసులు వెల్లడించారు. తనిఖీల సమయంలో సిఎం విజయన్, ఆయన కుటుంబం విదేశాల్లో ఉన్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కీలక సంస్థలను లక్ష్యంగా చేసుకుని ఇటీవల వచ్చిన బాంబు బెదిరింపుల వ్యవహారంతో తాజాగా వచ్చిన ఇ–మెయిల్‌కు సంబంధం ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# రాజ్యసభకు నలుగురు కొత్త సభ్యులు

### ఉజ్వల్ దేవరావు నికం, హర్ష వర్ధన్ శ్రింగ్లా, డాక్టర్ మీనాక్షి జైన్, సదానందన్ మాస్టర్‌ను నామినేట్ చేసిన రాష్ట్రపతి ముర్ము

**న్యూఢిల్లీ :** రాజ్యసభకు నలుగురు సభ్యులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నామినేట్ చేశారు. వీరిలో ప్రముఖ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వల్ దేవరావు నికం, మాజీ దౌత్యవేత్త హర్ష వర్ధన్ శ్రింగ్లా, చరిత్రకారిణి డాక్టర్ మీనాక్షి జైన్, కేరళ ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త సదానందన్ మాస్టర్ ఉన్నారు. నామినేటెడ్ సభ్యులతో కూడిన జాబితాను హోం మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 80(1)(ఎ)లోని క్లాజ్ (3) కింద రాజ్యసభకు 12 మంది సభ్యులను నామినేట్ చేసే అధికారం రాష్ట్రపతికి ఉంది. సాహిత్యం, సైన్స్, కళలు, సామాజిక సేవ తదితర రంగాల్లో విశిష్ట సేవలందించిన వారిని రాజ్యసభకు నామినేట్ చేసే ప్రత్యేక అధికారం దేశ ప్రథమ పౌరుడికి ఉంటాయి.

#### ఉజ్వల్ నికం

దేశంలోని ప్రముఖ న్యాయవాదులలో ఉజ్వల్ నికం ఒకరు. 26/11 ముంబయి ఉగ్రదాడుల కేసు విచారణ, ఇతర హైప్రొఫైల్ క్రిమినల్ కేసుల్లో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వర్తించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి తరఫున ముంబయి నార్త్ సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి.. కాంగ్రెస్ అభ్యర్థి వర్ష గైక్వాడ చేతిలో ఓడిపోయారు.

#### హర్ష్ వర్ధన్ శ్రింగ్లా

భారత మాజీ విదేశాంగ కార్యదర్శి హర్ష్ వర్ధన్ అమెరికా, బంగ్లాదేశ్, థాయిలాండ్‌లకు రాయబారిగా విధులు నిర్వహించారు. కీలక దౌత్య పదవులు చేపట్టారు. 2023లో భారతదేశ జి20 ప్రెసిడెన్సీకి చీఫ్ కోఆర్డినేటర్‌గా పనిచేశారు.

#### సదానందన్ మాస్టర్

కేరళకు చెందిన సి. సదానందన్ మాస్టర్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించారు. సామాజిక కార్యకర్తగా.. బిజెపి నేతగా కొనసాగుతున్నారు. 1994లో సిపిఐ(ఎం) నేతల దాడిలో ఆయన రెండు కాళ్లు పోగొట్టుకున్నారు. ఈ ఘటన అప్పట్లో రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. 2021 కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన భాజపా తరఫున పోటీ చేశారు.

#### మీనాక్షి జైన్

మీనాక్షి జైన్ ప్రముఖ చరిత్రకారిణిగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. అసోసియేట్ ప్రొఫెసర్‌గానూ విధులు నిర్వర్తించారు. విద్యా రంగంలో ఆమె చేసిన కృషికి గాను 2020లో పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ సభ్యురాలిగానూ పని చేశారు.

#### శుభాకాంక్షలు తెలిపిన నరేంద్ర మోదీ

నలుగురు ఎంపిలకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు.మాజీ విదేశాంగ కార్యదర్శి హర్ష్ వర్ధన్ శ్రింగ్లా, 26/11 ముంబై ఉగ్రవాద దాడి కేసులోస్పెషల్‌పబ్లిక్‌ప్రాసిక్యూటర్ ఉజ్వల్ నికమ్, కేరళ బిజెపి నేత సి సదానందన్ మాస్టర్, చరిత్రకారిణి మీనాక్షి జైన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## డోగ్రా సైన్యం చంపిన 22 మందికి నివాళులు అర్పించకుండా...
# మమ్ముల‌ను 'గృహనిర్బంధం' చేశారు


### మోదీ ప్రభుత్వంపై పలువురు జమ్ముకశ్మీర్ నాయకుల ఆగ్రహం
### 'స్పష్టమైన అప్రజాస్వామికం'అని ఖండించిన సిఎం ఒమర్ అబ్దుల్లా



**శ్రీనగర్ :** డోగ్రా సైన్యం 1931 జులై 13న (ఇదే రోజు) చంపగా అమరులైన 22మందికి నివాళులు అర్పించకుండా నిరోధించడానికి తమను గృహ నిర్బంధంలో ఉంచారని జమ్ముకశ్మీర్‌కు చెందిన ప్రముఖ రాజకీయ నాయకులు పలువురు ఆదివారం ఆరోపించారు. కాగా, జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఈ చర్యను 'స్పష్టంగా అప్రజాస్వామికం' అని వ్యాఖ్యానించారు. అయితే నాయకులు చేసిన గృహనిర్బంధ వాదనలకు అధికార ధృవీకరణ లేదు. మరణించిన 22మందికి నివాళులర్పిస్తూ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా 1931, జులై 13నాటి సంఘటననుజలియన్‌వాలాబాగ్ దురంతంతో పోల్చారు. జులై 13మారణహోమం మన జలియన్‌వాలా బాగ్‌మారణకాండ లాంటిది. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ప్రాణాలు అర్పించిన ప్రజలు కశ్మీర్ బ్రిటీష్ పారమౌంట్సీ కింద పరిపాలించబడుతోంది. బ్రిటీష్ పాలనను అన్ని విధాలా వ్యతిరేకించిన నిజమైన హీరోలను నేడు ముస్లింలు కావడంవల్లనే విలన్లుగా చిత్రీకరించడం ఎంత సిగ్గుచేటు అని ఒమర్ అబ్దుల్లా తన 'ఎక్స్'పోస్ట్‌లో ధ్వజమెత్తారు.1919లో పంజాబ్ రాష్ట్రం జలియన్‌వాలాబాగ్‌లో వలస పాలనకు అనుమతించిన రౌలత్ చట్టాలకు వ్యతిరేకంగా పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లోనిజలియన్‌వాలాబాగ్‌లోవందలాది ప్రజలు శాంతియుత పద్ధతిలో నిరసన తెలియజేస్తున్న తరుణంలో బ్రిటీష్ బలగాలు ఎలాంటి హెచ్చరికలు జారీ చేయకుండానే కాల్పులు జరపడంతో మరణించారని అబ్దుల్లా చెప్పారు. 'ఈరోజు వారి సమాధులనుసందర్శించే అవకాశాన్ని వారు నిరోధించగలమేమో కానీ వారి త్యాగాలను మనం మర్చిపోలేం' అని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. 'ఈ స్పష్టమైన అప్రజాస్వామిక చర్యలో భాగంగా ఇళ్లల్లో ఉన్న వారు బయటకు రాకుండా బయట నుంచే తాళాలు వేశారు. శ్రీనగర్‌లో పోలీసులు, కేంద్రబలగాలను మోహరించి జైలర్లు ప్రధాన వంతెనలను దిగ్బంధించారు. అమరుల సమాధులనుసందర్శించకుండానిరోధించి కశ్మీర్ గొంతుకనునొక్కాలనుకున్నారు. ప్రభుత్వం భయపడి ఎలాంటి శాంతిభద్రతలను కోరుకుంటుందో నాకు ఎప్పటికీ అర్థం కావడంలేదు' అని సిఎం ఒమర్ అబ్దుల్లా అన్నారు. ప్రతిపక్ష పిడిపి ప్రెసిడెంట్ మెహబూబా ముఫ్తీ మాట్లాడుతూ కశ్మీరీ అమరవీరులనుమనవారుగా అంగీకరించినప్పుడే ఢిల్లీ, కశ్మీరీల మధ్య అపనమ్మకం ముగుస్తుందన్నారు.మహాత్మాగాంధీమొదలుభగత్‌సింగ్ వరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'ఒకప్పుడు చెప్పిన విదంగానే మీరు మాహీరోలను సొంతంగా అంగీకరించిన రోజు 'దిల్ కీ దూరీ' (హృదయాల దూరం) నిజంగానే ముగిసిపోతుంది' అని ఆమె తన 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపారు. మాజీ ముఖ్యమంత్రిమెహ్‌బూబా ముఫ్తీ తన నివాసానికి కూడా తాళం వేసిన ఫొటోలను పోస్ట్ చేశారు. ఇళ్లనుంచి దొంగచాటుగా పారిపోయిన తమ పార్టీ నాయకులను అదుపులోకి తీసుకుని వేర్వేరు పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారని ముఫ్తీ చెప్పారు. ఖుర్షీద్ అల్లమ్, జోహైబ్ మీర్, హమీద్ కొహ్‌షీన్, అరిఫ్ లయగ్రూ. సారా నయీమా, తబస్సుమ్, బష్రత్ నసీమ్‌తదితరులనుఇళ్లనుంచి తప్పించుకుని పారిపోయిన వారిని అదుపులోకి తీసుకుని నిర్బంధించబడిననాయకులపేర్లుగావెల్లడించారామె. పీపుల్స్ కాన్ఫరెన్స్ ప్రెసిడెంట్ సాజద్ గని కూడా తనను తన నివాసానికి వెళ్లకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. 'ఇంటి నుంచి బయటకు వెళ్లడానికి అనుమతిలేదు. చాలామంది నిర్బంధించబడ్డారు. కశ్మీర్‌కు ఏది పవిత్రమో పునర్నిచించాలని కేంద్రం చాలా ఆసక్తిగా ఉందని నేను భావిస్తున్నాను.కానీ జులై 13న చేసిన త్యాగాలు అందరికీ పవిత్రమైనవి' అని సాజద్ గని చెప్పారు.శుక్రవారం నుంచి గృహనిర్బంధంలో ఉన్న హురియత్ కాన్ఫరెన్స్ చైర్మన్ మిర్వైజ్ ఉమర్ ఫరూఖీ మాట్లాడుతూ కశ్మీర్‌లో తన కుమారులు ,కుమార్తెలు చేసిన త్యాగాలు బాధాకరమైన గాథను ఎదుర్కొంటున్నారు అని చెప్పారు.

## ఆపరేషన్ సిందూర్ దాడుల తర్వాత బ్రహ్మోస్ క్షిపణిపై 15 దేశాల ఆసక్తి

### రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్



**లక్నో :** ఆపరేషన్ సింధూర్‌లో ఒక ఆయుధంగా తనసత్తాను చాటుకున్న బ్రహ్మోస్ క్షిపణిపై దాదాపు డజనుకుపైగా దేశాలు ఆసక్తి చూపిస్తున్నాయని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఉత్తర ప్రదేశ్ మాజీముఖ్యమంత్రి చంద్రభాను గుప్తా విగ్రహాన్ని ఆదివారంలక్నోలోనిజాతీయ పిజి కాలేజీలో స్థానిక ఎంపి హోదాలో కేంద్రమంత్రి ఆవిష్కరించారు. చంద్రభానుగుప్తా స్మృత్యర్థం ఒక పోస్టేజీ స్టాంప్‌ను విడుదల చేశారు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రభాను గుప్తాస్వాతంత్ర్యపోరాటంలో లక్షలమంది ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకున్నారన్నారు.అధికారంఅంటే బాధ్యత, త్యాగం, ప్రజల ప్రయోజనాలు కాపాడటం అనే విషయాన్ని ఆయన ముఖ్యమంత్రిగా ఉండగా రుజువుచేశారన్నారు.రాజకీయాల్లో వైరుధ్యాలు తప్ప శత్రుత్వాలకు తావులేదన్న సందేశాన్ని కూడా తన పనితీరు ద్వారాచాటి చెప్పారన్నారు. ''కొద్దిరోజుల క్రితం లక్నోలో నేను బ్రహ్మోస్ ఎయిర్‌స్పేస్ ఇంటిగ్రేషన్,టెస్టింగ్ ఫెసిలిటీకి ప్రారంభోత్సవంచేశాను, ఆపరేషన్ సింధూర్ సందర్భంగా దాడుల్లో మీరు తప్పకుండా చూసే ఉంటారు, బ్రహ్మోస్ క్షిపణి అత్యద్భుతమైన పనితీరు ప్రదర్శించింది. బ్రహ్మోస్ సత్తానుచూశాక దాదాపు 14–15 దేశాలు మన క్షిపణిని కొను గోలు చేసేందుకు ఎంతో ఆసక్తి చూపించాయి. ప్రపంచవ్యాప్తంగా దేశాలుభారత్‌బ్రహ్మోస్‌నుకోరుకుంటున్నాయి''అని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## అమెరికా స్వప్రయోజనాల కోసమే యుద్ధాలు
### జస్టిస్ చంద్రకుమార్

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** అమెరికన్ సామ్రాజ్యవాదుల స్వ ప్రయోజనాల కోసమే కోసమే ప్ర పంచ దేశాల మధ్య యుద్ధాలను ప్రేరేపిస్తున్నారని యుద్ధాలతో మా నవ సమాజానికి తీవ్ర హానికరమ ని జస్టిస్ చంద్రకుమార్, ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ అధికార ప్రతినిధి జేవి చలపతిరావు, సిపిఐ ఎంఎల్ కేంద్ర కమిటీ సభ్యులు గుర్రం విజయ్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక (టీఎస్‌డిఎఫ్) ఆధ్వర్యంలో యుద్ధాలు ఎవరికోసం అనే అంశంపై రాష్ట్ర సదస్సు ఆదివారం టిఎస్‌డిఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ వినాయక రెడ్డి అధ్యక్షతన వరంగల్ పోచం మై దాన్‌లోని అబ్బూస్ ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐ (యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కే విశ్వనాథ్, గ్రేటర్ కార్యదర్శి పాల్గొన్నారు.

## దొడ్డ నారాయణరావుకు ఎపి సిపిఐ సంతాపం

**సూర్యపేట :** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ దొడ్డ నారాయణరావు (96) శుక్రవారం అర్ధరాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రంలోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. కామ్రేడ్ దొడ్డ నారాయణరావు మరణ వార్త తెలుసుకుని సిపిఐ అగ్రనాయకత్వంతో పాటు ఆయా పార్టీలకు చెందిన మాజీ శాసనసభ్యులు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయన పార్థివదేహనికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ సిపిఐ తరుపున పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ నారాయణరావుకు నివాళి అర్పించారు. ఆయన మృతి పట్ల సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. కాగా, నారాయణరావుకు ముగ్గురు కుమారులు ఉన్నారు. చిలుకూరు గ్రామ సర్పంచ్‌గా 25 సంవత్సరాల పాటు పనిచేశారు. చిలుకూరు మండల కేంద్రంలో సామాన్య రైతు కుటుంబమైన దొడ్డ అప్పయ్య, వెంకమ్మలకు 6వ సంతానంగా జన్మించారు. 7 దశాబ్దాల పాటు కమ్యూనిస్టు నాయకుడిగా పేరుప్రఖ్యాతులు గడించారు.

## పరిపాలన అంటే శంకుస్థాపనలు కాదు : కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పరిపాలన అంటే కేవలం శంకుస్థాపనలు చేయడం మాత్రమే కాదని, అభివృద్ధి, ప్రగతి అంటే రాజకీయ హంగులు ఆర్భాటాలు ఏమాత్రం కాదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. నిజమైన నాయకుడు ఒకతరం లేదా ఒక ఎన్నిక గురించి మాత్రమే ఆలోచించబోడని, తరతరాలపాటు రాష్ట్రానికి ప్రయోజనాలు కలిగించే ప్రణాళికలే నిజమైన నాయకుడని అన్నారు. ఈమేరకు కెటిఆర్ ఎక్స్(ట్విట్టర్)లో పోస్ట్‌చేశారు. తెలంగాణ సాధించిందన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కెసిఆర్ విజన్‌కు మరో జీవన సాక్ష్యమని పేర్కొన్నారు. యాదాద్రి థర్మల్‌ప్లాంట్. దామరచర్ల అల్ట్రా మెగా థర్మల్ పవర్ ప్లాంట్‌లోని యూనిట్ వన్ 72 గంటల కోడ్‌ను విజయవంతంగా పూర్తిచేసిందని కెటిఆర్ తెలిపారు.

## బైక్ అదుపుతప్పి ఇద్దరు యువకులు మృతి..



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణం కొమరం భీం చౌరస్తా వద్ద బైక్ అదుపుతప్పి ఇద్దరు యువకులు మృతి చెందారు.మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ఇంధన్ పెల్లి గ్రామానికి చెందిన చొప్పదండి గంగన్న కుమారుడు లక్ష్మ ణ్ మురిమడుగు గ్రామానికి చెందిన తన స్నేహితుడు జస్వంత్‌తో కలిసి 18వ తారీఖున లక్ష్మ ణ్ తన పెండ్లి ఉండడంతో ఆదివారం రోజున నిర్మల్‌లో ఉన బంధువులకు పెళ్లి ప్రతికలు పంచడానికి పల్సర్ బైక్‌పై బయలుదేరారు.ఈ క్రమంలో ఖానాపూర్ కొమురం భీమ్ చౌరస్తా మెయిన్ రోడ్ పక్కన ఉన్న కల్వర్టుకు బైక్ అదుపుతప్పి,ఢీకొట్టడంతో వారిద్దరు పక్కనే ఉన్న చెట్ల పొదలో పడిపోయారు.బైక్ బలంగా కల్వర్ట్ ను ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు.ఈ విషయం తెలిసి ఖానాపూర్ పోలీసులు అక్కడికి చేరుకొని మృత దేహాలను ముండ్ల పొదల నుంచి బయటకు తీసి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించా రు.లక్ష్మ ణ్,జస్వంత్ చనిపోయిన విషయాన్ని వారి బంధువులకు సమాచారం అందించారు.మృతుల బంధువులు వచ్చిన తర్వాత పోస్టుమార్టం చేసి మృత దేహాలను వారికి అప్పగిస్తామని పోలీస్ వారు తెలిపారు.

## డబ్బు కోసం మైనర్ బాలుడి కిడ్నాప్
### హనుమకొండ ఎసిపి నరసింహారావు వెల్లడి




**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** డబ్బు కోసం మైనర్ బా లుని కిడ్నాప్‌కు పాల్పడిన నలుగురు సభ్యుల ముఠాలోని ఇద్దరు మహిళలతో సహా ముగ్గురు నిందితులను హ న్మకొండ పోలీసులు ఆదివారం అరెస్టు చేసి వీరి చెర నుండి బాలుడిని సురక్షి తంగా రక్షించారు. వీరిలో మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. వీరి నుండి పోలీసులు ఒ క ఆటోను, ఒక కత్తి, రెండు పెట్రోల్ బాటిళ్లు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారి లో హనుమకొండ ఏనుగుల గడ్డకుకు చెందిన పూరి ప ద్మ, పూరి రాజు, కొత్తగూడెం జిల్లా కు చెందిన జెట్టి జ్యో తి వారుగా పోలీసులు గుర్తించగా మరో నిందుతుడు శ్రీ కాంత్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఈ అరెస్టుకు సంబంధించి హనుమకొండ ఎసిపి నరసింహారావు వివ రాలను వెల్లడిస్తూ పోలీసులు అరెస్టు చేసిన నిందితుల్లో ప్రధాన నిందితురాలైన పూరి పద్మ హనుమకొండలో స్థా నికంగా నివాసం ఉంటూ బ్రాహ్మణవాడలోని క్యాటరింగ్ నిర్వహించే రమణ అనే వ్యక్తి వద్ద రోజువారి కూ లిగా పనిచేసేది. కొన్ని సంవత్సరాలు పాటు నిందితు రాలు రమణ వద్ద పనిచేయగా వీరి ఇరువురి మధ్య ఆర్థికపరమైన గొడవలు కారణంగా నిందితురాలు తన స్వగ్రామానికి తిరిగి వెళ్ళిపోయింది. రమణ నుండి నిందితురాలికి డబ్బులు రావాల్సి ఉందని, తన డబ్బులు తనకు తిరిగి రావాలంటే రమణ వద్ద ఉండే అతని దగ్గర బంధువు మైనర్ బాలుడిని కిడ్నాప్ చేయడం ద్వారా తన డబ్బులు తిరిగి వస్తాయని తన కుమారులైన రాజు, శ్రీ కాంత్‌తో పాటు మరో నిందితురాలు జ్యోతికి వివరిం చడంతో, ఈ నలుగురు నిందితులు మైనర్ బాలుడిని కి డ్నాప్ చేసేందుకు పథకం వేసుకున్నారు. ఇందులో భా గంగా ఈ నెల నాలుగవ తేదీన మైనర్ బాలుడు ద్విచక్ర వాహనంపై బయటకి వచ్చిన క్రమంలో ఈ ముఠా సభ్యు లు మైనర్ బాలుడుని నయీమ్ నగర్ ప్రాంతంలో బల వంతంగా ఆటోలో ఎక్కించుకొని ములుగు మార్గం మీదుగా అశ్వాపురంకి చేరుకున్న నిందితులు కిడ్నాప్ గు రైన బాలుడితో అతని తల్లికి ఫోన్ చేయించి బాలుడి వర సకు మామ అయిన రమణ నుండి 12 లక్షల రూ పా యలు ఇస్తే బాలుడిని విడుదల చేస్తామని బాలుడి ద్వా రా రమణ తోపాటు బాలుడు తల్లిని బెదిరించారు. బాలు డ్ని కిడ్నాప్ చేసిన ఈ ముఠా సభ్యులు బాలుడితో కలిసి అశ్వారావుపేట కొత్తగూడెం, కర్కగూడెంతో పాటు మం గపేట ప్రాంతాల్లోని పరిచయస్తుల ఇండ్లలో బాలుని రహస్యంగా ఉంచారు. ఇదే సమయంలో నింది తులు త మ వద్ద ఉన్న కర్రలతో మైనర్ బాలుడిని కొ డుతూ పె ట్రోల్ పోసి చంపుతామని కత్తితో బెదిరించడం జరిగింది. ఇలా చేస్తున్నా కూడా కిడ్నాప్ కి గురైన బాధితుడి కు టుంబ సభ్యుల నుండి ఎలాంటి స్పందన రాకపో వడం తో డబ్బులు ఇవ్వవలసిన రమణని కూడా కిడ్నాప్ చేస్తే తమ డబ్బులు తిరిగి వస్తాయని అనుకున్న నింది తులు ఆదివారం ఉదయం ములుగు రోడ్డు మీదు గా అవుటర్ రింగ్ రోడ్డులో ఆటోలో ప్రయాణిస్తుండగా, అదే సమయంలో హన్మకొండ పోలీసులు యాదవనగర్ పెట్రోల్ పుంపు వద్ద రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర వ్హిస్తుం డగా చూసి భయపడిన నిందితులు ఆటోని వదిలి పా రిపోవడానికి ప్రయత్నిస్తుండగా పట్టుబడిన ముగ్గురు నిందితులను పోలీసులను అదుపులో తీసుకొని విచా రించగా మైనర్ బాలుడుని కిడ్నాప్ చేసినట్లుగా నింది తులు అంగీకరించారు. నిందితులని పట్టుకోవడం లో ప్ర తిభ కనబరిచిన హన్మకొండ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివ కుమార్, ఎస్‌ఐ కిషోర్, ఏఎఓసల్మాన్‌పాషా, కా నిస్టేబుల్ వి. అశోక్, డి. కరుణాకర్, బి. సతీష్, వినూష, కారుణ్య, హెచ్‌జిరవి,యుగేందర్‌లనుఎసిపి అభినందించారు.

# కల్తీ కల్లు – మద్యం కాదు... మరణ ద్రవ్యం!

### పదేళ్లలో కల్లు కాంపౌండ్లపై 13,342 కేసులు
### 13,34 మంది అరెస్టు
### కల్తీ కల్లు కేసులు 1,277
### అక్రమ కాంపౌండ్లు 12,175
### బిఆర్‌ఎస్ హయాంలోనే విపరీతంగా పెరిగిన కల్తీ కేసులు, అక్రమ కాంపౌండ్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ సహా దేశవ్యాప్తంగా కల్తీ కల్లు మాఫియాలు చెలరేగిపోయాయి. చౌక ధరలకు మద్యం అందిస్తామన్న ఆశతో పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలను ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయి. ఇటీవల చోటుచేసుకున్న అనేక ఘటనలు కల్తీ కల్లు ఎంత భయంకరమో వివరిస్తున్నాయి. తాజాగా కూకట్‌పల్లి, ఎస్‌పినగర్, హైదర్‌నగర్, శంషిగూడ, భాగ్యనగర్ కల్లు దుకాణాలలో చోటుచేసుకున్న ఘటన రాష్ట్ర ప్రజలను తీవ్రంగా కలిచివేసింది. 2014 నుంచి ఇప్పటి వరకు (పదేళ్లలో) కల్లు కాంపౌండ్లపై పెట్టిన కేసులు ఒకసారి పరిశీలిస్తే కల్లు కాంపౌండ్లపై 39,026 కేసులు నమోదు కాగా 13,343 మంది అరెస్టు అయ్యారు. ఇందులో కల్తీ కల్లు కేసులు పదేళ్లలో 1,277 నమోదు అయ్యాయి. ఇక అక్రమంగా నడుస్తున్న కల్లు కాంపౌడ్ల సంఖ్య చూస్తే 12,175 ఉంది. పదేళ్ల గణాంకాలను పరిశీలిస్తే బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలోనే కల్తీకల్లు కేసులు, అక్రమ కల్లు కాంపౌండ్లు విపరీతంగా పెరిగిపోయాయి. కల్తీ కల్లు ప్రజారోగ్యానికి తీవ్రమైన ప్రమాదం కలిగించే ఒక ఘోరమైన సమస్య. దీని తయారీ, అమ్మకం, వినియోగం వల్ల అనేకమంది తమ ప్రాణాలను కోల్పోతున్నారు. కల్తీ కల్లు వినియోగం తాత్కాలిక ఆనందం కాదు.. ఇది శాశ్వత శోకానికి దారితీసే విషం. ప్రభుత్వంతోపాటు ప్రజలూ అప్రమత్తంగా ఉండాలి. కల్తీ మాఫియాలకు అడ్డుకట్ట వేసేందుకు ధైర్యంతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. అనుమానాస్పద మద్యంపై పోలీసులకు సమాచారం ఇవ్వాలి. నిజామాబాద్, మెదక్, మహబూబ్‌నగర్: గ్రామీణ ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా కల్తీ కల్లు అమ్మకాలు కొనసాగుతున్నట్లు సమాచారం.






**కల్తీ కల్లు అంటే ఏమిటి?**
కల్తీ కల్లు అనేది అసలు మద్యం కాకుండా, రసాయనాల మిశ్రమంతో తయారుచేసిన నకిలీ మద్యం. మితిలో మానవ శరీరానికి ప్రమాదకరమైన మెథనాల్, యాసిటోన్, ఇండస్ట్రియల్ ఆల్కహాల్ వంటి రసాయనాలు కలిపి తయారు చేస్తారు. ఇది సేవించిన వారికి కండ్లు బలహీనత, చూపుకోల్పోవడం, మూత్రనాళం, కాలేయం దెబ్బతినడం, తక్కువ సమయంలో మరణం సంభవించడం జరుగుతుంది. శాశ్వతంగా దివ్యాంగతకు లోనవడం కూడా జరుగుతుంది.

**ఎలా తయారవుతోంది?**
చిన్న షెడ్లు, చెరువుల దగ్గర, పొలాల్లో కల్తీ కల్లు తయారీ జరుగుతోంది. ప్రధానంగా పాడైపోయిన గుడ్లు, ఉడకబెట్టిన పండు పదార్థాలు, కల్తీ రసాయనాలు కలిపి వేడి చేసి మద్యంలా తయారు చేస్తారు.

**కల్లు కాంపౌండ్లలో పదేళ్లలో కేసులు ఇలా..**

| ఏడాది | కేసులు | అరెస్టు | కల్తీ కల్లు | నకలీ దుకాణాలు |
|---|---|---|---|---|
| 2014 | 9562 | 1368 | 122 | 1358 |
| 2015 | 11257 | 2154 | 157 | 2077 |
| 2016 | 2465 | 2795 | 229 | 27 |
| 2017 | 1519 | 1628 | 196 | 9 |
| 2018 | 2689 | 1695 | 245 | 59 |
| 2019 | 1464 | 789 | 162 | 42 |
| 2020 | 985 | 975 | 66 | 14 |
| 2021 | 362 | 310 | 23 | 2 |
| 2022 | 361 | 330 | 26 | 326 |
| 2023 | 4832 | 498 | 9 | 4823 |
| 2024 | 2964 | 403 | 29 | 2935 |
| 2025 | 516 | 398 | 13 | 503 |
| **మొత్తం** | **39,026** | **13,343** | **1,277** | **12,175** |

# రీల్స్ కోసం రిస్క్.. ప్రాణాలతో చెలగాటం!

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సోషల్ మీడియా కోసం రీల్స్ చేస్తూ ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకునే యువత సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ట్రెండ్స్, ఫేమ్, ఫాలోవర్ల కోసమన్న మోజుతో వారు ప్రమాదకరమైన స్టంట్స్, రోడ్డు మీద మార్గనిరోధం, పర్వతాలపై నిలబడడం, జలపాతాల వద్ద స్టంట్స్ వంటి చర్యలు తీసుకుంటున్నారు. ఇది ప్రమాదకరమే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పుగా మారుతుంది. రీల్స్ కోసం మీ ప్రాణాలను రిస్క్ లో పెట్టొద్దు. సోషల్ మీడియాలో లైక్స్ కంటే మీ ప్రాణాలు ఎంతో విలువైనవి. రీల్స్, వ్యూస్ కోసం ప్రజల్ని ఇబ్బంది పెట్టే చర్యలు చేసినా, చట్ట వ్యతిరేక పనులు చేసినా చర్యలు తప్పవు. సోషల్ మీడియా ప్రభావం నిత్యం పెరుగుతోంది. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్,యూట్యూబ్‌షార్ట్స్,టిక్‌టాక్ వంటి ప్లాట్‌ఫామ్స్‌లో వైరల్ కావాలనే ఆకాంక్ష యువతను ప్రమాదకర చర్యలవైపు నడిపిస్తోంది. థ్రిల్లింగ్ స్టంట్లు, రోడ్డు మీద మధ్యలో డ్యాన్సులు, రైలు పట్టాలపై పోజులు.. ఇవన్నీ ఒక్క వీడియో కోసమే. అయితే వీరి కోరిక, ఆకాంక్షలు ఒక్కోసారి వారి ప్రాణాల మీదకు తీసుకెళ్తోంది. తక్కువ సమయంలో ఫేమస్ కావాలన్న మోజుతో వారి వీడియోలను వైరల్ చేసుకుంటున్నారు. లైక్స్, షేర్ల కోసం చేసే ప్రాణాంతక వీడియోలు వారి కుటుంబ సభ్యులను ఒంటరి చేస్తున్నాయి. ఒక్కోసారి పందాలు కట్టుకుని ప్రాణాలకు తెగించి రీల్స్ కోసం రిస్క్ తీసుకోవడం విడ్డూరంగా ఉంది.రీల్ వైరల్ కాకపోయినా పర్లేదు.. ప్రాణం విలువైనదని యువత గ్రహించాలి.మీకు ఫేమ్ కంటే మీ కుటుంబానికి మీరు అవసరం. ఒక రీల్ కోసం జీవితాన్ని పణంగా పెట్టొద్దని పలువురు అభిప్రాయపడుతున్నారు.







రీల్స్ చేస్తుండగా తెలంగాణలో జరిగిన కొన్ని దారుణ సంఘటనలు ఇలా ఉన్నాయి.
నర్సంపేట్‌లో అజేయ్ (23) తన సెల్‌ఫోన్‌ను ఫ్రీజ్‌పై వీడియో ఆన్ చేశాడు. ఆ తరువాత ఉరి వేసుకుంటున్నట్లు నటిస్తున్న సమయంలో కాల్ రావడంతో ఫోన్ రింగ్ అయ్యింది. ఆ తొందరలో సెల్‌ఫోన్ చేతితో తీసుకునే క్రమంలో ఉరి నిజంగానే భిగించుకోవడంతో చనిపోయాడు.బోరబండకు చెందిన మీర్జా షోయబ్ (17) శంషాబాద్‌లో రాళ్ల కొండల్లో నిండిన నీటి వద్ద రీల్స్ తీసుకునే క్రమంలో ప్రమాదవశాత్తు పడి మృత్యువాత చెందాడు. సిద్ధిపేట్ కొండపోచమ్మా సాగర్‌లో రీల్స్ కోసం నీటిలో దిగి ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు మునిగి ఐదుగురు యువకులు మరణించారు. హయత్‌నగర్‌కు చెందిన శివ, సంపత్‌లు పెద్ద అంబర్‌పేట వద్ద విజయవాడ జాతీయ రహదారిపై మోటర్ బైక్ స్టంట్ రీల్ చేస్తూ ప్రమాద వశాత్తు కింద పడ్డారు. హెల్మెట్ లేకపోవడంతో శివ మరణించగా అతని స్నేహితుడు సంపత్ తీవ్ర గాయాలయ్యాయి.

**ఇదీ.. అందరి బాధ్యత:** పోలీసు కమిషనర్ (డిజి) సివి ఆనంద్ వైరల్ స్టంట్‌లు చేయడానికి ముందు ప్రమాదాన్ని అంచనా వేసుకోవాలి. నీళ్లు, ఎత్తైన ప్రదేశాలు, ట్రాఫిక్ వద్ద రీల్స్ చేయకపోవడం మంచిది. స్కూల్, కాలేజీల్లో స్పెషల్ సెషన్లు నిర్వహించి సోషల్ మీడియా రిస్క్‌ల గురించి చెప్పాలి. పోలీస్ శాఖ, ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్, సైబర్ సెల్ కలిసి ప్రత్యేక అవగాహన వీడియోలు ద్వారా అవగాహన కల్పిస్తున్నాము. ప్రమాదకర కంటెంట్‌ను గుర్తించి అలాంటి అకౌంట్లను ఫ్లాగ్ చేయాలని ప్లాట్‌ఫారాలపై ఒత్తిడి తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తున్నాము. పిల్లల ఆన్‌లైన్ యాక్టివిటీపై పర్యవేక్షణ అవసరం. వాళ్లు ఏం రీల్‌లు చూస్తున్నారు, ఎవరిని అనుసరిస్తున్నారు అనే దానిపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలి.రోడ్లపై ప్రమాదకర స్టంట్లు చేస్తే ట్రాఫిక్ చట్టాల ప్రకారం జరిమానాలు, కేసులతో పాటు పబ్లిక్ ప్రాపర్టీకి హానిచేసే వీడియోలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

### పర్యావరణ మంత్రిత్వ శాఖ విధానం
## ‘తప్పడు ఆవరణ’పై ఆధారం
### కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేశ్ ధ్వజం



**న్యూఢిల్లీ :** కీలకమైన కాలుష్య నిరోధక వ్యవస్థలను ఏర్పాటుచేయకుండా బొగ్గు ఆధారిత ప్లాంట్లలో దాదాపు 78శాతం కేంద్రాలకు ప్రభుత్వం మినహాయింపు ఇవ్వడం ద్వారా పర్యావరణ మంత్రిత్వ శాఖ అనుసరించిన విధానం ‘తప్పుడు ఆవరణ’పై ఆధారపడి ఉందని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేశ్ ఆరోపించారు. జాతీయ పరిసర వాయు నాణ్యత ప్రమాణాలు (ఎన్‌ఎఎక్యూఎస్) సవరణ లేనప్పుడు ప్రభుత్వ విధానాల రూపకల్పన ‘లోపభూయిష్ట కొలమానాల ద్వారా కొనసాగుతోంది’ అని ఆయన నొక్కిచెప్పారు. బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ ప్లాంట్లు సల్ఫర్ డయాక్సైడ్ (ఎస్‌ఓ2) ఉద్గార నిబంధనలకు అనువుగా ఉండేలా కేంద్ర ప్రభుత్వం మరోసారి గడువు పొడిగించిన తర్వాత , తీవ్ర కాలుష్య ప్రాంతాలు లేదా పది లక్షల కంటే ఎక్కు వ జనాభా ఉన్న నగరాలకు దూరంగా ఉన్న ప్రాంతాలకు పూర్తిగా మినహాయింపు ఇచ్చిన తర్వాత మాజీ పర్యావరణ శాఖ మంత్రి అయిన జైరామ్ రమేశ్ కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణల దాడి చేశారు. సల్ఫర్ డయాక్సైడ్ ఉద్గారాలలో భారత దేశాన్ని ప్రపంచ అగ్రగామిగా నిలిపిన సందేహాస్పద ఘనతను నరేంద్రమోదీ ప్రభుత్వం ఇప్పటికే సాధించింది. ఇప్పుడు పర్యావరణ మంత్రిత్వ శాఖ భారతదేశంలోని 78 నుంచి 89శాతం థర్మల్ పవర్ ప్లాంట్లను సల్ఫర్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గించే ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్ (ఎఫ్‌జిడి) వ్యవస్థలను వ్యవస్థాపించకుండా మినహాయించిందని తెలుసుకున్నాం అని జైరామ్ రమేశ్ ఆదివారం తన ‘ఎక్స్’ పోస్ట్‌లో ధ్వజమెత్తారు. 2017కు ముందుగా నిర్ణయించిన ఎఫ్‌జిడి వ్యవస్థలను వ్యవస్థాపించడానికి గడువు పదేపదే నెట్టబడిన తర్వాత ఇది జరిగిందని, సల్ఫర్ డయాక్సైడ్ ప్రజారోగ్యానికి ప్రత్యక్ష ముప్పు అని, మేఘాల నిర్మాణంపై ప్రభావం చూపుతుందని, భారత ఆర్థిక వ్యవస్థకు జీవనాడి అయిన రుతుపవనాలకు హాని కలిగిస్తుందని జైరామ్ రమేష్ తెలిపారు.

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట రైతుల ఆత్మహత్యాయత్నం
### పంట నష్టంతో ఆవేదనకు గురైన పత్తి రైతులు
### పోలీసుల జోక్యం, ఎమ్మెల్యే వినోద్ హామీతో ఆందోళన విరమణ



**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణ ంలో ఆదివారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. బెల్లంపల్లి ఎమ్మె ల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నెన్నెల మండలానికి చెందిన పత్తి రైతులు కాసిపాక రాజు, గంగారామ్‌లు పెట్రోల్ పోసుకొ ని, పురుగు మందుల డబ్బాలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న తాళ్లగురిజాల ఎస్‌ఐ రమేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్నారు. అనంతరం, విషయం తెలుసుకున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అక్కడకు వెళ్లి బాధితులతో మాట్లాడా రు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యేతమకు అన్ని విధాలుగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రై తులు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా బాధిత రై తులు మాట్లాడుతూ, నెన్నెల మండలానికి చెందిన తాము గత 20 సంవత్సరాలుగా సర్వే నంబర్లు 671, 672లలో తమ ప ట్టా భూముల్లో దాదాపు 40 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నామని వివరించారు. అయితే, ఈ నెల 11వ తేదీ శుక్రవారం కుషనపల్లి అటవీ రేంజ్ అధికారి దయాకర్, డిప్యూటీ రేంజ్ అధికారి లక్ష్మీ నారాయణ, బీట్ అధికారులు తొంగల గోపి, మహేష్‌లు వచ్చి తమ భూమిని అటవీ భూమిగా పేర్కొంటూ 20 ఎకరాల్లో వేసిన పత్తి పంటను ధ్వంసం చేశారని వాపోయారు. దీనివల్ల లక్షలాది రూపాయల నష్టం వాటిల్లిందని తెలిపారు. దళితులైన తమపై అటవీ అధికారులు దౌర్జన్యం చేశారని, బాధ్యులపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

# న్యాయవ్యవస్థ పట్ల ప్రజా విశ్వాసం కోల్పోకుండా కృషి
### రాష్ట్ర హై కోర్టు జడ్జి , పెద్దపల్లి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కే. లక్ష్మ ణ్





**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** న్యాయ వ్యవస్థ పట్ల ప్రజలకు ఉన్న నమ్మకాన్ని సంరక్షించే దిశగా మనమంతా కృషి చేయాలని రాష్ట్ర హై కోర్టు జడ్జి, పెద్దపెల్లి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కే. లక్ష్మ ణ్ అన్నారు.ఆదివారం ఓదెల మండలంలో నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవిష్కరించేందుకు జస్టిస్ కే. లక్ష్మ ణ్, హై కోర్టు జడ్జీలు ఎన్.వి. శ్రావణ్ కుమార్, ఈ.వి.వేణు గోపాల్ , జే. శ్రీనివాస్ రావు లతో కలిసి విచ్చేశారు. రాష్ట్ర హైకోర్టు జడ్జిలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీతా కుంచాల, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.తిరుపతి రెడ్డిలు స్వాగతం పలకగా, పండితులు వేద మంత్రాల మధ్య పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం రాష్ట్ర హైకోర్టు జడ్జి జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభించి సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. జస్టిస్ కే.లక్ష్మ ణ్ మాట్లాడుతూ ఓదెల మండలంలో జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ఏర్పడటం చారిత్రాత్మిక అంశమని, దీని వల్ల ప్రజల సమీపంలో న్యాయం అందే అవకాశాలు మెరుగవుతాయని అన్నారు.పెద్దపల్లి జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో అనేక కేసులు పెండింగ్ లో ఉన్నాయని, న్యాయవ్యవస్థలో ఉన్న పెండింగ్ కేసుల పరిష్కారానికి మౌలిక వసతుల మెరుగుదల, నూతన కోర్టుల ఏర్పాటు వంటి చర్యలు తీసుకుంటున్నామని, న్యాయవాదులు, ప్రజలు సైతం సహకరించాలని ఆయన కోరారు. న్యాయ వ్యవస్థలో రూల్ ఆఫ్ లా అందరికీ సమానంగా అమలు కావాలని, సమాజంలోని ప్రతి పౌరునికి, వెనుకబడిన వర్గాల ప్రజలకు సమాంతరంగా న్యాయ సేవలు తప్పనిసరిగా అందాలని తెలిపారు. న్యాయ వ్యవస్థ పట్ల ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకునే దిశగా మనమంతా సమిష్టిగా పనిచేయాలని, కోర్టులో న్యాయవాదులు, జడ్జిల ప్రవర్తన మార్గదర్శకాలు మేరకు మర్యాద పూర్వకంగా ఉండాలని ఆయన సూచించారు.✻ఓదెల మండలంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాన్ని తయారు చేసేందుకు సహకరించిన జిల్లా కలెక్టర్, అధికార యంత్రానికి హై కోర్టు జడ్జి అభినందనలు తెలిపారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు రాష్ట్ర హైకోర్టు, హైకోర్టు జడ్జి లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అందరూ న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది, జిల్లాలోని అందరు బార్ అసోసియేషన్ సభ్యులు, డిసిపి కరుణాకర్, ఆర్డీవో గంగయ్య, తహసిల్దార్ ధీరజ్, ప్రజా ప్రతినిధులు, న్యాయాధికారులు, న్యాయవాదులు, పోలీస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పూర్తి స్థాయిలో రుణ మాఫీ చేయాలి

**ప్రజాపక్షం/ మాగనూర్ :** ప్రభుత్వం యాసంగి సీజన్ కు సంబంధించి వరి ధాన్యాన్ని కోనుగోలు చేసి మూడు నెలలు గడిచిన ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ చేయలేదని, తక్షణమే రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ చేయాలనీ బిజేపీ ఉమ్మడి మండల అధ్యక్షులు నల్లే నర్సప్ప డిమాండ్ చేశారు. రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకొనే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమన్ని పూర్తిగా విస్మరించిందని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రెండు లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న అనేక కోర్రిలు పెట్టి 50 శాతం కూడ రైతు రుణమాఫీ చేయలేదని అదేవిధంగా మూడు విడతల రైతు బంధు ఎగ్గొట్టి ఇప్పుడు రైతుబంధు వేయడం చూస్తుంటే స్థానిక సంస్థల ఎన్నికల స్టంట్‌లో భాగంగా కంటి తుడుపు చర్యలకు దిగడం విడ్డురంగా ఉందన్నారు. కావున వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు యాసంగి వరికి బోనస్‌ను రైతుల ఖాతాల్లో జమ చేసి, ఎలాంటి ఆంక్షలు లేకుండా మిగిలి పోయిన రైతుల 2 లక్షల రుణ మాఫీ చేయాలని, రైతులకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచాలని లేని యెడల బీజేపీ ఉమ్మడి మండల శాఖ తరపున రైతులతో కలిసి ఉద్యమం చేస్తామని అన్నారు.

## యువజన కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎద్దుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో పాలెం గ్రామంలో యువజన కాంగ్రెస్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కమిటీలో అధ్యక్షుడిగా కసిరెడ్డి భరత్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా వేపూరి సిద్దార్థ్‌ను ఎన్నుకున్నామని ఎద్దులశ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు తిరుపతిగౌడ్, జిల్లాప్రధాన కార్యదర్శి భరత్‌గౌడ్, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోవిందు, రామకృష్ణ, జయకృష్ణగౌడ్, విశ్వనాథ్, చంద్రశేఖర్, విష్ణు, బాలు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ప్రజాపక్షం/నారాయణపేట్:** నారాయణపేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అభ్యసించిన ఇంటర్ 2008–2010 బ్యాచ్ విద్యార్థులు 15 సంవత్సరాల తర్వాత మాధ్యమిక విద్య పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం రోజు లక్ష్మి బాంక్వెట్ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. తమ గురువులను పూలతో ఆహ్వానించి స్వాగతం పలకరించారు. వందమంది విద్యార్థులతో జ్ఞాపకాలని, అనుభవాలను, స్మృతులను గుర్తు చేసుకుంటూ ఎంత ఉత్సాహంలో ఆనందంతో రకరకాల అభిరుచులను పంచుకుంటూ ఎంతో ఆప్యాయంగా మృదువుగా సామాజిక స్పృహ తోటి ఆర్థిక అసమానతలు తొలగించే విధంగా భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా, నిలిచే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. ఈ సమావేశానికి ఆనాటి ఉపాధ్యాయులు వసంత శ్రీలత శోభారాణి, సతీష్ రెడ్డి, నరసింహారెడ్డి, సత్యనారాయణ హాజరయ్యారు. జీవితంలో ఎదుర్కొనే సమస్యలను సమర్థవంతంగా ఎదురుకునేందుకు ప్రేరణ కల్పించిన ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలి




పిఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు మహేష్ గౌడ్

**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ మండల కేంద్రంలో ఆదివారం రోజున ప్రజలకు అవగాహన కొరకు శాఖ హర ర్యాలీ పుర వీధుల గుండా తిరుగుతూ బ్రహ్మర్షి పీతామహా పత్రిజీ ఆశయాలు ప్రతి ఒక్కరు నిర్వహించాలని జిల్లా అధ్యక్షుడు మహేష్ గౌడ్ తెలిపారు. సుమారు 500 మంది పైగా పిరమిడ్ మాస్టర్లు పాల్గొన్నారు. నేటి యాంత్రిక జీవితంలో మానసికంగా దృఢంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని తెలిపారు. శాఖాహారంలోనే అధిక పోషకాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్టెం మధవ రెడ్డి, బండ్ల ఆంజనేయ రెడ్డి, రాజేందర్ గౌడ్, నారాయణపేట్, వనపర్తి, ఆత్మకూర్, గద్వాల్, పాలమూరు పెరమిడ్ మాస్టర్స్, ధన్వాడ పిరమిడ్ మాస్టర్లు, నీరటి శ్రీనివాస్ నాయుడు, శైలజ హరినాథ్, రేణుక, అనురాధ, సంధ్య, ఆంజనేయులు, నీలి బాలరాజు, సంద రాజశేఖర్ తదితర పిరమిడ్ మాస్టర్ల పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ మల్లన్నపై హత్యాయత్నాన్ని ఖండించిన బిసి సమాజ్




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై హత్యాయత్నంతో పాటు ఆయన న్యూస్ కార్యాలయంపై దాడిచేసి ఫర్నిచర్‌తో పాటు కంప్యూటర్లను ధ్వంసం చేసిన టీఆర్ఎస్ నాయకురాలు ఎమ్మెల్సీ కవితకు సంబంధించిన జాగృతికి చెందిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని బీసీ సమాజ్ రాష్ట్రకార్యదర్శి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు మోదల శ్రీనివాస్ సాగర్ ఒక ప్రకటనలో డిమాండు చేశారు. బీసీ నాయకులంతా రాజకీయంగా చైతన్యమై రాజ్యాధికారం కొరకు బలంగా బీసీ నాయకులపై దాడులు చేస్తే ఉపేక్షించేది లేదని, ఈరోజు బలంగా బీసీ వాదాన్ని వినిపిస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న లాంటి వ్యక్తులపై ఇలాంటి దాడులు చేస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని అన్నారు. ఇలాంటి దాడులు చేసి బీసీ వాదాన్ని, బీసీ నాయకులను భయపెట్టాలని చూస్తే ఊరుకునే పరిస్థితిలో బీసీ సమాజం లేదని శ్రీనివాస్ సాగర్ అన్నారు. బీసీల పార్టీ వస్తుందని మల్లన్న ప్రకటించిన మరుసటి రోజే ఇలాంటి సంఘటన జరగడం చూస్తే నిజంగా ఇదొక అగ్రవర్ణాల కుట్రగా భావించవలసి వస్తుందన్నారు.

## ఎస్‌సి సంక్షేమ వసతి గృహంలో పురుగుల అన్నం వడ్డింపు



**ప్రజాపక్షం/మర్పల్లి :** మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో ఉన్న ఎస్‌సి హస్టల్లో విద్యార్థులకు పెట్టిన అన్నంలో పురుగులు రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహంతో ఆ పురుగుల అన్నాన్ని పారబోశారు. అదివారం విద్యార్థులకు చికెన్‌తో భోజనం వడ్డించగా అన్నాంలో నల్లగా పురుగులు వచ్చాయి. దీంతో కొంత మం ది విద్యార్థులు గమనించి వారి తల్లిదండ్రులకు తెలపడంతో సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పురుగులతో కూడిన అన్నాన్ని తమ పిల్లలు తిని ఏదైనా జరగరాని జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారమే వడ్డించాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. మెను ప్రకారం భోజనం వడ్డించడం లేదని నాణ్యత కూడా పాటించడం లేదంటూ మర్పల్లి కెజిబివి విద్యార్థినులు శనివారం ఆందోళనకు దిగారు. శనివారం పిల్లలను చూసేందుకు వచ్చిన తల్లిదండ్రులకు పాఠశాలలో భోజనం సరిగ్గా లేదని, తినలేకపోతున్నామని బాలికలు కుటుంబ సభ్యుల దృష్టికి తెచ్చారు. ఆగ్రహించిన వారు పిల్లలతో కలిసి పాఠశాల ఆవరణలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ భోజనంలో తరుచూ పురుగులు వస్తున్నాయని తెలిపారు. ఒక్క రోజు కూడా మెనూ అమలు కావడం లేదని ఆరోపించారు. ప్రతిరోజు ఒకే రకమైన టిఫిన్, ఒకే రకమైన స్నాక్స్ మెనుకు సంబంధం లేకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందని తెలిపారు. వికారాబాద్ జిల్లాలోని హాస్టల్లో నాణ్యమైన మెనూ ప్రకారం అందించడం లేదని తెలుస్తుంది.

# అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు



ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** మండల పరిధిలోని నంది వడ్డెమాన్ గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి చేతులమీదుగా ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి అక్కా చెల్లెలికి ఇందిరమ్మ పథకంకింద ఇండ్లు మంజూరు చేయించి నిర్మించే బాధ్యత ప్రజాప్రభుత్వానిదని అన్నారు. మంజూరైన ఇండ్లకు పట్టాలు ఇచ్చారు. పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు అన్నారు. దళారులు ఎవరైన మాయ మాటలు చెబితే నమ్మవద్దని ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు ఎవరికి రూపాయి కూడా ఇవ్వవద్దని ఎవరైన తీసుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇండ్లను నిర్మించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బంగారి పర్వతాలు, ఎండి ముక్తార్, మండల అధ్యక్షుడు మిద్దెరాములు, బిజినేపల్లి మండల మహిళా అధ్యక్షురాలు చంద్రకళసత్యం, మాజీ సింగిల్ విండో చైర్మన్ వెంకటస్వామి, మార్కెట్‌కమిటి డైరెక్టర్లు వాల్యానాయక్, మాజీసర్పంచులు దేవరకొండ రామచందర్, అవంతి శంకర్, అమృత్‌రెడ్డి, ఎంపిడిఓ కథలప్ప, పంచాయతీ సెక్రటరీ లింగారెడ్డి పాల్గొన్నారు.

# గత పదేళ్లలో విద్యావ్యవస్థ ధ్వంసం




ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత పది సంవత్సరాలుగా విద్యావ్యవస్థ పూర్తిగా ధ్వంసం అయిందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. డైట్ కళాశాల విశ్రాంత అధ్యాపకుల ఆత్మీయ సమ్మేళనం ప్రభుత్వ బిఇడి కళాశాల ప్రాంగణంలో జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యావ్యవస్థ ను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. అంతే కాకుండా ప్రభుత్వ పాఠశాలలను గత ప్రభుత్వం విస్మరించి కనీస మైలిక సదుపాయాలు కూడా కల్పించలేదని ఆయన మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి విద్యా సంవత్సరం 9 వేల అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన చేశామని ఆయన గుర్తు చేశారు. ఇంకో తరం కష్టపడితే కానీ గత పది సంవత్సరాల కాలంలో జరిగిన నష్టాన్ని పూడ్చలేని స్థితికి కల్వకుంట్ల కుటుంబమే కారణమని ఆయన అన్నారు. సంవత్సరాలనికి 72 వేల కోట్ల రూపాయలు కేవలం మిత్తులకే కట్టుతున్నామని, లక్షకోట్ల రూపాయలను కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా బూడిదలో పోసిన పన్నీరు చేశారని ఆయన మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను సరిదిద్దేందుకు భగీరథ ప్రయత్నమే చేస్తున్నామన్నారు. అందరం కలిసి దుర్మార్గమైన పాలనను అంతమొందించామన్నారు. అందుకే తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంగా భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం ప్రతి నియోజకవర్గానికి రెండు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. మీరు ఇచ్చే సలహాలు సూచనలు స్వీకరిస్తామని ఆయన స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్‌లో విద్యాభివృద్ధికి ఏఏ కార్యక్రమాలు చేస్తే బాగుంటుంది అని నివేదిక ఇస్తే మీరు ఇచ్చే నివేదికను ముఖ్యమంత్రికి అందించి అమలు చేయడానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్మంలో ఎస్.జగపతి రావు, ఎస్.విజయ్ కుమార్, ప్రతాప్ రెడ్డి, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్ పాల్గొన్నారు.

# ఘనంగా కృష్ణారెడ్డి హాస్పిటల్ ప్రారంభం



హాజరైన ఎమ్మెల్యే, మాజీ మంత్రి, నేతలు

**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి తనయుడు ఏర్పాటు చేసిన కృష్ణరెడ్డి హస్పిటల్ జడ్చర్ల పట్టణంలో ఘనంగా ప్రారంభించారు. ఆదివారం నాడు పట్టణంలోని కల్వకుర్తి రోడ్డులో గల కృష్ణరెడ్డి కుమారుడు శ్రీధర్ రెడ్డి ఆసుపత్రి తండ్రి పేరు మీద నిర్మించారు. ఈ కార్యక్రమానికి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి వివిధ పార్టీల నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కృష్ణరెడ్డి కుమారుడు శ్రీధర్ రెడ్డి తండ్రి పేరు మీద ఆసుపత్రి ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని అన్నారు. రోగులకు అందుబాటులో ఉండి సేవ చేసేందుకు ముందుకు రావడం గర్వించదగిన విషయమన్నారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే కృష్ణరెడ్డి గతంలో జడ్చర్ల నియోజకవర్గానికి ఎంతో అభివృద్ధి చేశారని, అదే తరహాలో కుమారుడు వైద్య విద్యను అభ్యసించి ప్రభుత్వానికి సేవలు అందిస్తూ ప్రైవేటుగా ఆసుపత్రిని నెలకొల్పడం సంతృప్తికరంగా ఉందని అన్నారు. అంతకు ముందు ఆసుపత్రి యజమాన్యం ముఖ్య అతిథులకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, సారిక, సతీష్, కొడుగల్ యాదయ్య, శంకర్ నాయక్, కరాటే శ్రీను, మసీయుద్దీన్, శ్రీశైలం యాదవ్, రెహ్మాన్, పార్వతమ్మ, శ్రీకాంత్, కొండల్, మినాజ్, రవిశంకర్, అశోక్ యాదవ్, నిత్యానందన్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల్లో బిసిలకు రిజర్వేషన్ కోటాపై సంబరాలు

**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి :** ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి సూచన మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండ్ దగ్గర అంబేద్కర్ చౌరస్తాలో ఓబీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు బండి మల్లేష్ ఆధ్వర్యంలో బీసీలకు సంబంధించిన 42% రిజర్వేషన్ క్యాబినెట్లో ఆమోదించిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సంబరాలు చేసుకోవడం జరిగింది. కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు భారత్ జోడోయాత్రలో పాదయాత్ర చేసిన రాహుల్ గాంధీ బడుగు బలహీన వర్గాలకు అన్ని విధాలుగా న్యాయం జరగాలంటే వాళ్లు జనాభా ఎంతో వాళ్లకు వాటా కూడా అంతే ఉండాలని అప్పుడే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని, రేపు తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీకుల గణన చేపట్టి 42% బీసీ రిజర్వేషన్ తప్పకుండా చేస్తామని మాట ఇచ్చి నిలబెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీకి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, పీసీసీ ఛీఫ్ మహేష్ కుమార్‌గౌడ్‌కి, క్యాబినెట్ మంత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి మహిళా అధ్యక్షురాలు చలువ గాలి వసంతక్క మీడియా కన్వీనర్ సిజె బెనహర్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్ అలీ, సీనియర్ నాయకుడు చలువ గాలి



రాఘవేందర్, రాజు, సాయిబాబా, అవేజ్, రాములు యాదవ్, గంజి. ఆంజనేయులు, జె.చంద్రశేఖర్, శేఖర్, తాహిర్‌బాయ్, మాజీ కౌన్సిలర్లు నాగరాజు, శ్రీనివాసులు, ప్రశాంత్, పాతూరు కుమార్, సేవాదళ్ జగదీష్, అలీ బాయ్, మహిళలు వెంకట్ లక్ష్మి, విజయలక్ష్మి, సహజ రామలక్ష్మి, ఏనుగొండ మురళి, జహీర్ బాయ్, దోమ పరమేశ్వర్, కిరణ్ ముదిరాజ్, వీరన్నపేట్ నరసింహ, నక్క శ్రీను, నరసింహ లిడర్, అనుప ఆంజనేయులు, మురళి, అజీజ్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** మత్స్యకారులు అందుబాటులో ఉన్న చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా లాభపడాలని జిల్లా మత్స్యకార సొసైటీ ఉపాధ్యక్షుడు తుమ్మల అల్లోజి అన్నారు. మండలంలోని ఖానాపూర్‌లోని ట్రైనిఫిన్స్ ఫిషరీస్ చేప విత్తనాల ఉత్పత్తి కేంద్రాన్ని జిల్లాలోని ఆయా గ్రామాల మత్స్యకార సహకార సొసైటిల సభ్యులతో కలిసి ఆదివారం సందర్శించి పరిశీలించి మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో చేప విత్తన ఉత్పత్తికేంద్రాల్లో సాంకేతిక పదేళ్ల అనుభవంతో నిర్వాహకులు ఇక్కడ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసి నాణ్యమైన చేపపిల్లల ఉత్పత్తి చేపట్టడం అభినందనీయమన్నారు. ఈప్రాంత వాతావరణంలో ఇక్కడి నీటిలోనే చేపవిత్తనాల ఉత్పత్తిచేపట్టం వల్లవాటిని చెరువుల్లో వదిలినవెంటనే ఒకేవిధమైన వాతావరణం, నీళ్లుకావడం వల్ల చేపపిల్లలు ఆరోగ్యవంతంగా ఎదిగి పదినెలల కాలంలోనే కిలోనుంచి కిలోన్నర బరువు అవుతాయన్నారు. దీనికి తోడుగా రవాణచార్జీలు, కాలంతగ్గి చేపపిల్లల మరణాల శాతం నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫిషరీస్ సొసైటీ సెక్రటరీ వెంకటస్వామి, మత్స్యకారుల



సంఘం జిల్లా అధ్యక్షుడు తెప్ప తిరుపతయ్య, మండల అధ్యక్షుడు హరికృష్ణ, శ్రీనివాసులు, తిరుపతయ్య, యాదయ్య, సలేశ్వరం, ఉమ్మడి జిల్లా మాజీడైరెక్టర్ బొందయ్య, సహదేవుడు, సైదులు, ఈర్ల శ్రీకాంత్, లింగమయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.

## ముగిసిన ఉచితకంటి వైద్యశిబిరం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణ కేంద్రంలోని సికెఆర్ ఫంక్షన్‌హాల్లో ఐక్యత ఫౌండేషన్, శంకర నేత్రాలయవారిచే సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ మేము గత సంవత్సరకాలంగా నియోజకవర్గంలో ఉచిత కంటి వైద్యశిబిరాలు ఏర్పాటుచేస్తున్నామన్నారు. ప్రజల స్పందన తెలుసుకొని నియోజకవర్గవ్యాప్తంగా కంటిశస్త్రచికిత్స శిబిరాల అవసరం చాలా ఉందని గమనించి మండలాలవారిగా చాలా మంది నిరుపేదలు ఆర్థిక సమస్యలతో కంటి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని వారికి పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తూ అవసరమైనవారికి ఉచిత అద్దాల పంపిణీతోపాటు ఉచిత కంటిశుక్లాల ఆపరేషన్లుచేస్తున్నామన్నారు. 9రోజులుగా నిర్వహించిన ఉచిత కంటిశిబిరంలో సుమారు 6వేలమందికి పైగా హాజరయ్యారన్నారు. ఐక్యతఫౌండేషన్ సభ్యులు శ్రీరాములు, నరేందర్‌గౌడ్, యూసుఫ్, గణేష్, రఘు, యాదయ్య, కొండల్, శేఖర్, రమేష్‌నాయక్, శ్రీపతి, రాఘవేందర్, శివ,శ్రీను, కల్యాణ్, మల్లేష్, భాస్కర్ పాల్గొన్నారు.



## గణపతి దేవాలయ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన

గురుస్వాములతో కలిసి దేవాలయ నిర్మాణ కొలతల పరిశీలన

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట్ జిల్లా కేంద్రంలోని వల్లంపల్లి రోడ్డులో ఉన్న శబరి పీఠం దేవాలయ ఆవరణలో భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్వరలో నిర్మించనున్న శ్రీ గణపతి దేవాలయ నిర్మాణానికి సంబంధించిన కొలతలను ఆదివారం దేవాలయ నిర్వాహకులు, గురుస్వాములతో కలిసి భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్.కె.రాజ్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. త్వరలోనే శ్రీ గణపతి దేవాలయ నిర్మాణానికి గురుస్వాములు, భక్తులతో కలిసి శంకుస్థాపన చేస్తామని రాజ్‌కుమార్ రెడ్డి ప్రకటించారు. శబరీ పీఠం ప్రాంగణంలో గణపతి ఆలయాన్ని నిర్మించాలని జనవరి మాసంలో రాజ్ కుమర్ రెడ్డి న కలిసి విన్నవించడం జరిగిందని, కోరిన వెంటనే గణపతి దేవాలయ నిర్మాణానికి సహకరించారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు కాకర్ల భీమయ్య, అప్పి, జంగిటి వెంకటేష్, బాబు, తిప్పన్న, కృష్ణ, బాలు, ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, మధుసూదన్ రెడ్డి, గోపాల్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పూర్వవిద్యార్థుల సమ్మేళనం అభినందనీయం



ఎస్‌పి వైభవ్ గైక్వాడ్ రఘునాథ్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం అభినందనీయమని జిల్లా ఎస్‌పి వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో అదే పాఠశాలలో 1986వ సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్‌పి వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ పాల్గొని స్నేహితులు ఒకేచోట కలుసుకోవడంవల్ల వారిలో స్నేహభావం మరింతగా పెంపొందుతుందన్నారు. ప్రతి విద్యార్థి దశ ఎంతో కీలకమైందని ఆదశను మళ్లీ నెమరువేసుకోవడానికి స్నేహితులు అందరూ ఒకేచోట కలుసుకోవడంవల్ల బాల్యం గుర్తుకు వస్తుందని అన్నారు. ఇలాంటి కలయికలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. పూర్వ విద్యార్థులు ఆర్వో ప్లాంట్ నిర్వహణ కోసం రూ.20వేల ఆర్థికసాయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి అందజేశారు. అదేవిధంగా గగ్గలపల్లి జడ్పిహెచ్‌ఎస్ పాఠశాలకు రెండు క్రికెట్ కిట్స్ అందజేశారు.

## కరాటేతో ప్రతి ఒక్కరికీ ఆత్మరక్షణ




విద్యార్థులకు కరాటే బెల్టుల అందజేత

**ప్రజాపక్షం/మక్తల్ :** మాస్టర్ బుడోకాన్ కరాటే డు స్పోర్ట్స్ ఆధ్వర్యంలో మక్తల్ పట్టణంలోని బాలల ఉన్నత పాఠశాల గ్రౌండ్ ఆవరణలో ఆల్ ఇండియా చీఫ్, ఎగ్జామినర్ సయ్యద్ ఇస్మాయిల్, ఇన్స్ట్రక్టర్ బ్లాక్ బెల్ట్ టు డాన్ మహమ్మద్ ఆరిఫ్ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ ను విజయవంతంగా నిర్వహించారు. సుమారు 50 మందికి పైగా విద్యార్థులు కరాటే గ్రేడింగ్ టెస్టులో పాల్గొనగా, పది మందికి ఎల్లో బెల్ట్, పదిమందికి ఆరెంజ్ బెల్ట్, 8 మందికి బ్లూబెల్ట్ ఆరు మందికి, చివరగా అత్యున్నతమైన బ్లాక్ బెల్ట్ ను 14 మందికి అందజేశారు. ఈ సందర్భంగా మాస్టర్ సయ్యాద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ కరాటే కేవలం ఆత్మ రక్షణకు మాత్రమే వినియోగించాలని, కరాటేతో శారీరక మానసిక ఆరోగ్యాన్ని పొందవచ్చని సూచించారు. ప్రతి ఒక్కరూ తమకు తెలిసిన కరాటే నైపుణ్యాన్ని ఇతరులకు నేర్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ మాస్టర్ ఇస్మాయిల్, హమీద్, విద్యార్థుల తల్లిదండ్రులు బలరాం, మన్మందు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజు

**ప్రజాపక్షం/ నారాయణపేట్:** నారాయణపేట్ జిల్లా ప్రజలు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజు తెలిపారు. నారాయణపేట జిలా కేంద్రంలోని ఓల్డ్ బస్టాండ్ వద్ద ప్రజలకు రోడ్డు భద్రత నియమాలపై, దొంగతనాల పట్ల అప్రమత్తగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రిఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజు మాట్లాడుతూ ప్రజలు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు తప్పకుండా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని తెలిపారు. ఒకవేళ సైబర్ నేరానికి గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100 కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ నరేష్, ఇమానియల్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు

ప్రజాపక్షం/ఆలేరు : పార్టీలో కష్టపడి పని చేసే కార్యకర్తలకు, నాయకులకు గుర్తుపెట్టుకొని ప్రాధాన్యత కల్పిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. టిపిసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పల్లె శ్రీనివాస్ గౌడ్ నూతనంగా నిమితులైన సందర్భంగా ఆదివారం ఆలేరు మండలం మంతపురి గ్రామంలో ఏర్పాటు చేసిన ఆత్మీమ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పటిష్టానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తారని, పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని అందుకు నిదర్శనమే పల్లె శ్రీనివాస్ గౌడ్ అన్నారు. అనంతరం పల్లె శ్రీనివాస్ గౌడ్ ను ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, పార్టీ శ్రేణులు గజమాల, శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ



కార్యక్రమంలో టిపిసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఆడెం సంజీవరెడ్డి, ఎల్లముల సంజీవ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ఐనాల చైతన్య, జాలపు వనజారాణి పాల్గొన్నారు.

## నారాయణ రావుకు నివాళులు

ప్రజాపక్షం/దేవరకొండ: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, మునుగోడు మాజీ ఎంఎల్ఏ, దేవరకొండ కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాతలలో ఒకరైన అమరజీవి కామ్రేడ్ ఉజ్జిని నారాయణరావు 9వ వర్ధంతి సందర్భంగా ఆదివారం పల్లా పర్వత్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి పార్టీకి నారాయణరావు చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ




సభ్యులు వెంకట్రాములు, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, సహాయ కార్యదర్శులు జ్యోతిబస్, నగేష్, శాఖ కార్యదర్శులు మైనోద్దీన్, మల్లయ్య, శ్రీను, వెంకటయ్య, గోపి, నాయకులు గెల్వయ్య, బ్రహ్మచారి, పాండు, బక్కయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో హోంగార్డు మృతి



ప్రజాపక్షం/నందికొండ: విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న కిషన్ (43)ఆదివారం గుండె పోటుతో మరణించారు.విధి నిర్వహణ లో భాగంగా ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన కిషన్ మార్గమధ్యంలో హఠాత్తుగా చాతీ లో నొప్పి రావటంతో చికిత్స నిమిత్తం తానే స్వయంగా స్థానిక ప్రభుత్వ ఏరియా కమల నెహ్రూ ఆసుపత్రి కి వెళ్లగా ఆసుపత్రి లో కొద్ది సేపటికే మృతి చెందాడు. కిషన్ 18 సంవత్సరాలుగా స్థానిక పోలీస్ స్టేషన్లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు అతని స్వస్థలం రంగుళ్ళ అతను తన భార్య ముగ్గురు పిల్లలతో కలసి నాగార్జున సాగర్ లో నివాసం ఉంటున్నాడు.హోంగార్డు విధి నిర్వహణలో హఠాత్తుగా గుండెపోటుతో మరణించటంతో స్థానిక సీఐ శ్రీను నాయక్ ఎస్ఐ ముత్తయ్యలు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## అడక్వాషిని తొలగించి పదోన్నతులు కల్పించాలి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఉపాధ్యాయ పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు అడ్డంకిగా మారిన అడక్వాషిని తొలగించి పదోన్నతులు కల్పించాలని బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరద్ నాయక్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు గోపినాయక్, కొండ లింగయ్య, బాష్యలు కోరారు. ఆదివారం స్థానికంగా వారు మాట్లాడుతూ అడక్వాషి పదోన్నతులు అడ్డుకోవడానికేనని చెప్పారు. ఖాళీగా ఏర్పడిన ప్రతి పోస్టులను జనరల్ కేటగిరి కింద మారుతాయని అటువంటి పోస్టుల్లో పదోన్నతులు ఇచ్చేటప్పుడు రోస్టర కమ్ మెరిట్ ప్రాతిపదికన పదోన్నతులు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించినట్లు తెఇపారు. సీఎం దృష్టికి ప్రజాప్రతినిధులు తీసుకెళ్లాలని కోరారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులు మక్లానాయక్, సైదులు, వద్దె రాజు, సైదయ్య, జమ్లానాయక్, బద్దునాయక్, శంకర్ నాయక్, నెహ్రూనాయక్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్‌కు జగదీష్‌రెడ్డికి సంబంధంలేదు

## జానయ్యకు రాజకీయ భిక్ష పెట్టింది జగదీష్‌రెడ్డినే



ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: వట్టె జానయ్యకు రాజకీయ భిక్షపెట్టింది మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డినేనని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టా కిషోర్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వట్టె జానయ్య యాదవ్‌కు ప్రాణహాని ఉందని, ఇద్దరు గన్‌మెన్‌లను పెట్టిన జగదీశ్వర్‌రెడ్డి మీద అవాక్కులు, చవాక్కులు పేల్చితే ఊరుకునేది లేదన్నారు. బడుగుల లింగయ్యయాదవ్‌ను రాజ్యసభకు పంపించిన వ్యక్తి జగదీష్‌రెడ్డి అన్నారు. జానయ్యను ఏ స్థాయి నుండి ఏ స్థాయికి ఎదిగాడో అందరికి తెలుసునని, బిసిలకు ఏ విధంగా రిజర్వేషన్లు కల్పించాలో జగదీష్‌రెడ్డికి తెలుసునని, మీ స్వార్థం కోసం బిసిలు అనే పదాన్ని వాడుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధి దాత ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అందరికి అవకాశాలు ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు ఆకుల లవకుశ, బత్తుల రమేష్, దొంగరి యుగందర్, రహీం, వల్దాస్ ఉపేందర్, ఎస్కె రఫీ, సైదులు, మోహన్, వెంకన్న, మురళి, రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట ఆడితే వదిలిపెట్టే ప్రసక్తే లేదు

ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : పేకాట ఆడితే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హుజూర్‌నగర్ సీఐ జి.చరమంద రాజు హెచ్చరించారు. ఆదివారం హుజూర్‌నగర్ లోని సర్కిల్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ చరమంద రాజు మాట్లాడుతూ హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని గత ఆరు నెలల్లో 19 కేసులు పేకాట రాయుళ్ళపై నమోదు చేయడం జరిగిందని, అందులో హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ లో 3,గరిడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో 7,నేరేడుచర్ల పోలీస్‌స్టేషన్‌లో 3,మఠంపల్లి పోలీస్‌స్టేషన్‌లో 3,పాలకవీడు పోలీస్‌స్టేషన్లో 3 కలిపి మొత్తం 19 కేసులకు సంబంధించి 137 మందిని అరెస్టు చేసి వారిని బైండోవర్ చేయడం జరిగిందని తెలియజేశారు. ఆయా కేసులలో మొత్తం నగదు 1,36,750 రూపాయలను,45 బైక్‌లను,67 సెల్ ఫోన్స్‌ను స్వాధీనపర్చుకొని కోర్టుకు అప్పగించడం జరిగిందన్నారు.

## పెరిక కుల ఆత్మగౌరవ భవనం పూర్తి బాధ్యత ప్రతీ ఒక్కరిదీ

ప్రజాపక్షం/సూర్యాపేట: పెరిక కులస్తులంతా ఎక్కడ ఉన్న కలిసికట్టుగా ముందుకు సాగుతూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో పెరిక ఆత్మగౌరవ భవన నిర్మాణం పూర్తిచేసి మన ఐక్యతను చాటాలని తెలంగాణ రాష్ట్ర పెరిక సంఘం అధ్యక్షులు మద్దా లింగయ్య అన్నారు. పెరిక సంఘం సూర్యాపేట పట్టణ నూతన కార్యవర్గ గౌరవధ్యక్షులుగా భందు వీరయ్య, అధ్యక్షులుగా పత్తిపాక వేణుధర్, సహాయ అధ్యక్షులుగా యర్రంశెట్టి రామలింగయ్య, ప్రధాన కార్యదర్శిగా సోమిశెట్టి లింగయ్య, సంయుక్త కార్యదర్శిగా నట్టె కిరణ్, ప్రచార కార్యదర్శిగా దేవరగట్ల సతీష్ లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక ప్రతిభ బి ఫార్మసి కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రమాణస్వీకారత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సూర్యాపేట మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, అంగిరేకుల నాగార్జున, ప్రతిభ బిఫార్మసి కళాశాల చైర్మన్ డాక్టర్ మిన్న శివరామకృష్ణ లు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో పెరిక కులస్తుల ఆత్మగౌరవ భవనానికి భూమిని సాధించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పెరిక కులస్తులు గటిక విజయ్‌కుమార్, బాల్తూ శ్రీనివాస్, సుంకరి అనంద్, డాక్టర్ దొంగరి వెంకటేశ్వర్లు, సుందరి విజయ్‌భాస్కర్, సుంకరి అంజయ్య, వనపర్తి లక్ష్మి నారాయణ, బంధు శ్రీధర్, సముద్రాల రాంబాబు, బొలిశెట్టి కృష్ణయ్య, కోట మల్లిఖార్జున్, వలిశెట్టి సత్యనారాయణ, ముత్తినేని శ్యాంసుందర్, వీర రాఘవులు, కందుల కోటేశ్వరరావు పాల్గొన్నారు.



# సన్నబియ్యం పంపిణీకి చక్కటి స్పందన



### నూతన రేషన్ కార్డుల జారితో రూ.1,151 అదనపు ఖర్చు
### పౌరసరఫరాల శాఖ రాష్ట్ర కమిషనర్ డి ఎస్ చౌహన్

ప్రజాపక్షం/ సూర్యాపేట ప్రతినిధి: సన్న బియ్యం పంపిణీకి ప్రజల నుండి చక్కని స్పందన వస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డిఎస్ చౌహన్ అన్నారు. అదే క్రమంలో నేడు( సోమవారం) రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూతన రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభోత్సవానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. తుంగతుర్తి నియోజక వర్గంలోని తిరుమలగిరి లో నూతన రేషన్ కార్డులను పంపిణీ ప్రారంభించేందుకు నేడు సిఎం రేవంత్ రెడ్డి రానున్నడంతో ఆదివారం తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి సభ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 5,61,343 కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా 27, 83,346 మంది కొత్త సభ్యులకు లబ్ధి చేకూర నుందని దీనికి గాను ప్రభుత్వానికి సంవత్సరానికి రూ.1,151 కోట్లు అదనంగా ఖర్చు అవుతుందని తెలిపారు. రేషన్ కార్డు రాలేదని ఎవ్వరూ ఆందోళన చెందనవసరం లేదని ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. ప్రజాపాలనలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ లాల్ నందా మాట్లాడుతూ... జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి కార్డులు మంజూరు చేయడం జరిగిందన్నారు. పెద్ద ఎత్తున చేపడుతున్న ఈ మహా యజ్ఞానికి ప్రజలు నీరాజనం పలుకుతున్నట్లు చెప్పారు. బయోమెట్రిక్ విధానం ద్వారా బియ్యం పంపిణీ పారదర్శకంగా అమలు పరుస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ నర్సింహా, అదనపు కలెక్టర్ పి.రాంబాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సమాఖ్య వ్యవస్థ విచ్ఛిన్నానికి మోదీ ప్రభుత్వం కుట్ర

### 15న జరిగే సిపిఐ నల్గొండ జిల్లా 23వ మహాసభలను జయప్రదం చేయండి : వలమల్ల ఆంజనేయులు



ప్రజాపక్షం/దేవరకొండ : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నల్గొండ జిల్లా 23వ మహాసభ ఈనెల 15న కామ్రేడ్ మందడి నర్సింహారెడ్డి ప్రాంగణం సాయిరమ్య ఫంక్షన్ హాల్ ముదిగొండ రోడ్డు దేవరకొండలో నిర్వహించనున్న సిపిఐ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిపిఐ దేవరకొండ పట్టణ కార్యదర్శి వలమల్ల ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఆదివారం పల్లా పర్వత్ రెడ్డి భవన్‌లో జరిగిన పట్టణ శాఖ కార్యదర్శులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం గత 11 సంవత్సరాలుగా రాజ్యాంగం కల్పించిన రాష్ట్ర, కేంద్ర సంబంధాలకు నెలవుగా వున్న సమాఖ్య వ్యవస్థ విచ్చిన్నానికి మోడీ ప్రభుత్వం పూనుకున్నదని రాష్ట్ర జాబితాలోని అధికారాలైన విద్య, విద్యుత్, వ్యవసాయం లాంటి అన్ని అంశాలను కేంద్రం లాగేసుకోవడంతో పాటు జిఎస్టి లాంటి కేంద్రీకృత పన్ను విధానం ద్వారా రాష్ట్రాలను ఆర్థికంగా కూడా బలహీనపరుస్తుందని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో అనేక వాగ్దానాలు చేసిందని, నల్గొండ జిల్లాకు శాశ్వత కరువు నివారణలో భాగంగా చేపట్టిన ఎస్ఎల్‌బిసి సొరంగ నిర్మాణం, డిండి ఎత్తిపోతల పథకం, బి వెల్లెంల ఎత్తిపోతల, పిల్లాయిపల్లి ధర్మారెడ్డి ఫీడర్ ఛానల్స్, మైనర్ ఇరిగేషన్ పథకాలకు గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నిధులు కేటాయించకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని వీటిని ప్రస్తుత ప్రభుత్వం త్వరగా పూర్తి చేయుటకు అధిక నిధులు కేటాయించి పనులు వెంటనే పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో చర్చించి భవిష్యత్ పోరాట కార్యక్రమాన్ని ఈ మహాసభలో రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. ఈసమావేశం పట్టణ సహాయ కార్యదర్శి జూలూరి జ్యోతిబస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల కార్యవర్గ సభ్యులు జూలూరి వెంకట్రాములు, శాఖ కార్యదర్శులు నగేష్, మైనోద్దిన్, శ్రీను, మల్లయ్య, బుచ్చయ్య, వెంకటయ్య, వెంకటాద్రి పాల్గొన్నారు.

## బిసిలను సంఘటితం చేయాలి

ప్రజాపక్షం/జోగులాంగ గద్వాల ప్రతినిధి: రాష్ట్రంలోని బీసీలందరిని సంఘటితం చేస్తామని రాష్ట్రంలో రానున్నది బీసీల రాజ్యమేనని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన బిసి ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అధిక బీసీ జనాభా ఉన్న రాజకీయ అవకాశాలు లేక వెనకబడి పోతున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ కోసం ఆర్డినెన్స్ తేవడం అభినందనీయమని, కేంద్రంలో బిల్లు పాస్ కోసం ప్రధానిని కలిసి వివరించాలన్నారు. క్షేత్రస్థాయిలో బీసీ సోదరులు ఐక్యమత్యంగా ముందుకు సాగి రానున్న స్థానిక ఎన్నికలలో సత్తా చాటాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రాజ్యాధికారం కోసం రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో బీసీ రాజ్యాధికారమే లక్ష్యంగా ప్రతి బీసీ పౌరుడు పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అక్కల రమా సాయిబాబా, బీసీ నాయకులు హాజరయ్యారు.

## బునాదిగాని కాలువకు సాగునీటి విడుదల



ప్రజాపక్షం/బీబీనగర్ : భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు కాలువ మరమ్మత్తుల కారణంగా నిలిపివేసిన బునాదిగాని కాలువకు సాగునీటిని రైతులకు కోరిక మేరకు విడుదల చేశామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగళి రెడ్డి, జిల్లా నాయకులు పోట్రోల్ శ్యామ్ గౌడ్, ఇరిగేషన్ డిఈ లావణ్య కలిసి సాగునీటి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొలుత కాలువ మరమ్మత్తుల కారణంగా నిలిపివేసిన సాగునీటిని రైతుల కోరిక మేరకు విడుదల చేశామని వర్షాకాలం పంటతో రైతులు సాగు చేసుకునే అవకాశం కల్పించారు. రైతులు ఏలాంటి ఆందోళనకు గురికాకుండా చూడాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సురకంటి సత్తిరెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి, మాజీ యంపిటిసి బసవయ్య, వెంకటేశ్వర్లు, మహేందర్, మోయిన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలి



### పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులకు నగదు
### ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి బహుమతి

ప్రజాపక్షం/మర్రిగూడ: ప్రభుత్వ విద్యను కాపాడడానికి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి పేద విద్యార్థిని విద్యార్థులకు ఆసరాగా ఉండడానికి తాను నగదు బహుమతిని అందిస్తున్నానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల విద్యాలయంలో 2024/2025 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థినికి రూ.15వేలు, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థినికి రూ.10వేలు, తృతీయ స్థానం సాధించిన విద్యార్థినికి రూ. 7500ల నగదు బహుమతిని అందించి, శాలువాతో సన్మానించి మెమెంటో అందించారు. నగదు బహుమతిని స్వయంగా అందజేయడానికి కేజీబీవీకి వెళ్లిన రాజగోపాల్ రెడ్డి కి సిబ్బంది,విద్యార్థులు ఘన స్వాగతం పలికారు.కేజీబీవీ అంతా కలియతిరిగి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థినుల సంఖ్య ఎక్కువగా ఉండడం సంఖ్యకు అనుగుణంగా మౌలిక వసతులు లేవని సిబ్బంది విద్యార్థినులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు వెంటనే తన సొంత నిధులతో ఖాళీగా ఉన్న ఫస్ట్ ఫ్లోర్ పై నాలుగు రూములు నిర్మించి ఇస్తానని బాత్రూమ్స్ కూడా సరిపడా వెంటనే నిర్మాణం చేపడతానని హామీ ఇచ్చి... తక్షణమే తన వ్యక్తిగత ఇంజనీర్ కు ఫోన్ చేసి రేపటినుండే నిర్మాణ పనులు మొదలుకావాలని ఆదేశించారు.తమ సమస్యను విని వెంటనే పరిష్కరిస్తున్నందుకు హర్షం వ్యక్తం చేస్తూ షేక్ హ్యాండ్ ఇవ్వడానికి పోటీపడ్డారు విద్యార్థినులు.

## 42 శాతం బిసి రిజర్వేషన్లు 9వ షెడ్యూల్‌లో చేర్చాలి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:42శాతం బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం(బిసిఐఎఫ్)నల్లగొండ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో బీసీ ఇంటలెక్చువల్స్ నల్లగొండ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. బిసిఐఎఫ్ రాష్ట్ర చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు ఆదేశాల మేరకు నల్లగొండ జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ నేలపట్ల చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలలో42 శాతం రిజర్వేషన్లకై కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ, న్యాయపరమైన చిక్కులు ఎదురవ్వకుండా వెంటనే కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థలే కాకుండా విద్య, ఉద్యోగాలలో కూడా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్లు నకిరేకంటి కాశయ్య గౌడ్, దొమ్మాటి అంజయ్య ప్రజాపతి, చామల చంద్రశేఖర్, ఆమంచి అంజయ్య, కంచనపల్లి షణ్ముఖాచారి, సిరసవాడ చంద్రం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పేదోడి సొంతింటి కల కాంగ్రెస్‌తోనే

ప్రజాపక్షం/నార్కట్‌పల్లి : పేదోడి సోంతింటి కల కాంగ్రెస్ సర్కార్‌తోనే సాధ్యమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ఆదివారం మండలంలోని 26 గ్రామాలలో నిరుపేదలకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను పటిష్టంగా అమలు చేస్తున్నందని ఆయన అన్నారు. అదేవిధంగా ఇల్లు లేని నిరుపేదల కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ఎమ్మెలే వీరేశం తెలిపారు. కాంగ్రెస్ హయంలోనే పేదలకు సంక్షేమ పథకాలు పటిష్టంగా అమలు చేసి ఇళ్లు లేని నిరుపేదల కోసం ఇల్లు కట్టించి పేదోడిని ఇంటి యాజమాని చేయడం చాలా సంతోషకరమని ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి దూదిమెట్ల సత్తయ్య యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, సట్టు సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, వడ్డె భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## రాజ్యాంగంపై బిజెపికి నమ్మకం లేదు

### మాజీ ఎంపి సుభాషిణి ఆలీ

ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి : భారత రాజ్యాంగం పై కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి నమ్మకం లేదని అందకనే రాజ్యాంగం అమలులో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నదని మాజీ ఎంపీ సుభాషిణి ఆలీ అన్నారు. ఆవాజ్ రాష్ట్ర3 వ మహాసభల సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని మక్కా మసీదు నుండి ర్యాలీ ప్రారంభించి పట్టణ పుర నిధులలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తేరు మైదానంలో అతికూర్ రెహమాన్ సభాధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభకు ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిజెపికి రాజ్యాంగం పట్ల నమ్మకం లేదని అందుకే, రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి అమలులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సీఏఏ ఎన్ఆర్ సీ చట్టం వల్ల మైనార్టీ హక్కులకు భంగం కలిగిందన్నారు. సంస్థ రాష్ట్ర చైర్మన్ రియాజ్ మాట్లాడుతూ దేశంలో లౌకిక విలువల పరిరక్షణ కోసం, ప్రజల మధ్య ఐక్యత పెంచడం కోసం ఆవాజ్ రాష్ట్ర మహాసభలు జరగాలని ఆ దిశగా విజయవంతం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి సరిత మాట్లాడుతూ ముస్లిం మైనార్టీ రిజర్వేషన్లు పట్ల కాంగ్రెస్ పార్టీ సానుకూలంగా ఉందని, విద్యా ఉద్యోగ రాజకీయ రంగాలలో జనాభా ప్రాతిపాదికన రాజకీయ అవకాశాలు కల్పించిన సంక్షేమ పథకాలు అమలుకు ప్రయత్నం చేస్తుందని అన్నారు. ఈ బహిరంగ సభకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యాక్షుడు ఎండి జబ్బార్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి, న్యాయవాది మధుసూదన్ బాబు, అఖిలపక్ష నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షుడు తాహేర్, మాజీ కౌన్సిలర్ ఇషాక్ ఇక్బాల్ పాషా సుంకర ప్రభాకర్ , కుర్వ పల్లయ్య, గంజిపేట రాజు పాల్గొన్నారు.




# టెండర్ ప్రక్రియలో అధికారులు గోల్‌మాల్?

### రాగి ప్రతిమల టెండర్‌లో అవకతవకలు
### ప్రకటనలో కొన్ని వివరాలు ప్రచురించిన వైనం
### సెలవు రోజు టెండర్ నిర్వహించిన అధికారులు మైక్, వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేయని అధికారులు
### చర్యలపై ఇఒ అనుమతి కోసం వెయిటింగ్



ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో టెండర్ల ప్రక్రియలో అధికారులు జిమ్మిక్కులు ప్రదర్శించారు. టెండర్ ప్రక్రియలో అవకతవకలు జరిగినట్లు ఆధారాలతో సహా వెలుగులోకి వచ్చాయి. గత నెల 30న ఓ దిన పత్రికలో ప్రచురితమైన టెండర్ ప్రకటనలో భక్తులకు సందేహాలు ఉన్నాయి. వారాంతపు సెలవు బుధవారం రోజని కనీసం ఫోన్లు లిఫ్ట్ చేయని అధికారులు ఏకంగా టెండర్ నిర్వహించడం ఎవరి ప్రయోజనం కోసమని భక్తులు ప్రశ్నిస్తున్నారు. సమగ్ర విచారణ జరిపి అధికారులపై చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

**అధికారుల తీరుపై సందేహాలు**

కొండకింద శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో భక్తులకు అందివ్వనున్న వ్రతాల్లో దేవస్థానం 12 గ్రాముల స్వామి రాగి ప్రతిమలు (రాగి విగ్రహం) అందజేసేందుకు రూ. 800 టికెట్టు రూ. 200 కలిపి రూ. 1,000లకు పెంచనున్నారు. వ్రత టికెట్టు పొందిన భక్తులకు ప్రతిమలు ఇచ్చేందుకు ఈవో నిర్ణయించారు. వీటి కోసం టెండర్ నిర్వహించేందుకు భక్తులకు పూర్తి స్థాయిలో సమాచారం అందకపోయే సరికి అవకతవకలు జరిగినట్లు అధికారులు పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టెండర్ నిబంధనలకు భిన్నంగా తేదీ, సమయం, ప్రదేశం ప్రకటించకుండానే వారాంతపు సెలవు రోజు వేలం పాట ప్రక్రియను పూర్తి చేశారు. దీనిపై స్థానిక భక్తుల్లో అధికారులు అవినీతికి పాల్పడిన్నట్లు సందేహాలు బలపడుతున్నాయి.

**ఎందుకు ప్రచారం చేయలేదు**

గతంలో టెండర్లు బహిరంగ ప్రకటన విడుదల చేసి, రెండు రోజుల ముందు నుంచే మైక్ లో అనౌన్స్ మెంట్, వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం, అధికారుల స్టేటస్ ద్వారానైన ప్రచారం నిర్వహించేవారు. ఆ సాంప్రదాయానికి తిలోదకాలు ఇచ్చి గతానికి భిన్నంగా అవి ఏవి లేకుండా అధికారులు వ్యవహరించడంతో స్థానికంగా పెద్ద దుమారమే రేగింది.

**రహస్యం ఎందుకో?**

కానీ, ఎలాంటి ఆర్భాటం లేకుండా, ప్రచారం చేపట్టకుండా అధికారులు రహస్యంగా టెండర్ల నిర్వాహించడం పలు విమర్శలకు తావిస్తోంది. అధికారులు కడిగిన ముత్యం అయితే వారాంతపు సెలవు రోజున ఎందుకు టెండర్ నిర్వహించారో నని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిబంధనలు తుంగలో తొక్కిడమే కాక అధికారుల సొంత లాభాపేక్షతో దేవస్థానానికి ఆర్థిక నష్టం కలిగే విధంగా టెండర్ల ప్రక్రియలో గోప్యతను పాటించడం పట్ల సందేహాలు బలపడుతున్నాయి.

**అధికారులపై చర్యలకు డిమాండ్**

టెండర్ల ప్రక్రియలో దేవస్థానం అధికారుల కుమ్మక్కు అయినట్లు స్పష్టమవుతోందని స్థానికులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈవో అనుమతి కోసం ఫైల్ వెయిటింగ్ లో ఉంది. తక్షణమే జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టి టెండర్ ప్రక్రియను రద్దు చేసి తప్పుదారి పట్టించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# క్రీడ

## బాక్సింగ్ సమాఖ్య ఎన్నికలపై ఉత్కంఠ..!

### త్రిసభ్య కమిటీ ఏర్పాటు



భారత బాక్సింగ్ సమాఖ్య ఎన్నికలపై నెలకొన్న అనిశ్చితికి త్వరలోనే తెరపడనుంది. కార్యవర్గం పదవీ కాలం ముగిసి ఐదు నెలలు గడుస్తున్నా.. ఎన్నికలు జరగకపోవడంపై ఆగ్రహించిన ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష కీలక నిర్ణయం తీసుకుంది. ఎలక్షన్ నిర్వహణకు ఆటంకంగా మారిన అంశాలను నిగ్గు తేల్చడం కోసం ఆదివారం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. 'ప్రస్తుతం కార్యనిర్వాహక మండలిలో ఉన్న సభ్యుల పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీన ముగిసింది. అయినా సరే ఇప్పటివరకూ కొత్త కార్యవర్గం కోసం ఎన్నికలు మాత్రం జరుగలేదు. దాంతో, దేశంలో బాక్సింగ్ పోటీల నిర్వహణ, బీఎఫ్ఐ పనితీరుపై ప్రభావం పడుతోంది. అందుకే.. త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశాం. వారం రోజుల్లో ఈ కమిటీ నివేదిక సమర్పించనుంది' అని ఉష తెలిపింది. ఐఓఏ చీఫ్ ఉష ఏర్పాటు చేసిన కమిటీలో కోశాధికారి సహదేవ్ యాదవ్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుల్లో ఒకరైన భూపేందర్ సింగ్ భజ్వా, న్యాయవాది పాయల్ కక్రాలు సభ్యులు. డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికలు నిర్వహణ గురించి,కాల వ్యవధి ముగిన వెంటనే ప్రక్రియను చేపట్టడం గురించి పలు సూచనలు చేయనుంది. బాక్సింగ్ సమాఖ్య ఎన్నికల నిర్వహణలో చొరవ తీసుకోవాలని క్రీడా మంత్రిత్వ శాఖ జూలై 5న ఉషకు లేఖ రాసింది. సో.. ఏమాత్రం ఆలస్యం చేయకుండా కమిటీ ఏర్పాటుతో సమస్యను పరిష్కరించడానికి సిద్ధమైంది ఐఓఏ చీఫ్.

## మళ్లీ టెస్టులు ఆడాలని ఉంది.. ఒక్క ఛాన్స్ ఇవ్వండి

### అజింక్యా రహానే



ఆస్ట్రేలియా పర్యటనలో సారథిగా చిరస్మరణీయ విజయాలు అందించిన అజింక్యా రహానే జట్టుకు దూరమై రెండేళ్లు కావొస్తుంది. అతడు చివరిసారిగా వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో వైట్ జెర్సీ వేసుకున్నాడు. దేశవాళీ టోర్నీలు, ఐపీఎల్‌లో అదిరిపోయే బ్యాటింగ్‌తో చెలరేగుతున్న ఈ మాజీ కెప్టెన్ మరోసారి టెస్టుల్లో ఆడాలనుకుంటున్నాడట. సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వీడ్కోలుతో తనకు అవకాశం ఇవ్వాలని సెలెక్టర్లను కోరుతున్నాడు రహానే. ఇంగ్లాండ్ పర్యటనతో శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా ఎంపికవ్వడంతో పునరాగమనంపై ఆశలు పెంచుకుంటున్నాడు రహానే. తనకు ఒక్క ఛాన్స్ ఇస్తే చాలు సుదీర్ఘ ఫార్మాట్‌లో మెరుపులు మెరిపిస్తానంటున్నాడీ 37 ఏళ్ల క్రికెటర్. ఈమధ్యే స్కై స్పోర్ట్స్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'నాకు టెస్టు క్రికెట్ ఆడాలని ఉంది. ఇప్పటికీ నాకు సుదీర్ఘ ఫార్మాట్ అంటే చాలా ఇష్టం. అందుకే.. సెలెక్టర్లతో మాట్లాడేందుకు ప్రయత్నించాను. కానీ, వాళ్ల నుంచి ఎలాంటి స్పందన రావడం లేదు. కమ్ బ్యాక్ కోసం చూస్తున్న నాకు తలుపులు మూసేశారు' అని ఈ ముంబై సారథి వాపోయాడు.

## రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ ఆలౌట్

**భారత్ లక్ష్యం 193**



స్వల్ప ఛేదనలో భారత జట్టుకు రెండో ఓవర్లోనే షాక్ తగిలింది. విధ్వంసక ఓపెనర్ యశస్వీ జైస్వాల్(0)ను ఆర్చర్ డకౌట్ చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో అతడి ఓవర్లోనే వెనుదిరిగిన యశస్వీ.. ఈసారి షార్ట్ పిచ్ బంతికి పెద్ద షాట్ ఆడబోయి వికెట్ కీపర్ స్మిత్ చేతికి దొరికాడు. దాంతో, 5 పరుగుల వద్ద భారత్ తొలి వికెట్ కోల్పోయింది. ప్రస్తుతం కేఎల్ రాహుల్(5), కరుణ్ నాయర్(2)లు జాగ్రత్తగా ఆడుతూ భాగస్వామ్యం నిర్మించే పనిలో ఉన్నారు. ఇంకా గిల్ సేన విజయానికి 186 రన్స్ కావాలి.

బర్మింగ్‌హమ్‌లో సంచలన విజయంతో సిరీస్ సమం చేసిన భారత జట్టు లార్డ్స్‌లోనూ గెలుపు వాకిట నిలిచింది. నాలుగో రోజు బౌలర్ల విజృంభణతో ఇంగ్లాండ్ ఆటగాళ్లు డగౌట్‌కు క్యూ కట్టారు. తొలి సెషన్‌లో సిరాజ్(231) నిప్పులు చెరిగితే లంచ్ తర్వాత వాషింగ్టన్ సుందర్ (422) ఆతిథ్య జట్టు నడ్డివిరిచాడు. డేంజరస్ జో రూట్(40), బెన్ స్టోక్స్(33), జేమీ స్మిత్(8)లను క్లీన్‌బౌల్డ్ చేశాడు. టీ బ్రేక్ అనంతరం జస్ప్రీత్ బుమ్రా(238) వికెట్ల వేట కొనసాగించాడు. బషీర్‌ను సుందర్ బౌల్డ్ చేయడంతో రెండో ఇన్నింగ్స్‌లో192కే ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌కు తెరపడింది.

# ఫోకస్ — ఆరోగ్యం

## గ్లైఫోసేట్ జీవవిధ్వంసక విషం!

భూమిలో జీవానికి భూమిపై మానవాళికి పెనుముప్పుగా మారిన ఈ గడ్డి మందును పూర్తిగా నిషేధించని వ్యవస్థలు, వాడకంపై పరిమితిని విధించాయి, కానీ కొన్ని చోట్ల నిషేధం వున్నా, పరిమితులు వున్నా యథేచ్ఛగా క్రయ విక్రయాలు, వాడకాలు జరుగుతున్నాయి. భూమి పుడమిలో జీవాన్ని హరించేది కలుపు కాదు, కలుపును చంపుతున్న మానవ చర్యలే. దానికి అధినాయకుడిగా మారినది గ్లైఫోసేట్ అనే నాన్-సెలెక్టివ్ హెర్బిసైడ్ ఇది వాడిన భూమిలో జీవం మిగలదు.




### గడ్డినే కాదు జీవులను చంపే విషపు రసాయనం

ఇది ఉన్న చోట మట్టి శ్వాస తీసుకోలేదు, పంటల మీద పడితే మాడిపోతాయి, అది వాడిన గడ్డిని తినే మూగ జీవాలు మృత్యువాత చెందుతాయి, రైతులు, ప్రజలు తీవ్రమైన అనారోగ్యాల బారిన పడతారు.

**గ్లైఫోసేట్ అంటే ఏమిటి?**

గ్లైఫోసేట్ అనేది ఒక బ్రాడ్‌స్పెక్ట్రం కలుపు నివారణ మందు. దీన్ని అమెరికాలోని ఒక ప్రముఖ కంపెనీ మొదటిసారిగా 1970లో 'రౌండప్' అనే బ్రాండ్ పేరుతో మార్కెట్లోకి తెచ్చింది. ఇది మొక్కలలోని 'ఈపిస్‌పిసింతసిసే' అనే ముఖ్యమైన ఎంజైమ్‌ను నిరోధించి మొక్కల పెరుగుదల నిలిపేస్తుంది. దీన్ని ప్రధానంగా కలుపు మొక్కల కోసం వాడతారన్నప్పటికీ, ఇది పంట మొక్కలు, మట్టి జీవులపై కూడ తీవ్రమైన ప్రభావం చూపుతుంది.

**రైతు ఖర్చు తగ్గడానికి మాయదారి — ఆరోగ్యానికి మృత్యుదారి!**

రైతులు కూలీల ఖర్చు తగ్గించేందుకు గ్లైఫోసేట్‌ను విస్తృతంగా వాడుతున్నారు. కానీ దీని వలన వారు కలుపును చంపుతున్నట్టు కనిపించినా, భవిష్యత్తులో ఆరోగ్య ఖర్చులు, భూమి నష్టాలు, దిగుబడి తగ్గుదల వంటివి మరింత నష్టం తెస్తున్నాయి.

- 2023లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధ్యయన ప్రకారం, గ్లైఫోసేట్ పిచికారి చేయడమే కారణంగా నెలకు సగటున 12 మంది రైతులు తీవ్రంగా అనారోగ్యానికి గురవుతున్నారు.
- ఎయిమ్స్ నివేదిక ప్రకారం గ్లైఫోసేట్ వ్యాప్తి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో గర్భస్థ శిశువుల అభివృద్ధిలో లోపాలు 18% పెరిగాయి.

**పర్యావరణ ప్రభావం — భూతాపానికి మూలం!**

గ్లైఫోసేట్ వల్ల మట్టిలోని ఫంగై, బ్యాక్టీరియా వంటి సూక్ష్మ జీవులు నశించి, హ్యూమస్ ఉత్పత్తి నిలిచిపోతుంది. ఇది కార్బన్ నిల్వల తగ్గుదలకు దారితీసి, గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాన్ని పెంచుతుంది. దీని వలన వాతావరణ మార్పులకు ఇది పరోక్షంగా కారకమవుతుంది. యునైటెడ్ నేషన్స్ ఐపిపిసి 2022 నివేదికలో స్పష్టం: ఈ హెర్బిసైడ్ వినియోగం గణనీయంగా పెరగడం వల్ల వాతావరణంపై దుష్ప్రభావాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

భారతదేశంలో గ్లైఫోసేట్ ప్రస్థానం

భారతదేశంలో గ్లైఫోసేట్ అనధికారికంగా తీవ్రంగా ప్రమాదకరమైన రసాయనంగా గుర్తించబడినా, ఇప్పటికీ ఇది గ్రామీణ ప్రాంతాల్లో స్వేచ్ఛగా లభిస్తోంది. 2022 నవంబరులో కేంద్ర ప్రభుత్వం పాక్షిక నిషేధాన్ని ప్రకటించినా, అది కేవలం నామమాత్రమే. వ్యవసాయ శాఖకి చెందిన పలు రాష్ట్ర శాస్త్రవేత్తలు దీని వినియోగాన్ని దానంతటదే ప్రోత్సహిస్తూ కనిపించడం శోచనీయం.

— జి.అజయ్ కుమార్

### ప్రపంచ దేశాల గ్లైఫోసేట్ నిషేధాలు — తాత్కాలిక బంధనాలు

**శ్రీలంక:**
2015లో గ్లైఫోసేట్ నిషేధం. సికెడియూ (క్రానిక్ కిడ్నీ డీసీస్ ఆఫ్ అన్నోన్ ఆరిజిన్) పెరగడంతో నిషేధం విధించారు కానీ అది ఎంతో కాలం కొనసాగలేదు.
జర్మనీ, ఆస్ట్రియా, ఫ్రాన్స్, ఇటలీ, నెదర్లాండ్స్ వంటి దేశాలు 2025 లోపే గ్లైఫోసేట్ నిషేధానికి కట్టుబడి ఉన్నట్లు ప్రకటించాయి.

**అమెరికా:**
2018లో కాలిఫోర్నియాలో మొదటిసారి కంపెనీపై కేసు నెగ్గిన రైతుకు 289 మిలియన్ డాలర్లు నష్టపరిహారం విధించబడింది. ఇప్పటివరకు 100,000కి పైగా కేసులు దాఖలయ్యాయి.

**కెనడా:**
ఫుడ్ ఇన్‌స్పెక్షన్ ఏజెన్సీ గ్లైఫోసేట్ అవశేషాలు ఆహార పదార్థాల్లో మించిపోతున్నాయని హెచ్చరికలు జారీ చేసింది.
కానీ ఈ నిషేధాలు అన్నీ ఎంతో కాలం కొనసాగలేదు మళ్ళీ దాని వాడకం ఆయా దేశాల్లో యధేచ్ఛగా పెరిగింది

**తెలుగు రాష్ట్రాల్లో — నిషేధాల మాయా !**
ఆంధ్రప్రదేశ్ తెలంగాణలో అప్పట్లో 60 రోజుల తాత్కాలిక నిషేధం విధించినా& మార్కెట్లలో బహిరంగంగా గ్లైఫోసేట్ లభిస్తోంది. రాష్ట్రాలకు శాశ్వత నిషేధానికి అధికారం లేకపోవడమే దానికి ప్రధాన కారణం. కేరళ, సిక్కిం లాంటి రాష్ట్రాలు మాత్రం రాజకీయ సంకల్పంతో శాశ్వత నిషేధం అమలు చేయగలిగాయి.

**గ్లైఫోసేట్ మానవ ఆరోగ్యంపై ప్రభావాలు — WHO, IARC నివేదికలు**
WHOకి చెందిన ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్ 2015లో గ్లైఫోసేట్‌ను 'ప్రాబబుల్ హ్యూమన్ కార్సినోజెన్ (గ్రూప్ 2ఏ)'గా ప్రకటించింది.

**ఇది తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది:**
— క్యాన్సర్, — గర్భస్థ శిశువుల లోపాలు
— నాడీ వ్యవస్థ లోపాలు
— శ్వాస సమస్యలు
— చర్మ సమస్యలు, అలర్జీలు
— మూత్రపిండాలు, కాలేయ సమస్యలు

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

## పేదోడి పక్షాన పోరాటం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

### ఘనంగా సుజాతనగర్ సిపిఐ మండల మహాసభ





**ప్రజాపక్షం/సుజాతనగర్ :** పేదలు, కార్మికుల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులు మాత్రమేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలోని సీతంపేట బంజర్‌లో సుజాతనగర్ సిపిఐ నాలుగో మండల మహాసభ కోమరి హనుమంతరావు, ముక్కెర మురళి, లావుడియా గోపి అధ్యక్షతన ఘనంగా జరిగింది. ముందుగా సిపిఐ సీనియర్ నాయకులు భాగం శేషభూషణం సిపిఐ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీకి వేగుచుక్కల కొత్తగూడెం నియోజకవర్గం ఉందన్నారు, ఆకాశం, నేల ఉన్నంతకాలం కమ్యూనిస్టులు ఉంటారని, 40 సంవత్సరాలుగా ఈప్రాంతంలో సిపిఐ బలోపేతంగా ఉందన్నారు. పార్టీకి కార్యకర్తలే బలం అన్నారు. సుజాతనగర్ నుంచి ఐదుసార్లు రజబ్‌అలీ ఎమ్మెల్యేగా గెలిచారంటే ఈ ప్రాంత ప్రజలకు సిపిఐపై ఎంత ఆధరణ ఉందో తెలుస్తుందన్నారు. సమస్యల పరిష్కారంలో సిపిఐ ఛాంపియన్‌గా నిలుస్తుందన్నారు. కమ్యూనిస్టుల పోరాటాలతోనే అనేక సంక్షే మ పథకాలు ప్రజలకు అందుతున్నాయని తెలిపా రు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా మాట్లాడుతూ ప్రజాసమస్యలపై సిపిఐ పోరాడుతుందని తెలిపారు. ఇందిరమ్మ పథకంలో ఇండ్లు అర్హులకు రాజకీయాలకు అతీతంగా కూనంనేని నాయకత్వంలో అందిస్తున్నామన్నారు. సభలో సిపిఐ రాష్ట్ర నాయకులు కల్లూరి వెంకటేశ్వర్లు, నారాటి ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీను, సలిగంటి శ్రీను, వాసిరెడ్డి మురళి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు భూక్యాదస్రు, కుమారి హనుమంతరావు, జక్కుల రాములు, తాళ్ల వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి పొదిల శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు తాళ్లూరి పాపారావు, ధర్మారావు, మదన్‌సింగ్, ఎఐటియుసి మండల అధ్యక్షులు వీర్ల మల్లేష్, మాజీ ఎంటిపిసి గణేష్, సిపిఐ నాయకులు బొడ్డు కేశవరావు, వీర దుర్గ ప్రసాద్, కోమరి కృష్ణ, ఆకుల వెంకన్న, ఎట్టి వెంకటేష్, శశికాంత్, శంకర్, రాజేష్, మండే నాగేశ్వరరావు, భూక్యా శ్రీను, దండు సురేష్, భాగం కృష్ణ, సిపిఐ ప్రజా సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కాలుష్యాన్ని నియంత్రించకుంటే పరిశ్రమలను ముట్టడిస్తాం..

### సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం





**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ ప్రాంతంలో పరిశ్రమలు వెదజల్లుతున్న కాలుష్యాన్ని నియంత్రించకుంటే పరిశ్రమలను ముట్టడిస్తామని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హెచ్చరించారు. చౌటుప్పల్ పట్టణంలోని బిఆర్‌కె కన్వెన్షన్‌హాల్లో ఆదివారం సిపిఐ చౌటుప్పల్ మండల 7వ మహాసభ పిల్లి శంకర్, కడవేరి కౌసల్య అధ్యక్షతన జరిగింది. సభకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ముఖ్య అతిధిగా హాజరయ్యారు. మహాసభల సందర్భంగా సిపిఐ జెండాను జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు ఆవిష్కరించారు. అనంతరం సభలో నెల్లికంటి సత్యం, గోద శ్రీరాములు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, పెన్షన్లు మంజూరు చేయాలని, స్థానిక పరిశ్రమలో స్థానికులకే 80 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, మల్కాపురం, కైతాపురం, దేవులమ్మ నాగారం, పీపల్ పహాడ్, తంగడపల్లి లక్కారం చౌటుప్ప చెరువులు కృష్ణజలాలతో నింపాలని, చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో సర్వీస్ రోడ్డు పూర్తిచేయాలని, మండలానికి బస్‌డిపో ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, ఇఎస్‌ఐ హాస్పిటల్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభలో మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యులు బచ్చన గోని గాలయ్య, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్ద శ్రీనివాస్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్, సిపిఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా సహాయకార్యదర్శి జక్క దయాకర్‌రెడ్డి, కలకొండ సంజీవ, ఉడుత రామలింగం, టంగుటూరి రాములు, బద్దుల సుధాకర్, కొండూరు వెంకటేష్, ఉడుత రామలింగం, దాసరి అంజయ్య, ఎస్‌ఎ రెహ్మాన్, దాసరి యాదయ్య, కుంటి పాపయ్య, సింగపంగా బుచ్చయ్య బోయిని యాదయ్య, రొండి నరసింహ, గడ్డం యాదయ్య, దాసరి కృష్ణ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్యం తగదు



### సిపిఐ జాతీయ నాయకురాలు సురవరం విజయలక్ష్మి

**ప్రజాపక్షం/ఉండవెల్లి :** ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్యం తగదని సిపిఐ జాతీయ నాయకురాలు సురవరం విజయలక్ష్మి అన్నారు. ఆదివారం ఉండవెల్లి మండల పరిధిలోని కంచుపాడు గ్రామంలో సురవరం విజ్ఞాన కేంద్రంలో సిపిఐ మహాసభ రవి అధ్యక్షతన జరిగింది. సభకు ముఖ్యఅతిథులుగా సురవరం విజయలక్ష్మి తో పాటు సురవరం కపిల్, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు హాజరయ్యారు. సభ ప్రారంభానికి ముందు ఎర్రజెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో విజయలక్ష్మి మాట్లాడుతూ 100 ఏండ్లుగా సిపిఐ ఈ దేశంలో పేదల కోసం పుట్టి అవి విశ్రాంతి పోరాటాలు సాగిస్తుందన్నారు. దున్నే వాడికి భూమి కావాలని మొట్టమొదట నినదించిన పార్టీ సిపిఐ మాత్రమే అన్నారు. ప్రతి గ్రామంలో సిపిఐ ప్రజాసంఘాలను ఏర్పాటు చేసి పోరాడితే ప్రజలకు మేలు జరుగుతుందని పార్టీ శ్రేణులకు సూచించారు. ఆగస్టు నాలుగున జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో జరిగే సిపిఐ జిల్లా మహాసభలను విజయవంతపు చేయాలని ఆమె పిలుపునిచ్చారు. సమ సమాజం కోసం, పీడిత, తాడిత ప్రజల కోసం, వారి సమస్యలపై నిరంతరం నిస్వార్థంగా ప్రశ్నిస్తున్న పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని ఆమె కొనియాడారు. ప్రజలకు అందజేయాల్సిన సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం వహించడం సరికాదని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వ పెట్టుబడిదారులకు ఉపయోగపడే విధంగా చట్టాలను తీసుకురావడం సరైనది కాదని ఆవేదన వ్యక్తపరిచారు. సమస్యల పరిష్కారంలో సిపిఐ శ్రేణులు ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు.

## ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆంక్షలు దుర్మార్గం

### జిఒ మేరకే కొత్త ఆటోపర్మిట్‌లు ఇవ్వాలి ... లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం

### ఆటోరిక్షా డ్రైవర్స్ యూనియన్ జెఎసి హెచ్చరిక




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వ గైడ్‌లైన్స్‌కు విరుద్ధంగా ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ విధించిన ఆంక్షలతో కొత్త ఆటో పర్మిట్‌ల కోసం ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ ఆటోరిక్షా డ్రైవర్స్ యూనియన్ జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగం రూపుమాపాలనే సదుద్దేశంతో సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఒఆర్ఆర్ లోపల 60 వేల కొత్త ఆటో పర్మిట్ల జారీకి గైడ్‌లైన్స్‌తో జిఒ జారీ చేసిందని గుర్తుచేశారు. కానీ, అందుకు విరుద్ధంగా ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సురేంద్ర మోహన్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయమై ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జెఎసి నేతలు ఎం.సలీం (యుటిఎడిడబ్ల్యు), వి.ప్రవీణ్ (టియుసిఐ), ఎస్.రామకిషన్ (బిఆర్‌టియు), పి.యాదగిరి (టిఎన్‌టియుసి)లతో కలిసి వెంకటేశం మీడియాతో మాట్లాడారు. ట్రాన్స్‌పోర్ట్ కమిషన్ చర్యలతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎక్కడైనా కొత్త ఆటోలు కొనుగోలు చేయొచ్చని జిఒలో ఉంటే, ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చెప్పిన ఫలానా డీలర్ వద్ద కొనుగోలు చేయాలని హుకుం జారీ చేయడమేమిటని వారు ప్రశ్నించారు. ఉమ్మడి ఏపిలోని డిఎల్‌ఎఫ్ ఆటోలైసెన్‌లు ఇప్పుడు చెల్లవని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత జారీ చేసిన లైసెన్స్‌లే చెల్లుతాయని చెప్పడం విడ్డూరంగా ఉన్నదన్నారు. రోజుకు 100 ఆటోలు లాగిన్ అని పెట్టడం కూడా సరికాదన్నారు. ప్రభుత్వ జిఒ ప్రకారం రోజుకు 1000 ఆటోలు లాగిన్ చేసి, వెంటనే డెలివరీ చేయాలని, త్రీ వీలర్‌తోపాటు ఫోర్ వీలర్ లైసెన్స్ ఉన్న వారికి ఆటోలు ఎక్కడైనా కొనుగోలుకు అనుమతించాలని వెంకటేశం డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆటో జెఎసి నేతలు ఎస్.అశోక్, బి.తిరుమలేశ్‌గౌడ్, ఎం.జనార్దన్‌రెడ్డి, ఎండి.రఫీ, షేక్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## అక్రమంగా ఎర్రమట్టి తరలిస్తున్న ట్రాక్టర్లపై కేసు నమోదు

**ప్రజాపక్షం/కుల్కచర్ల :** అక్రమంగా ఎర్రమట్టి తరలిస్తున్న మూడు ట్రా క్టర్లపై కేసు నమోదు చేసిన కుల్కచర్ల పోలీస్‌లు ,అనుమతులు లేకుండా కుల్కచర్ల మండల పరిధిలోని ఎర్రమట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను ప ట్టుకొని కేసునమోదు చేయడం జరిగింది అని ఎస్ఐ తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అనుముతుల లేకుండా ఇసుక , ఎర్రమట్టి , కలప ,తదితర వటిపై నిరంతరం నిఘ ఉంచడం జరుగుతుంది అని అన్నారు. మండలలో గంజాయి ,గుటుకపై అమ్మిన స్వీకరించిన వరిపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది అని అన్నారు.



## తీన్మార్ మల్లన్నపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

### మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడు నర్సింగరావు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్నపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈదాడి పిరికిపందల చర్యగా పరిగణిస్తున్నామని మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండల ము న్నూరుకాపు సంఘం అధ్యక్షుడు చాట్లపల్లి న ర్సింగరావు అన్నారు. ఆదివారం ఉప్పల్‌లోని తీన్మార్ మల్లన్న క్యూన్యూస్ కార్యాలయంలో తీన్మార్ మల్లన్నపై దాడి చేయడంతో స్పందించిన ఆయన మీడియాతో మాట్లాడారు. తీన్మార్ మల్లన్నపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో రెండు, మూడు సార్లు తీన్మార్ మల్లన్నపై దాడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని, ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చలేదని తన వార్తల ద్వారా ప్రభుత్వాన్ని ప్రశ్నించారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఆదే పార్టీకి చెందిన ఓ నాయకురాలి అనుచరులు కార్యాలయంపై దాడికి దిగారని ఆరోపించారు. ఈ దాడి వెనక ఎవరు ఉన్నా వదిలే ప్రసక్తే లేదని మల్లన్నపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయకుంటే పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## దుండిగల్ దుర్గమ్మ తల్లి బోనాల పండుగలో కూన శ్రీశైలం గౌడ్



**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుండిగల్ మున్సిపాలిటీలో శ్రీశ్రీ దుర్గమ్మ దేవి బోనాల పండుగ సందర్భంగా కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యతిధిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హారతి సమర్పించారు. అనంతరం కండ్లకోయ సాయి గీత ఆశ్రమం పిఠాధిపతి శ్రీశ్రీ సాయికుమార్ బాబా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ను శాలువాతో సత్కరించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, దుండిగల్ దుర్గమ్మ తల్లి బోనాల పండుగలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. బోనాల పండుగ సందర్భంగా ఆదిశక్తి అమ్మవారు శ్రీ దుర్గమ్మ తల్లి ఆశీస్సులు దుండిగల్ ప్రజలపైన అలాగే రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, తెలంగాణ రాష్ట్రంలో బోనాల పండుగకు చాలా ప్రత్యేకత ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిన్నంగి వేంకటేశం, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కావలి గణేష్, లింగం గౌడ్, ఆకుల ప్రేమ్ కుమార్, ఉదయ్, విశ్వనాథ్ గౌడ్, జక్కుల మల్లేశ్, అమరం ముత్యం రెడ్డి, కొత్తపేట శ్రీను, నవీన్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నిరంతరం ప్రజలకు అండగా సిపిఐ

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** వందేళ్లు పూర్తి చేసుకొన్న సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభలను విజయవంతం చేయాలంటూ పార్టీ సీనియర్ నేత బొడ్డుపల్లి కృష్ణ కోరారు. న్యూనాగోల్‌లోని సిపిఐ ప్రజా సంఘాల కార్యాలయం డాంగే భవన్‌లో ఆదివారం ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. పేదల పక్షాన నిలబడి పోరాటాలతో నిరంతరం ప్రజలకు అండగా ఉంటున్న పార్టీ సిపిఐ మాత్రమేనన్నారు, ఈ కార్యక్రమంలో ఉప్పల్ మండల సహాయ కార్యదర్శి ఎండి బషీర్,ఎస్. రాములు, రాసమల్ల రాజేందర్, ఉడతల మల్లేష్, బి,సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ప్రభుత్వ భూమి కబ్జా

### జిల్లా అధికారులకు తెలిసినా పట్టించుకోవడంలేదు

**ప్రజాపక్షం/వికారాబాద్‌ప్రతినిధి :** భవిష్యత్తు అవసరాలకు ప్రభుత్వ భూములు లేకుండా కబ్జాలకు పాల్పడుతున్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్నా కబ్జా విషయం జిల్లా అధికారులకు, మండల అధికారులకు తెలిసిన పట్టించుకోవడం లేదని తెలుస్తుంది. వికారాబాద్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే దారిలో 88 సర్వేనెంబర్ 33 గుంటల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైన ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని తెలుస్తుంది. అలంపల్లిలోని సర్వేనెంబర్ 244లో 2 ఎకరాల పైన కబ్జా గురైయింది. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని తెలుస్తుంది. 88 సర్వేనెంబర్‌లో అధికార పార్టీ నాయకులు కబ్జా చేసినందుకే అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఫిర్యాదు చేసినా విచారణ పేరుతో సాగదీస్తున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. కబ్జాలపై అడిషనల్ కలెక్టర్, కలెక్టర్ వరకు ఫిర్యాదులు అందినా ఎవరూ స్పందించిన దాఖలాలు లేవు. భూముల ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో కబ్జాలకు మరింత అజ్యం పోస్తున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పెద్దల సహకరంతోనే కబ్జాలు జరుగుతున్నాయిని ప్రజల చర్చించుకుంటున్నారు.

## గ్రామల్లో గుంపులుగా సంచరిస్తున్న కోతులు

### ఇబ్బంది పడుతున్న జనం.. పట్టించుకోని పాలకులు

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** గ్రామల్లో కోతుల గుంపుల బెంబేలుతిస్తున్నా యి. ఇళ్లపై, పంటలపై దాడు లు చేస్తు బీభత్సం సృష్టిస్తున్నాయి. వికారాబాద్ నియోజకరవ్గంలోని ధార్మపూర్, కొండపూర్, కాలాన్ గ్రామం లో సంచారిస్తున్నాయి. విద్యార్థులు, ముసలోల్ల వెంటపడుతున్నాయి. వాహనాదారులు అందోళనకు గురవుతున్నారు. చిన్నరుల దగ్గర, ఇళ్లలోకి చొరబడి నిత్యావసర సరుకులను చిందరవందర చేస్తున్నాయి. అధికారులకు ,ప్రజా ప్రతినిధులకు తెలిపిన పట్టించుకోవడం లేదని తెలుస్తుంది. గత ప్రభుత్వం సర్వేకు అదేశాలిచ్చిన అధికారులు కోతులను తరలిచడంలో నిర్లక్ష్యం వహించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కోతుల బెడదవల్ల పనులు వదులుకోని కాపాలా ఉండల్సి వస్తుంది అని రైతులు, ప్రజలు తెలిపారు.





# ఘనంగా సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాలు

## ప్రభుత్వాల నియంతృత్వ ధోరణితో అవినీతి పెచ్చరిల్లిపోతోంది





### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు జి.దామోదర్‌రెడ్డి

### సిపిఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని బైక్ ర్యాలీ

**ప్రజాపక్షం/కాప్రా:** కుత్బుల్లాపూర్‌లో ఆగస్టు మాసంలో జరుగనున్న సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేసే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు పోటీ పడి పని చేయాలని, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్‌రెడ్డి పిలుపిచ్చారు. ఆదివారం పార్టీ కార్యకర్తలు ఇసిఐఎల్‌లోని సిపిఐ కార్యాలయం నీలం రాజశేఖర రెడ్డి భవన్ నుండి కుషాయిగూడ, హెచ్‌బి కాలనీ, మల్లాపూర్, నాచారం, హబ్సిగూడ, ఉప్పల్, చిలుకనగర్ వరకు బైక్ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఉప్పల్ చౌరాస్తా ప్రాంతంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ మహాసభల నేపథ్యంలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజలు పెద్ద సం ఖ్యలో సభకు హాజరయ్యేలా యత్నించాలన్నారు. పార్టీ ఆవిర్భావం నుండి స్వాతంత్ర పోరాటం, ఆ తర్వాత నేటి వరకు ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజలకు మద్దతుగా కమ్యూనిస్టులు పోరాటం చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు విఫలమవుతున్నాయన్నా రు. ప్రభుత్వాల నియంతృత్వ ధోరణి కారణంగా అవినీతి పెచ్చరిల్లిపోతోందని, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలతో తీరని అన్యాయం జరుగుతోందని వాపోయారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.శంకరరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, సిపిఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి.సత్యప్రసాద్,మండల కార్యవర్గ సభ్యులు సబ్బు రాజమౌళి, ఎల్లయ్య, జోషి కుమార్, ఏఐవైఎఫ్ నేతలు గిరిబాబు, విశాల్, దుర్గాప్రసాద్, శేఖర్, విజయ్, సంజయ్,హరికృష్ణ, ఎఐఎస్‌ఎఫ్ నేతలు అజీమ్ పాషా,మహేష్, రాజు, సమీర్, నదీమ్, జస్వంత్, షాబాజ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### సిపిఐ మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సమితి సభ్యులు

## కాపు సహదేవ్ ఆకస్మిక మృతి



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** సిపిఐ మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సమితి సభ్యులు కాపు సహదేవ్ అనారోగ్యంతో గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొం దుతూ ఆదివారం సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో తుది శ్వాస విడిచారు. యాప్రాల్ ప్రాంతానికి చెందిన ఆయన సిపిఐ సిద్ధాంతాలకు ఆకర్షితుడై పేద, దళిత, బడుగు వర్గాలకు అండగా ఉండి అనేక పోరాటాలు చేసి ప్రజలకు చేరువయ్యాడు. ఆయన అకాల మృతి పార్టీకి తీవ్ర లోటని ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రవి చంద్ర న్ అన్నారు. ప్రజా నాట్యమండలి నుండి మూడు పర్యాయాలు ఆల్వా ల్ మండల కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యులుగా పార్టీకి ఎనలేని సేవలందించారని సహదేవ్ కుటుంబ సభ్యులకు తీవ్ర సంతాపం తెలిపారు. నిరంతరం పార్టీ సేవలో పేద ప్రజల కోసం భూపోరాటాలు నిర్వహిం చి పేద ప్రజలకు ఇళ్ల పట్టాలిప్పించిన ఘనత సహదేవ్‌కే దక్కిందన్నా రు. సిపిఐ ఆల్వాల్ మండల కార్యదర్శి ఏ.బాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి.జంగయ్య, సిపిఐ సీనియర్ నేత పి.చంద్రయ్య, మున్సిపల్ సంఘం జిలాల ఉప ప్రధాన కార్యదర్శి బి.నరేందర్, జిల్లా నాయకురాలు సిహెచ్ తులసి, ఉప ప్రధాన కార్యదర్శి జి.మహేందర్, మున్సిపల్ సంఘం నాయకులు కౌసర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బిఈ శ్రీనివాస్,జి. తిరుపతి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్ బోస్, పార్టీ రాష్ట్ర నాయకులు జి.దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఉమామహేష్ తదితరులు సహదేవ్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు.

# 'పల్లెలపై కల్తీ కల్లు విషం'



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గ్రామీణ పల్లెసీమల్లో గరళాన్ని తలపించే విధంగా కల్తీకల్లు రాజ్యమేలుతుంది..అమాయక ప్రజల అవసరాలను అసరగా చేసుకొని ప్రాణాలతో చెలగాటం అడుతుంగే పట్టించుకునే నాధులు లేకుండా పోయారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏక్సైజ్ శాఖ ఉన్నట్లా..లేనట్లా అనే సందేహాలు సైతం తలెత్తుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లె సీమల్లో ఈత చెట్లు కనిపించవు కానీ..డ్రమ్ములకొద్ది కల్తీకల్లు మాత్రం కళ్ళుకు కట్టినట్లు కనిపిస్తుండటంతో పట్టించుకునే నాధులు లేకుండా పోయరని వాపోతున్నారు. రాష్ట్ర రాజదానికి కూతవేటు దూరంగా ఉన్న షాద్‌నగర్ డివిజన్‌లో కల్తీకల్లు రాజ్యమేలుతుంటే పట్టించుకునే నాధులు లేకుండా పోయారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్, కేశంపేట, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రాలతోపాటు వివిధ గ్రామాల్లో కల్తీ కల్లును ఇష్టారాజ్యంగా తయారు చేస్తున్నారు. ఈత చెట్లు ఆశించిన స్థాయిలో లేకపోవడం..ఉన్న కొద్దిపాటి చెట్ల నుండి కల్లు తీసుకువచ్చి దాంతో డ్రమ్ములకొద్దిగా కల్తీకల్లును తయారు చేస్తూ విక్రయిలు సాగిస్తున్నారు. అందులో నిషేధిత మత్తు పదార్థాలు ఇష్టారాజ్యంగా వేస్తుండటంతో తాగిన కల్లుకు ప్రజలు బానిసలై వింతచేష్టలకు లోనవుతున్నారు. ఒక్కరోజు మత్తు పదార్థాలు కల్లులో లేకుండా వారు చేసే చేష్టలను వర్ణణాతీతంగా ఉంటాయని చెప్పవచ్చు. ఈ తతంగం మొత్తం ఎక్సైజ్ శాఖ అధికారులకు తెలిసినప్పటికి తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో వ్యాపారులు ఇదే అదునుగా భావించి అంధించన కాడిచి దోచుకుంటున్నారు. అసలే వ్యవసాయ సీజన్ కావడంతో కల్తీకల్లు వ్యాపారం మూడు పువ్వులుఆరు గాయలుగా సాగుతుందని చెప్పవచ్చు. ఎక్సైజ్ శాఖ అధికారులు సకాలంలో స్పంధించి నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### కంటి చూపు మొదలుకొని కోమా వరకు సమస్యలే : డాక్టర్ విజయలక్ష్మీ

ప్రమాదకరమైన రసాయనాలు కలిపిన కల్తీకల్లు తొలుత కంటి చూపుపై ప్రభావం చూపుతుందని షాద్‌నగర్ డిప్యూటి డిఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మీ వివరించారు. కల్తీకల్లు తాగిన వారిలో ఇది మొదటి లక్షణంగా కనిపిస్తుందని, ఎక్కువ మోతాదులో మిథెల్ ఆల్కహాల్ రక్తంలో కలువడంతో వారి మెదడుపై ప్రభావం చూపిస్తుందని వివరించారు. ఈ దశలో ఫిట్స్ రావడం, మానసిక స్థితి కొల్పోవడం, పిచ్చిగా వ్యవహారించడం వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. సమయం గడిచే కొద్ది సమస్య తీవ్రత పెరిగి కోమాలోకి జారుకునే అవకాశాలు ఉంటాయని వివరించారు. కల్తీకల్లులో ఉన్న రసాయనాలు కిడ్నీలను దెబ్బతీస్తాయని, దాంతో డయాలసిస్ చేయాల్సిన దుస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. కడుపులో యాసిడ్ నిల్వలు పెరగడం వల్ల శ్వాస వేగం పెరిగి గుండె కొట్టుకోవడంలో మార్పులు వచ్చేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. కడుపులో ఆమ్ల స్థాయిలు పెరిగి జీర్ణ వ్యవస్థలో మార్పులు చోటు చేసుకుంటాయని, కల్తీకల్లు తాగి కోమాలోకి వెళ్లితే వెంటనే వెంటిలేటర్‌పై పెట్టి చికిత్స అంధించాల్సి ఉంటుందని తెలిపారు. కల్తీకల్లును నియంత్రించేందుకు ప్రజలందరు ఐక్యంగా బహిష్కరించాలని సూచించారు.

### నిషేధిత మత్తు పదార్థాలను నియంత్రించేందుకు చర్యలు : సిఐ శేఖర్

కల్లులో విక్రయించే నిషేధిత మత్తు పదార్థాలను నియంత్రించేందుకు పకడ్బంధీగా చర్యలు తీసుకుంటున్నామని షాద్‌నగర్ ఎక్సైజ్ సిఐ శేఖర్ వివరించారు. షాద్‌నగర్ డివిజన్‌లో విక్రయిస్తున్న కల్లు దుకాణాల్లో అనేక పర్యాయాలు తనిఖీలు చేశామని, మత్తు పదార్థాలు లభించిన షాపులపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. నిషేధిత మత్తు పదార్థాలకు అస్కారం లేకుండా అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని సిఐ పేర్కొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## కాంట్రాక్ట్ ప్రాతిపదికన 21 మెడికల్ ఆఫీసర్ పోస్టులు : డిఎంహెచ్ఓ

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి : రంగారెడ్డి జిల్లాలోని నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ (ఎన్‌యుహెచ్ఎం) కింద అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో (యుపిహెచ్‌సిఎస్ ) కాంట్రాక్ట్ ప్రాతిపదికన 21 మెడికల్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తులు సీకరిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కాంట్రాక్ట్ ఒక సంవత్సరం పాటు ఉంటుంది. అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను బయోడేటా అండ్ వారి సర్టిఫికెట్ల నుధృవీకరించిన కాపీలతో పాటు, 11జులై 2025 నుంచి 18 జులై 2025 సాయంత్రం 5 గంటలలోపు రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి సమరించాలని తెలిపారు. దరఖాస్తు ఫారం, మార్గదరకాలు, నిబంధనలు, షరతులను అధికారిక వెబైట్: www.rangareddy. telangana.gov.in నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చునని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# జిహెచ్ఎంసి కమిషనర్ 'ఆదేశాలు బేఖాతర్'!

### నగరవ్యాప్తంగా ఇష్టారాజ్యంగా సెల్లార్ల తవ్వకాలు
### పట్టించుకోని క్షేత్రస్థాయి టౌన్‌ప్లానింగ్ యంత్రాంగం





ప్రజాపక్షం/హైదరాబాద్ : ఐదు నెలల కిందట ఎల్‌బి. నగర్‌లోని ఒక నిర్మాణ స్థలంలో సెల్లార్ కూలి ముగ్గురు కార్మికులు మరణించిన సంఘటనను మహానగర పాలక సంస్థ (జిహెచ్ఎంసి) అధికారులు అప్పుడే మరిచిపోయినట్లు ఉన్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో సెల్లార్ ప్రమాదాలు జరుగుతాయని తెలిసినా.. ఉదాసీన వైఖరి అవలంభిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వర్షాకాలం ముగిసేవరకు భవన నిర్మాణాలకు సంబంధించిన సెల్లార్ల తవ్వకాన్ని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ నిషేధించారు. ఇందుకు సంబంధించి మే 30వ తేదీన కమిషనర్ కర్ణన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయితే కమిషనర్ ఆదేశాలను క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బంది బేఖాతర్ చేస్తున్నారు. సెల్లార్ల తవ్వకాలను ఆపేందుకు ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదు. ఇష్టారాజ్యంగా సెల్లార్లు తవ్వుతున్నా పట్టించుకునే వారే లేకుండా పోయారు. ఇరుగుపొరుగు భవనాలకు ప్రమాదకరంగా తవ్వుతున్నా.. పట్టించుకునే వారే లేకుండా పోయారు. విస్తారంగా వర్షాలు కురిస్తే భవనాల కింద నుంచి నేల కోతకు గురయ్యే ప్రమాదం ఉంటుంది. ఇది వాటి నిర్మాణ బలాన్ని బలహీనం చేస్తుంది. రిటైనింగ్ గోడలు నిర్మించడం లేదు. చాలా ప్రాంతాల్లో ఎటువంటి భద్రతా చర్యలు తీసుకున్న దఖాలాలు కనిపించడం లేదు. రాంనగర్ ప్రాంతంలో కూడా ఇష్టారాజ్యంగా సెల్లార్ల తవ్వకాలు చేపట్టారు. రాంనగర్ గుండు ప్రధాన రహదారిలో యథేచ్ఛగా సెల్లార్ తవ్వకాలు చేపట్టారు. ప్రక్కనే ఉన్న భవనానికి ప్రమాదకరంగా తవ్వకాలు చేపట్టారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పిల్లర్లు నిర్మాణం ప్రారంభించారు. రాం నగర్ అల్లం చాయ్ హోటల్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ తవ్వుతున్నారు. రాంనగర్ గుండు ప్రధాన రహదారిలో, రాంనగర్ అల్లం చాయ్ హోటల్ వద్ద జరుపుతున్న సెల్లార్ తవ్వకాలకు అనుమతులు లేవు. అనధికారికంగా సెల్లార్ తవ్వకాలు చేపట్టిన ముషీరాబాద్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సెల్లార్ల తవ్వకాలు జరిపేటప్పుడు మట్టి జారకుండా, రిటైనింగ్ గోడలు, బారికేడింగ్ వంటి అవసరమైన ప్రామాణిక భద్రతా చర్యలు తీసుకోకపోతే నోటీసు జారీ చేయాల్సి ఉంటుంది. నిబంధనలు పాటించకపోతే, పనిని ఆపడానికి, బిల్డర్ అనుమతి, లైసెన్సు రద్దు చేయడానికి, బిల్డర్ క్రిమినల్ కేసు నమోదు చేయడానికి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. తవ్విన భాగాన్ని నిర్మాణ శిధిలాలను ఉపయోగించి ఏకకాలంలో పూడ్చేయాలి. వాలుగా ఉన్న ప్రాంతాలలో తవ్వకాలపై, రాతి కోత జరుగుతు న్న చోట, భూమి జారిపోకుండా నిరోధించడానికి ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంటుంది. కానీ క్షేత్ర స్థాయిలో ఎక్కడ అమలు కానీ పరిస్థితులు నెలకొన్నాయి. సాక్షత్తు కమిషనర్, టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చినా చేస్తున్న క్షేత్ర స్థాయి సిబ్బంది పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

## కాలనీలు అభివృద్ధి చేయడమే లక్ష్యం
### ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : ఎల్‌బి నగర్‌నియోజకవర్గంలో ప్రతి కాలనీలను అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మన్సూరాబాద్ డివిజన్‌లోని కాస్మోపాలిటన్ కాలనీలో ఓపెన్ జిమ్ గ్రౌండ్‌లో జరిగిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పనులను పరివేక్షణ చేసుకుంటూ పనులు చేయించకోవాలని కాలనీ వాసులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, డివిజన్ మాజీ అధ్యక్షులు పోచబోయిన జగదీష్ యాదవ్, టంగుటూరి నాగరాజు, విజయభాస్కర్‌రెడ్డి, యువజన నాయకులు జక్కిడి రఘువీర్‌రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం : రాగుల



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : వనస్థలిపురం డివిజన్‌లోని శక్తి నగర్ కాలనీలో నూతన సిసి రోడ్డు పనులను వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలకు నిధులు మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామారావు, పాశం అశోక్‌గౌడ్, వనస్థలిపురం మహిళా అధ్యక్షురాలు భాను, కాలనీ వాసులు అజయ్ యాదవ్, ఎండి. ఖాదర్, కాసర్ల వెంకట్‌రెడ్డి, కొత్త కిష్టయ్య, రామ్‌రెడ్డి, లింగం బుజ్జి హర్షవర్ధన్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

## కాలనీ రోడ్లపై చెత్త లేకుండా చర్యలు
### బిఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : డివిజన్‌ల్లో కాలనీ రోడ్లపై చెత్త లేకుండా పరిశుభ్రతగా ఉండే విధంగా జిహెచ్ఎంసి మున్సిపల్ కార్మికులు శ్రద్ధ తీసుకోవాలని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం డివిజన్‌లోని బిఎన్‌రెడ్డి నగర్ కాలనీలో కాలనీ వాసులతో కలిసి పర్యటించారు. కార్మికులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని కోరారు. అనంతరం కాలనీ అధ్యక్షులు పురుషోత్తంరెడ్డి జన్మదినం సందర్భంగా మున్సిపల్ కార్మికులకు చీరలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో పోచమ్మ దేవి ఆలయ చైర్మన్ ప్రదీప్‌రెడ్డి, కాలనీ ప్రధానకార్యదర్శి ధనరాజ్, వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్ష్మారెడ్డి, రవి కిరణ్‌రెడ్డి, కాశిరెడ్డి, హరగోపాల్, మహిపాల్‌రెడ్డి, నర్సిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సురేష్ కుమార్, జవాన్ యాదయ్య, బాలకృష్ణ పాల్గొన్నారు.

## బిసిల అభ్యున్నతే కాంగ్రెస్ ధ్యేయం



ప్రజాపక్షం/సరూర్‌నగర్ : తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర క్యాబినేట్ నిర్ణయం తీసుకోవడం హర్షనీయం అని గడ్డిఅన్నారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బద్దుల గణేష్‌యాదవ్ అన్నారు. అదివారం డివిజన్ పరిధిలోని దిల్‌షుఖ్‌నగర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసిల అభ్యున్నతే కాంగ్రెస్ ధ్యేయం అన్నారు. కార్యక్రమం బద్దుల వెంకటేష్‌యాదవ్, మద్దెల సునీల్‌బాబు, సత్యనారాయణ, శశిధర్‌రెడ్డి, శ్రీనివాస్, విజయ్, కృష్ణారెడ్డి, శాంతి, శ్రీను, సాయి పాల్గొన్నారు.

## సాంప్రదాయాలకు ప్రతీక బోనాలు



ప్రజాపక్షం/సరూర్‌నగర్ : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాల ఉత్సవాలు అని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. అదివారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పోరేషన్‌లోని నాదర్‌గుల్ గ్రామంలో కాసుబాగ్ రైతులు నిర్వహించినటువంటి ఆది పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో అందెల శ్రీరాములు ముఖ్యఅతిధిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పోరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి మహేష్, రచ్చ లక్ష్మ ణ్, చింతల రాఘవేందర్‌ముదిరాజ్, పోరెడ్డి నితిన్‌రెడ్డి, సామ నిషికాంత్‌రెడ్డి, మనీష్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

## బిసిలకు రిజర్వేషన్లు హర్షణీయం

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్ అమలు పరుచుతామని రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదించటం హర్షనీయమని బిసి సంఘం సీనియర్ నాయకులు బజారు బిక్షపతి అన్నారు. ఆదివారం రంగారెడ్డి ఇబ్రహీంపట్నం మండలం ఎల్మినేడు గ్రామంలో ఆయన మాట్లాడుతూ బిసిలకు రాజ్యాధికార సాధన లక్ష్యంగా నాయకులు అహర్నిషలు ఉద్యమించటంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ హాయంలో బిసిలకు 42 రిజర్వేషన్ అమలు జరుగటం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో బిసిల రిజర్వేషన్ అమలు జరుగటంతో వెనుబడిన బిసి వర్గాల ప్రజలు ఆర్థిక, సామాజీక, రాజకీయ, సాంఘికంగా అన్ని రంగాలలో అభివృద్ధి చెందటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు సహకరించిన ఎఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బిసి సంక్షేమ శాఖమంత్రి పొన్నాల ప్రభాకర్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# పిల్లలను సమాజహిత శక్తిగా తీర్చిదిద్దాలి
### 'సిప్' గ్రాడ్యుయేషన్ డేలో సైకియాట్రిస్టు నెహ్రూ



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : పిల్లలను సమాజానికి ఉపయోగపడే శక్తిగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని సైకియాట్రిస్టు జవహర్‌లాల్ నెహ్రూ సూచించారు. పిల్లలు చెప్పినదానిని స్పష్టంగా విని, వారి కోరికలను నెరవేర్చాలని, అప్పుడే వారికి తల్లిదండ్రులపై నమ్మకం పెరుగుతుందన్నారు. ఆదివారం హైదరాబాద్ హైదర్‌గూడలోని ఓ హోటల్‌లో జరిగిన సిప్ అకాడమీ హిమాయత్‌నగర్ బ్రాంచ్ సంధ్య ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే, ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జవహర్‌లాల్ నెహ్రూతోపాటు ఏరియా హెడ్ కిరిట్‌షా హాజరయ్యారు. నెహ్రూ మాట్లాడుతూ అబాకస్ ద్వారా విద్యార్థుల్లో జ్ఞాన నైపుణ్యం, మేధాశక్తి బలపడి వారిలో ఆత్మవిశ్వాసం రెట్టింపువుతుందన్నారు. ఇటీవల జరిగిన సిప్‌సంస్థ ప్రాంతీయ అబాకస్ పోటీల్లో 3,100 మంది విద్యార్థులు గెలుపొందగా, వీరిలో హిమాయత్‌నగర్ బ్రాంచికి చెందిన దాదాపు 35 మంది ప్రతిభ అవార్డులు, 15మంది విద్యార్థులకు విజేత బహుమతులను అందజేశారు. ఫౌండేషన్, అడ్వాన్స్‌డ్, గ్రాండ్ మాడ్యూవల్ స్థాయిలు పూర్తిచేసుకొన్న దాదాపు 26 మంది విద్యార్థులకు గ్రాడ్యుయేట్ పట్టాలిచ్చి, సత్కరించారు.

## ఘనంగా కూచిపూడి అరంగేట్రం



ప్రజాపక్షం /ఖైరతాబాద్ : నటరాజ నాట్యాంజలి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ నాట్య గురువు నీలిమ గడ్డమనుగు (యుఎస్ఎ) ఆశీర్వాదంతో హర్షిని చుండి కూచిపూడి రంగ ప్రవేశం ఘనంగా జరిగింది. ఆదివారం సాయంత్రం మాదాపూర్ శిల్పకళావేదికలో తల్లిదండ్రులు కల్యాణి, వెంకట్ చుండి, కుటుంబసభ్యులు, అతిథులు సమక్షంలో నీలిమ తొలి నాట్య ప్రదర్శన ఇచ్చి, అందరినీ మెప్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఐటిశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, యాదగిరిగుట్ట కలెక్టర్ హనుమంతరావు, బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ, సంతోష్ హాజరై, నీలిమ చేసిన గణేశ కౌత్వం, భామకలాపం, శివ శివ భవ భవ, కృష్ణ శబ్దం, సరస్వతీ స్తుతి వంటి నర్తకి ప్రదర్శనలు చూసి, అభినందించారు.

## పోచమ్మ బస్తీ పురాతన ఆలయంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పూజలు



ప్రజాపక్షం/శంషాబాద్ : శంషాబాద్ మున్సిపాలిటీ 8వ వార్డులోని పోచమ్మ బస్తీలో ఉన్న పురాతన దేవాలయంలో ఉమ్మడి బోనాల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని యువ నాయకుడు తోకల మురళి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గణేష్ గుప్తా, నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దూడల వెంకటేష్ గౌడ్, కోలన్ మహేందర్ రెడ్డి, కౌన్సిలర్లు శ్రీనివాస్ గౌడ్, మేకల వెంకటేష్,ప్రవీణ్ గౌడ్, కౌన్సిలర్ ఆయిల్ కుమార్,మాజీ ఎంపిపి టిసి జ్ఞానేశ్వర్ యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

## బసవతారకనగర్ గుడిసెవాసులకు ఇల్లు నిర్మించివ్వాలి
### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు



ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : బసవతారక నగర్‌లో 30 సంవత్సరాల నుండి నివసిస్తున్న గుడిసెవాసులకు అక్కడే ఇళ్ళను నిర్మించి ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. బసవతారక నగర్‌లో కూల్చిన గుడిసెలను ఆదివారం శేరిలింగంపల్లి సిపిఐ కార్యదర్శి రామకృష్ణ, సహాయకార్యదర్శి చందుయాదవ్‌తో పర్వతాలు పరిశీలించారు. ఈ సందర్భంగా గుడిసె వాసులను ఉద్దేశించి పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు న్యాయం జరుగుతుందని అశించిన వారకి ప్రభుత్వం నుంచి నిరాశే ఎదురవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాక ముందు అప్పటి ప్రతిపక్ష నాయకుడి హోదాలో రేవంత్‌రెడ్డి బసవతారక నగర్ విచ్చేసి, బసవతారక నగర్ గుడిసెలు వేసుకున్నా వారికి ఆ స్థలంలోనే ఇళ్ళను నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారని, తమ పార్టీ అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీ మరిచి, పేదలపై ఉక్కుపాదం మోపుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. దాదాపు 30 సంవత్సరాల నుంచి గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డి బసవతారకనగర్‌లో పేదలు గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తూ, ఇక్కడే పెళ్ళిళ్ళు, ఆధార్‌కార్డు, ఓటరు కార్డులతో తమ ఓటు హక్కు ను సైతం వినియోగించుకుంటున్నారన్నారు. ఇక్కడే పుట్టి, ఇక్కడే కాలం వెళ్లదీస్తామని, మేము ఎక్కడికి వెళ్ళమని తమకు న్యాయం చేయాలని గుడిసెవాసులు తమ అవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. బసవతారక నగర్‌లో పేదలకు ఇళ్ళు నిర్మించి ఇచ్చే వరకు ప్రజా ఉద్యమాలు తప్పవని సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు పానుగంటి పర్వతాలు తెలిపారు.

## ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పానుగంటి రాణికి డాక్టరేట్



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పానుగంటి రాణి డాక్టరేట్ పొందారు. విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్‌సర్ డాక్టర్ నథానియేల్ పర్యవేక్షణలో ఇన్వెస్టిగేషన్ ఆఫ్ స్రలో అసోసియేట్ ప్రొఫ్టెక్చరల్, ఎలక్ట్రికల్ అండ్ మాగ్నెటిక్ ప్రాపర్టీస్ ఆఫ్ రేర్ ఎర్త్ డాప్ట్ నికెల్‌జింక్ నానో ఫెరైట్స్ అనే అంశంపై పరిశోధన నిర్వహించి థీసిస్‌ను సమర్పించారు. దాంతో ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. పానుగంటి రాణి నాగర్‌కర్నూల్ జిల్లా గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలు గా పనిచేస్తూ పిహెచ్‌డి పూర్తి చేశారు. ప్రస్తుతం కేశంపేట మండలం కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకురాలుగా విధులు నిర్వహిస్తున్నారు.

## ఇంటి స్థలాలు పంపిణీ చేసిన విశాల

ప్రజాపక్షం/షాద్‌నగర్: తెలుగు సినీ ఆర్ట్ డైరెక్టర్లకు కేశంపేట మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి ఇంటి స్థలాలను పంపిణీ చేశారు. ఆదివారం కేశంపేట మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా విశాల శ్రావణ్‌రెడ్డి, సినీనటుడు అలీ హాజరయ్యారు. ఈ సందర్భంగా విశాల శ్రావణ్‌రెడ్డి మాట్లాడుతూ సినీ రంగంలో కళాకారుల కృషి, ప్రతిభ ఎనలేనిదని పేర్కొన్నారు. సినీ ఆర్ట్స్ డైరెక్టర్లకు ఇంటి స్థలాలు లభించడం శుభ పరిణామమన్నారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకొవాలని ఆకాంక్షించారు. ఈ స్థలాల పంపిణీతో ఆర్ట్స్ డైరెక్టర్ల ధీర్ఘకాలిక స్వప్నం నేరవేరిందని, వారి కుటుంబ సభ్యులకు భద్రతను మరింత చేకూర్చుతుందని పేర్కొన్నారు.



## వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం
### ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి




ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఆదివారం పట్టణంలో గుండు మహేష్, ఉదయ్‌లు నూతనంగా ఏర్పాటు చేసిన ఆల్ఫా ఫిట్నెస్ సెంటర్‌ను ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. వ్యాయామం చేయడంతో వివిధ రకాల ఒత్తిడిలను జయించడంతోపాటు మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని షాద్‌నగర్ మాజీ ఎమ్మెలే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి వివరించారు. ఆదివారం పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యులు శ్యాంసుందర్‌రెడ్డి, మున్సిపల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చెన్నయ్య, మాజీ కౌన్సిలర్ రాజేందర్ రెడ్డి, మురళి, బస్వం అప్పలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల్లో భారీ అక్రమ నిర్మాణాలు
### రెవెన్యూ అధికారుల చేతివాటంతో ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు







ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి మండల పరిధిలోని గచ్చిబౌలి డివిజన్ పరిధీలోని గోపన్‌పల్లి సర్వే నెం. 124లో గల ఎన్టీఆర్‌నగర్, తాజ్‌నగర్, సోఫా నగర్‌లలో ప్రభుత్వానికి చెందిన స్థలాలలో ఎటువంటి అనుమతులు లేకుండా భారీ అంతస్థులను అక్రమ నిర్మాణాదారులు యదేచ్ఛగా నిర్మిస్తున్నారు. ఇటు రాజకీయ నాయకులు, జిహెచ్‌యంసి అధికారులు, అటు రెవెన్యూ అధికారులు సహకారంతో అక్రమ నిర్మాణాలు అకాశానందుకుంటున్నాయని స్థానికులు అరోపిస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణాల వెనుక రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ పాత్ర కీలకంగా ఉందని, ప్రతి భవన నిర్మాణం కోసం లక్షలలో వసూళ్ళు చేస్తున్నారని, ఆఅధికారిని కలవకపోతే కనీసం ఇటుక కూడ కదలదంటున్నారు. సర్వే నెం 124లోని ఎన్టీఆర్ నగర్, తాజ్ నగర్, సోఫా నగర్‌లలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలను వెంటనే అడ్డుకొని జిహెచ్ఎంసి అధికారులపై, రెవెన్యూ అధికారులపై చర్యలు చేపట్టి ప్రభుత్వ భూమిని రక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక రాజకీయ నాయకుల మద్ధతుతో పాటు అధికారుల అండతో ఈ అక్రమ నిర్మాణాలకు అడ్డు, అదుపు లేకుండా పోయిందని, వారు వాపోతున్నారు. సోఫా కాలనీలో ఓ అక్రమ నిర్మాణ భవనం నిర్మాణాదారుడు ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా అంతస్థులు నిర్మించడంతో పాటు రోడ్డునే డ్రైనేజీగా మార్చడానికి భారీగుంతలను ఏర్పాటు చెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజేందర్ నగర్ ఆర్‌డిఒ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌లు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని, స్థానిక రెవె న్యూ అధికారులపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములను రక్షించాలని స్థానికులు కోరుచున్నారు.

## రీల్

'డబ్బు ఖర్చు.. సబ్బు ఖర్చు.. నీళ్ల ఖర్చు' అనే డైలాగ్‌తో గుర్తొచ్చే లక్ష్మీ పతి పాత్ర కోట నటనకు ఒక మైలురాయి. 'అహ నా పెళ్లంట' సినిమాలో ఆయన పోషించిన పిసినారి పాత్ర ఇప్పటికీ తెలుగు ప్రేక్షకులకు నవ్వులు పంచుతోంది. ఇవన్నీ సోషల్ మీడియాలో ఇప్పటికీ వైరల్ అవుతూనే ఉంటాయి.

# కళామతల్లి సేవలో ముగిసిన కోట శకం

## కోట శ్రీనివాసరావుకు సినీ ప్రముఖుల నివాళి



### దేశం గొప్ప నటుడ్ని కోల్పోయింది: బ్రహ్మానందం

కోట శ్రీనివాసరావు పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులర్పించిన హాస్య నటుడు బ్రహ్మానందం కన్నీరు మున్నీరయ్యారు. కోట శ్రీనివాసరావు మరణించాడన్న విషయాన్ని నమ్మలేకపోతున్నాను అని ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశం గొప్ప నటుడిని కోల్పోయింది అని బ్రహ్మానందం వ్యాఖ్యానించారు. ఇంత గొప్ప నటుడు తెలుగు తెరపై పుట్టడం తెలుగు సినిమా చేసుకున్న అదృష్టం అని అన్నారు. కోట శ్రీనివాసరావు ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను అని బ్రహ్మానందం పేర్కొన్నారు.

### ఎన్నో పాత్రలకు జీవం పోశారు : బాలకృష్ణ

ప్రముఖ సినీ నటులు, పద్మశ్రీ కోట శ్రీనివాసరావు మృతి పట్ల పలువురు సినీ నటులు నందమూరి బాలకృష్ణ సంతాపం తెలియజేశారు. నాలుగు దశాబ్దాల సినీ ప్రయాణంలో ఎన్నో విలక్షణ పాత్రలు పోషించిన కోట శ్రీనివాసరావు తెలుగు ప్రేక్షకుల గుండెల్లో తనకంటూ ప్రత్యేకస్థానం సంపాదించుకున్నారు. తన విలక్షణ నటనతో ఎన్నో పాత్రలకు జీవం పోశారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. కోట శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను అని తెలిపారు.

### మా ఇద్దరి నట ప్రస్థానం ఒకే సినిమాతో ప్రారంభ మైంది: చిరంజీవి



కోట శ్రీనివాసరావు,తన నట ప్రస్థానం ఒకే సినిమాతో ప్రారంభమైంది అని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. తెరమీద కోటా శ్రీనివాస్ నటన అద్భుతం. వ్యక్తిగతంగా ఆయన హాస్యం చమత్కారం కూడా అద్భుతం.ఆయనతో ఎంతో అనుబంధం పెనవేసుకొని ఉంది.ఆయన అన్ని యాసలు, మాండలికాలు అవలీలగా మాట్లాడగలరు. ఆయన మృతి పరిశ్రమకు, ఆయన కుటుంబానికి తీరని లోటు.వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను..

### కోట లేని లోటు ఎవరూ తీర్చలేనిది : నాగార్జున

కోట శ్రీనివాసరావు ఆత్మకు శాంతి కలగాలని హీరో అక్కినేని నాగార్జున పేర్కొన్నారు. కోట మరణం వార్త విని దిగ్భ్రాంతికి లోనయ్యానని అన్నారు. ఈ మేరకు తన సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కోట లేని లోపం ఎవరూ తీర్చలేనిదని చెప్పారు.

### తెలుగు భాష.. యాస తెలిసిన నటుడు: పవన్‌కల్యాణ్

''తెలుగు చిత్ర పరిశ్రమలో విలక్షణమైన నటనకు చిరునామాగా నిలిచిన కోట శ్రీనివాసరావు తుది శ్వాస విడిచారని తెలిసి తీవ్ర ఆవేదనకు లోనయ్యాను. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. తెలుగు తెరపై ప్రతినాయకుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా విభిన్నమైన పాత్రలు పోషించారు. తెలుగు భాష... యాసలపై ఆయనకు మంచి పట్టు ఉంది. ఓ పిసినారిగా, ఓ క్రూరమైన విలన్‌గా, ఓ మధ్య తరగతి తండ్రిగా, ఓ అల్లరి తాతయ్యగా.. ప్రతి పాత్రలో ఒదిగిపోయారు. నా మొదటి చిత్రం 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి..'లో ఆయన ముఖ్యమైన పాత్రలో ప్రేక్షకులను అలరించారు. ఆ తర్వాత పలు సినిమాల్లో కలిసి నటించాం. కోట శ్రీనివాసరావు డైలాగ్ చెప్పే విధానం, హావభావాలు ప్రేక్షకులను కట్టిపడే స్థాయి. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను''

### కోట శ్రీనివాసరావుకు బాబు నివాళి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోట శ్రీనివాసరావు పార్థివ దేహానికి నివాళులర్పించారు. చిత్రసీమకు కోట లేకపోవడం తీరని లోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులను చంద్రబాబు పరామర్శించి ధైర్యం చెప్పారు. అత్యంత సామాన్య కుటుంబం నుంచి ఉన్నత శిఖరాలను అధిరోహించారని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను అని చెప్పారు.



### మాటల్లో చెప్పలేని దుఃఖాన్ని కలిగించింది : మోహన్ బాబు

ప్రముఖ నటుడు, నిర్మాత పద్మశ్రీ డా. ఎం. మోహన్ బాబు కోట శ్రీనివాసరావుకు సోషల్ మీడియాలో ప్రగాఢ సంతాపం తెలిపారు. మోహన్ బాబు తన సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో ఇలా పేర్కొన్నారు.

### నిబద్ధత గల నటుడు కోట : మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

పట్టుదల, క్రుషి, నిబద్ధత కలగలిపిన నటుడు కోట శ్రీనివాసరావు అని భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఫిలిం నగర్ లోని కోట శ్రీనివాసరావు నివాసానికి వచ్చిన వెంకయ్య నాయుడు కోట చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఎన్నో విలక్షణమైన పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించారని ఆయన అన్నారు. కోటను చూసి నేర్చుకోవలసింది ఎంతో ఉందని అన్నారు. రాజకీయాల్లో కూడా ఎంతో నిబద్ధతతో పని చేశారన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను అని చెప్పారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## మలయాళంలో వర్క్ అంటే ఎంతో భయపడ్డా


శిల్పా శెట్టి

బాలీవుడ్ నటి శిల్పాశెట్టి కీలక పాత్రలో నటించిన చిత్రం 'కేడీ: ది డెవిల్'. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా కొచ్చిన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో శిల్పాశెట్టి కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ఇప్పటివరకు వివిధ భాషా చిత్రాల్లో నటించానని చెప్పిన ఆమె.. మలయాళ చిత్ర పరిశ్రమలో వర్క్ చేయాలంటే మాత్రం భయపడ్డానని అన్నారు. అందుకు గల కారణాన్ని కూడా వెల్లడించారు. ''కెరీర్ ఆరంభం నుంచి ఇప్పటివరకూ వివిధ భాషల్లో యాక్ట్ చేశాను. హిందీతోపాటు తెలుగు, తమిళం, కన్నడలో విభిన్నమైన చిత్రాల్లో నటించాను. అయితే, మలయాళ చిత్ర పరిశ్రమలో పనిచేయడానికి మాత్రం నేనెంతో భయపడ్డా. అందుకే ఆ పరిశ్రమ నుంచి ఎన్నో అవకాశాలు వచ్చినా వాటిని అంగీకరించలేకపోయా. వ్యక్తిగతంగా నాకు మలయాళ చిత్ర పరిశ్రమ అంటే గౌరవం ఉంది. మలయాళీ చిత్రాలు చూస్తుంటా. భావోద్వేగాలను ఎంతో చక్కగా స్క్రీన్ మీదకు తీసుకువస్తారు. అక్కడి వారి వర్క్ చూసి ఎన్నోసార్లు ఆశ్చర్యపోయా. ఆ పరిశ్రమలో ఏదైనా సినిమా అంగీకరిస్తే.. నా పాత్రకు సరైన న్యాయం చేయలేనేమోననిపిస్తుంది. అందుకే ఇప్పటివరకూ అక్కడ సినిమా అంగీకరించలేదు. భవిష్యత్తులోనైనా ధైర్యం తెచ్చుకుని యాక్ట్ చేస్తానేమో చూడాలి. జీవితంలో తప్పకుండా ఒక్క మలయాళ సినిమా అయినా చేస్తా'' అని ఆమె తెలిపారు.

ఆ చిత్రపరిశ్రమకు సంబంధించి అగ్ర నటుడు మోహన్‌లాల్ అంటే తనకెంతో ఇష్టమని ఆమె చెప్పారు. ''భారతీయ చలన చిత్రపరిశ్రమలో ఉన్న గొప్ప నటుల్లో మోహన్‌లాల్ ఒకరు. ఆయన అద్భుతంగా నటిస్తారు. ఆయనతో కలిసి వర్క్ చేయాలని ఉంది. అవకాశం వస్తే తప్పకుండా వర్క్ చేస్తా'' అని తెలిపారు.

### కోట లాంటి నటుడు దొరకడు : వెంకటేష్

కోట శ్రీనివాసరావు లాంటి నటుడు భారతీయ సినిమాకు మళ్లీ దొరికాడు అని హీరో వెంకటేష్ అన్నారు. కోట పార్థివ దేహానికి నివాళులర్పించిన వెంకటేష్ మీడియాతో మాట్లాడుతూ కోట నుంచి తాను ఎంతో నేర్చుకున్నాను అని అన్నారు. కోట లేని లోటు ఎవరూ తీర్చలేదని చెప్పారు.

### కోటకు రాణా నివాళి

కోటా శ్రీనివాస్ మరణం యావత్ చిత్ర పరిశ్రమ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. విషయం తెలిసిన వారంతా సామాజిక మాధ్యమాల్లో కోటా మృతి పట్ల సంతాప సందేశాలు ప్రకటించగా... మరికొంత మంది సీని, రాజకీయ ప్రముఖులు ఫిల్మ్ నగర్ లోని కోట శ్రీనివాసరావు నివాసానికి చేరుకొని ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. కోటాతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బ్రహ్మానందం, బాబుమోహన్, అలీ లాంటి అత్యంత సన్నిహితులైన హాస్యనటులు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో కోట శ్రీనివాసరావు అంత్యక్రియలు నిర్వహించారు. ఫిల్మ్‌నగర్‌లోని కోట నివాసం నుంచి.. మహాప్రస్థానం వరకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చి ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు.

కోట శ్రీనివాసరావు పార్థివ దేహానికి నటుడు రాణా నివాళులర్పించారు. ప్రకాష్ రాజ్ కూడా కోటకు నివాళులర్పించారు. మాజీ ఎంపి జితేందర్ రెడ్డి కూడా కోటకు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. కోటతో పని చేసిన అనేక మంది సాంకేతిక నిపుణులు కూడా ఫిలిం నగర్ లోని ఆయన నివాసానికి వచ్చి నివాళులర్పించారు.

### కోట లేని లోటు ఎవరూ పూడ్చలేరు: తనికెళ్ళ భరణి

సినిమా బతికి ఉన్నంత కాలం కోట శ్రీనివాసరావు నటన బతికే ఉంటారని తనికెళ్ళ భరణి అన్నారు. కోట మరణ వార్త విన్న వెంటనే ఫిలిం నగర్ లోని ఆయన నివాసానికి వచ్చిన భరణి కోట పార్థివదేహానికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. కోట శ్రీనివాసరావు తాను కలిసి ఎన్నో సినిమాలు చేశామన్నారు. వందులు, వేల జ్ఞాపకాలు మిగిల్చి కోట వెళ్లిపోయారని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను అని చెప్పారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### తనదైన శైలితో పాత్రకు ప్రాణం పోసే నటుడు : ఎన్టీఆర్

జూనియర్ ఎన్టీఆర్ తన సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో కోట మ్రుతికి సంతాపం ప్రకటించారు. తెలుగు తెరపై తనదైన శైలితో ప్రతి పాత్రకు ప్రాణం పోశారని పేర్కొన్నారు. ఆయనతో నా సినిమా షూటింగ్ సమయంలో పంచుకునన్ క్షణాలు మరచిపోలేనని అన్నారు. కోట ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తానని అన్నారం. కోట కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

### కోటకు గవర్నర్ దత్తాత్రేయ నివాళి



ప్రముఖ నటుడు మాజీ శాసనసభ్యులు కోట శ్రీనివాసరావు మృతి పట్ల హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసారు. కోట శ్రీనివాసరావు మృతిచెందిన వార్త తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురైనట్లు బండారు దత్తాత్రేయ తెలిపారు. కోట శ్రీనివాసరావు జాతీయత, దేశ భక్తి నిబద్ధతకు ప్రతిరూపమని, ప్రజలతో చక్కగా మమేకమై పనిచేసిన నాయకులని వారి సేవలను కొనియాడారు. కోట శ్రీనివాసరావు మృతి సినీ రంగానికే కాకుండా జాతీయ భావాలు కలిగిన సంస్థలకు తీరని లోటు అని దత్తాత్రేయ పేర్కొన్నారు. కోట శ్రీనివాసరావు మృతిపట్ల తన ప్రగాఢ సంతాపాయాన్ని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతిని చేకూర్చాలని, ఈ కష్ట సమయాన ఈ బాధను తట్టుకోవడానికి వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు బండారు దత్తాత్రేయ తెలిపారు.

---

## సమగ్ర సవరణ

(మొదటి పేజీ తరువాయి)

జాబితా సమగ్ర సవరణ జరగబోతోంది.

**జులై 28 తర్వాతే తుది నిర్ణయం**

ఓటరు జాబితా సమగ్ర సవరణను ఇసి చేపట్టడం అనేది రాజ్యాంగబద్ధమైన అంశమేనని, బిహార్‌లో ఆ ప్రక్రియను నిర్వహించొచ్చని గతవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అయితే దేశవ్యాప్తంగా ఈ డ్రైవ్‌ను చేపట్టే అంశంపై జులై 28 తర్వాతే కేంద్ర ఎన్నికల సంఘం (ఇసి) తుది నిర్ణయాన్ని తీసుకుంటుందని అధికార వర్గాలు అంటున్నాయి. ఎందుకంటే అకస్మాత్తుగా బిహార్‌లో ఎస్ఐఆర్ డ్రైవ్‌ను నిర్వహించడం వల్ల ఎంతోమంది ఓటుహక్కును కోల్పోతారంటూ దాఖలైన పిటిషన్లపై ఆ తేదీన మరోసారి దేశ సర్వోన్నత న్యాయస్థానంలో వాదనలు జరగనున్నాయి. జన్మస్థలం ఆధారంగా విదేశాలకు చెందిన అక్రమ వలసదారుల పేర్లను దేశంలోని ఓటరు జాబితాల నుంచి తొలగిస్తామని కేంద్రం ఎన్నికల సంఘం అంటోంది. ప్రత్యేకించి వివిధ రాష్ట్రాల్లో బంగ్లాదేశ్, మయన్మార్ వలసదారులు ఓటు హక్కు పొందారని అంటున్నారు. అలాంటి వారి పేర్లను ఓటరు లిస్టుల నుంచి తొలగించనున్నారు. కాగా, ఈ ఏడాది చివర్లో బిహార్‌లో, వచ్చే సంవత్సరం అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

## కాలిఫోర్నియా పొలాల్లో వలస అధికారుల తనిఖీ

### ఘర్షణలో వ్యవసాయ కార్మికుడు మృతి

**ఆస్టిన్ :** అమెరికాలో అక్రమ వలస కార్మికులను గుర్తించే కార్యక్రమాన్ని ముమ్మరంగా కొనసాగిస్తున్న అధికారులు ప్రభుత్వ గుర్తింపు పొందిన గంజాయి సాగు పొలంలో తనిఖీ దాడులు చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి పత్రాలూ లేని 200మంది వలస కార్మికులను అరెస్టు చేశారు. ఉద్రిక్తతలు పెరిగిపోవడంతో వలస కార్మికులు నిరసన ప్రదర్శన చేశారు. అధికారులకు కార్మికులకు మధ్య ఘర్షణలు జరిగాయి. ఈ ఘర్షణలో తీవ్రంగా గాయపడిన వ్యవసాయ కార్మికుడు ఆ తర్వాత చికిత్స పొందుతూ మరణించాడు. లాస్ ఏంజెల్స్‌కు 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న వెంటూరా కౌంటీలోని వ్యవసాయ క్షేత్రంలో ఈ ఘర్షణలు జరిగాయి. అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించిన వలస ప్రజల అణచివేత చర్యల్లో భాగంగా దేశాధ్యక్షుడు ట్రంప్ ఆదేశాల మేరకు చాలా కఠినమైన చర్యలు తీసుకుంటున్నారు. వలస కార్మికులను మాతృదేశానికి కాకుండా వారికి తెలియని దేశాలకు తరలించి అక్కడే ఉంచేస్తున్నారు. ఈ విషయాలు ముందుగానే తెలుకున్న కార్మికులు భయపడి పారిపోతున్నారు. ప్రతిఘటిస్తున్నారు. ఈ ప్రతి



చర్యల్లో వ్యవసాయ కార్మికుడు మరణించాడు. ఈ రైతు కార్మికుడి కుటుంబం మెక్సికోలో ఉన్న తమ కుటుంబాలకు సహాయం చేసేందుకు వీలుగా ఆన్‌లైన్‌లో ''గో ఫండ్ మీ'' అనే ఒక ఫండ్ రైజింగ్ ఫ్లాట్‌ఫామ్‌ను ప్రారంభించింది. ఈ ఘర్షణ జరిగాక కార్మికుడి మరణం గురించి ఆ వేదిక ద్వారా ఆ కుటుంబం ఈ విషాద ఘటన గురించి అందరికీ తెలియజేసింది. ముఖ్యంగా మెక్సికో నుండి లక్షలాదిమంది వలస ప్రజలు తమ బతుకులు బాగు చేసుకోవడంకోసం అమెరికా వచ్చి చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇప్పుడు మెక్సికో సరిహద్దులను ట్రంప్ చాలా కట్టడి చేశారు. భారీ ఎత్తున అదనపు బలగాలను వందలమందిని నిఘా పెట్టారు.

## ప్రపంచ స్థాయిలో బంగారు పథకాలు సాధించే దిశగా ప్రభుత్వం కృషి

### రాష్ట్ర క్రీడ శాఖ చైర్మన్ శివసేనా రెడ్డి

**ప్రజాపక్షం/షాబాద్ :** ప్రపంచ స్థాయిలో బంగారు పథకాలు సాధించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర క్రీడ శాఖ చైర్మెన్ శివసేనా రెడ్డి అన్నారు. ఆదివారం షాబాద్ మండల క్రీడ మైదానంలో గత 15 రోజులుగా మండల స్థాయి ఎస్‌పిఎల్ 3 క్రికెట్ క్రీడలను ఎఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ అభిరామ్, జిల్లా గ్రంథాయల శాఖ చైర్మెన్ ఎలుగంటి మధుసుదన్ రెడ్డిలు నిర్వహించారు. ఈ క్రీడలో గెలుపొందిన క్రీడకారులకు బహుమతులు ప్రధానం చేయడానికి ముఖ్య అథితులుగా క్రీడ శాఖ చైర్మెన్ శివసేన రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, గురు సంప్రదాయకులు మల్లిఖార్జున అప్పాజీ పాల్గొని బహుమతులు అందజేశారు. విన్నర్ టీంకు రూ.100000, రన్నర్ టీంకు రూ.50,000, మిగిత క్రిడాల్లో పాల్గొన్ని ప్రతిభ కనబరించిన టీంలకు రూ.25 వేలు, 15 వేలు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా క్రీడ శాఖ చైర్మెన్ మాట్లాడుతూ.. రాష్ట్రం అంతా లేని ఆస్టేలియా బంగారు పథకాలు సాధిస్తే 140కోట్ల జనాభా ఉన్న భారత్‌కు ఒక బంగారు పథకం లేకపోవడం దేశానికే అవమానం అని వివరించారు. కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు దృష్టి సాధించిన్నపుడే దేశానికి మంచి పేరు వస్తుందని చెప్పారు. దేశంలోనే తెలంగాణ రాష్టం అత్యధికంగా బంగారు పథకాలు సాధించేందుకు ప్రభుత్వం కృషి చే



స్తుందని వివరంచారు. క్రీడాభివృద్ధి కోసం రెండేళ్లలో రూ.850 కోట్లు ఖర్చు చేసిందన్నారు. చేవెళ్ల నియోజక వర్గంలో మొయినాబాద్ దగ్గర 10 ఎకరాల పొలంలో పెద్ద క్రీడ మైదానం అభివృద్ధి చేస్తామని హమీ ఇచ్చారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హమీలు దశల వారికిగా అమలు చేస్తున్న రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. యువతకు క్రీడల్లో రాణించేందుకు కృషి చేస్తున్న ఎఎంఆర్ ట్రస్ట్ చైర్మెన్ అభిరామ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో గుడి మల్కాపూర్ మార్కెట్ వైజ్ చైర్మెన్ చంద్రశేఖర్, మండల మహిళ అధ్యక్షురాలు అశ్వీని, మాజీ ఎంపిటిసిలు కుమ్మరి చెన్నయ్య, అశోక్ మాజీ సర్పంచులు ఎలుగంటి ప్రతాప్ రెడ్డి, తమ్మళి రవీందర్, మహేందర్ గౌడ్, శ్రీనివాసగౌడ్, నాయకులు దండురాహుల్, షాబాద్ దర్శన్, పార్టీనాయకులు తదితరులు ఉన్నారు.

---

## తెగ బుక్కేస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాలలో కూడా ప్రతి వ్యక్తీ రోజుకు 5.6 గ్రాముల ఉప్పు తింటున్నారు. ఇదంతా ప్రపంచ ఆరోగ్య సంస్థ చేసిన సిఫార్సులకు విరుద్ధం. సోడియం క్లోరైడ్‌కు ప్రత్యామ్నాయంగా పోటాషియం లేదా మెగ్నీషియం సాల్ట్‌ను ఉపయోగించవచ్చునని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎపిడెమియోలాజీలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శరణ్ మురళి చెప్పారు. ఈ అధ్యయన నివేదికను తయారుచేసిన బృందానికి శరన్ మురళీ నాయకత్వం వహించారు. ''తక్కువగా సోడియంను తింటే రక్తపోటు సమస్యలు ఉండవు, మొత్తంగా శరీర ఆరోగ్యం బాగా మెరుగుపడుతుంది, గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది'' అని ఆయన చెప్పారు. సోడియం చాలా తక్కువగా ప్రత్యామ్నాయ ఉప్పు వాడే పద్ధతులకు అలవాటు పడితే మొత్తం శరీర ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడుతుందని ఆయన అన్నారు. తక్కువ సోడియంను ఉపయోగించే అలవాటు చేయడం కోసం ఐసిఎంఆర్ మద్దతుతో తెలంగాణ, పంజాబ్ రాష్ట్రాలలో మూడు సంవత్సరాలపాటు అమలు చేసేవిధంగా ఒక ప్రాజెక్టును ఎన్ ఐ ఇ చేపట్టింది. ఈ ప్రాజెక్టు కింద నిర్మాణాత్మక వ్యవస్థలైన ఆరోగ్య కార్యకర్తలకు, వెల్‌నెస్ సెంటర్లకు కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. వ్యక్తులలో ఉప్పు వాడకాన్ని ఏ విధంగా తగ్గించాలనే విషయాలను ఎలా తెలియజేయాలో తర్ఫీదు ఇస్తారని ఎన్ఐఇలో మరో సీనియర్ సైంటిస్టు డాక్టర్ గణేశ్ కుమార్ చెప్పారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ప్రారంభించి మొదటి ఏడాది జరుగుతోందన్నారు. పునాదిస్థాయిలో సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ సంస్థలకు కౌన్సిలింగ్ ఇచ్చేందుకు కావాల్సిన పూర్తి వనరులను ఇంకా ఖరారు చేయలేదు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు ప్రజలు ఉప్పు తినే అలవాటులో జోక్యం చేసుకునేందుకు, వారి అనుభవాలను, వారి సలహాలను మేళవించి ఒక ప్యాకేజీని తయారు చేస్తున్నాం, అంటే వ్యక్తులకు ఆరోగ్య విషయాల గురించి విద్యాబోధనలు చేయడం మాత్రమే కాదు, వారు జాగ్రత్తగా విని అర్థం చేసుకుని ఆచరించడానికి వీలుగా ఒక కార్యక్రమాన్ని రూపొందిస్తున్నామని డాక్టర్ మురళీ చెప్పారు. లో సోడియం సాల్ట్ (ఎల్ ఎస్ ఎస్) ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకోవడానికి తమిళనాడులోని 300 రిటైల్ ఔట్‌లెట్స్‌లో మార్కెట్ సర్వే చేశామని చెప్పారు. ఐతే ఈ ఎల్ ఎస్ ఎస్ కేవలం 28 శాతం దుకాణాలలో మాత్రమే వినియోగదారులకు అందుబాటులో ఉందని, 52 శాతం సూపర్ మార్కెట్లలోనే ఈ ఎల్ ఎస్ ఎస్ అందుబాటులో ఉందని, పాయింట్ నాలుగుశాతం మాత్రమే చిన్న చిన్న దుకాణాలలో ఎల్ ఎస్ ఎస్ ఉండటాన్ని గుర్తించామని చెప్పారు. 100 గ్రాముల ఎల్ ఎస్ ఎస్ ధర రూ.5.6 రూపాయలకు, సాధారణ సోడియం 100 గ్రాములు రూ.2.7లకు లభిస్తోందని చెప్పారు.

## సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

సందర్భంగా నిర్వహించే సభకు జనసమీకరణపై జిల్లా కాంగ్రెస్ నాయకులు సమీక్షలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 3లక్షల 58,187 నూతన కార్డులను జారీ చేయనుండగా, 11,11,223 మందికి లబ్ధిచేకూరనుంది. దీంతో రాష్ట్రంలో మొత్తం రేషన్‌కార్డులు 95,56,625 లక్షలకు చేరినట్లు రాష్ట్ర పౌరసరపరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రెండురోజుల క్రితమే ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. ఇదిలా ఉండగా సూర్యాపేట జిల్లాలో నూతన రేషన్‌కార్డుల కోసం 34,225 మంది దరఖాస్తు చేసుకోగా అధికారులు నేటి వరకు 25,362 కార్డులు మంజూరు చేశారు. 840 దరఖాస్తులను రిజక్ట్ చేయగా, 8,026 దరఖాస్తులు వివిధ స్థాయిలో పెండింగ్‌లో ఉన్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ఈ నూతన రేషన్‌కార్డుల జారీతో 76,723 మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుంది. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 3,24,165 రేషన్‌కార్డులుండగా, ఇందులో అంత్యోదయ కార్డులు 19,830, అన్నపూర్ణ కార్డులు 36 ఉన్నాయి. ఇప్పటి వరకు లబ్ధిదారులకు 5.943.192 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తుండగా నూతన కార్డుల జారీతో 46,338 క్వింటాళ్లు బియ్యాన్ని ప్రభుత్వం అదనంగా పంపిణీ చేయాల్సి ఉంది.

### 80వేల మందితో భారీ బహిరంగ సభ

నూతన రేషన్‌కార్డుల పంపిణీ సందర్భంగా తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలో నిర్వహించే సిఎం సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున జనసమీకరణ చేస్తుంది. 80వేల మందిని సభకు తరలించేందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల్లో పర్యటించి జనసమీకరణపై స్థానిక మండల, గ్రామ శాఖ నాయకులను సమావేశాలు నిర్వహిస్తున్నారు. గ్రామానికి ఒకటి నుండి మండలానికి రెండు చొప్పున వాహనాల్లో జనాన్ని తరలించాలంటూ సూచించారు. ఈ సభకు మహిళలను అధిక సంఖ్యలో తరలించేలా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

## ఖరీఫ్ సాగు

(మొదటి పేజీ తరువాయి)

లోటు(వర్షాబావం)గా పరిగణిస్తారు. జూన్ 1 నుంచి ఇప్పటి వరకు మహబూబాబాద్ జిల్లాలో సాధారణ పాతం 211.1 మి.మీ. కాగా, 182.8 మి.మీ. వర్షం (లోటు 13 శాతం) కురిసింది. వరంగల్ జిల్లాలో 2928 మి.మీ. సాధారణ వర్షపాతం కాగా, 1919 మి.మీ. పడింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సాధారణ వర్షం 233.7 మి.మీ. కాగా, 159.6 మి.మీ. (లోటు 37శాతం), హనుమకొండ జిల్లాలో సాధారణ వర్షపాతం 220 మి.మీ. కాగా, వాస్తవంగా 171.3 మి.మీ. (లోటు 22 శాతం), జనగామ జిల్లాలో సాధారణ వర్షపాతం 142 మి.మీ. కాగా, అతి తక్కు వగా 107.8 మి.మీ. (లోటు 41 శాతం), ములుగు జిల్లాలో సాధారణ వర్షపాతం 302.1 మి.మీ. కాగా 230.2 మి. మీ.(లోటు 24 శాతం) వర్షపాతం రికార్డు అయింది. రానున్న రోజులలో సాదారణం కన్నా మించి వర్షం కురిస్తేనే ఈ లోటు భర్తీ కాగాలదని చెబుతున్నారు.

### ముందస్తు వర్షాలకు మురిసి.. ఇప్పుడు దిగులు

ఉమ్మడి జిల్లా రైతులకు ఈ వానాకాలం అను కూలించడం లేదు. గతేడాది ఇదే సమయంలో కురిసిన భారీ వర్షాలకు జలాశయాలు, చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. గోదావరి, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కానీ, ఈ సీజన్ లో రైతులకు ఆ పరిస్థితి లేదు. ముందస్తు వర్షాలకు మురిసిన రైతులు ఇప్పుడు దిగులు పడుతున్నారు. మే నెలలో కురిసిన వర్షాలకు కొం దరు దుక్కులు దున్నుకుని పత్తి విత్తనాలను వేస్తే.. మరికొందరు పొలాలు సిద్ధం చేసుకుని నారు పోసు కున్నారు. ఆ తర్వాత ఆశించిన స్థాయిలో వర్షాలు లేక చాలా వరకు పత్తి, మొక్కజొన్న విత్తనాలు భూమిలో ఎండిపోగా.. పొలాలు దున్నిన రైతులు సైతం ఇప్పటికీ వేచిచూసే ధోరణిలోనే ఉన్నారు. వానాకాలం మొదలై రెండు మాసాలు నడుస్తున్నా.. ఇప్పటికీ లోటు వర్షపాతమే ఉంది. దీంతో జలాశ యాలు, చెరువులకు నీరు చేరక.. పెరిగిన భూగర్భజలాలు కూడా అంతంతే కావడంతో రైతులకు ప్రతికూల పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

### అదును దాటుతున్నా సాగు 35 శాతమే..

మే 28, 30 తేదీల్లో ముందస్తుగానే వర్షాలు పడడంతో సాగు విస్తీర్ణం అంచనాలు దాటుతుందని ఆందరూ భావించినా.. ప్రస్తుత పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. గతేడాది వానాకాలంలో 14.15 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని భావించగా, 15.45 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు వేశారు. గత సాగును దృష్టిలో పెట్టుకుని ఈ సీజన్లో ఉమ్మడి వరంగల్ లో 15,82,755 ఎకరాల్లో రైతులు వివిధ పంటలు వేస్తారని వ్యవసాయశాఖ అంచనా వేసింది. కానీ, వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈసారి సాగు ముందుకు కదలడం లేదు. గతేడాది ఇదే సమయానికి 74 శాతం వరకు పంటలు వేయగా.. అదును దాటుతున్నా ఇప్పటికీ ఉమ్మడి జిల్లాలో 5,46,150 (35 శాతం) ఎకరాల్లోనే సాగు చేశారు. ముందస్తుగా ఒకటి రెండు వర్షాలు పడినా.. ఆశించిన మేరకు వర్షపాతం నమోదు కాకపో వడం వల్ల ఈసారి ఆశించిన మేరకు సాగు పెరగలేదని, అయితే ఇంకా సమయం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

### కష్టకాలంలోనూ పత్తినే ఎంచుకున్న రైతులు

ఈ నేపథ్యంలో గతంతో పోలిస్తే సాగు తగ్గినా.. రైతులు కష్టకాలంలోనూ వర్షాధార పంటగా పత్తిని ఎంచుకున్నారు. 5,76,863 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని అంచనా వేయగా, ఇప్పటి వరకు 4,07,554 (70.28 శా తం) ఎకరాల్లో వేశారు. కాగా 8,78,376 ఎకరాల వ రిసాగు అంచనాకు కేవలం 56,155 (6.88 శాతం) ఎకరాల్లోనే వరి పంటలు వేయడం ఈసారి ప్రతికూల పరిస్థితులకు అద్దం పడుతోంది.రుతుపవనాల కదలిక మందగించడంతో అడపాదడపా తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురుస్తున్నాయే తప్ప.. భారీ వర్షాలు ఎక్కడా పడడం లేదు. ఇప్పటికే విత్తనాలు వేసిన రైతులు 15 రోజుల వరకు వర్షాలు లేకపోయినా తడి తగిలినా మొలకెత్తుతాయనే ఆశతో ఉన్నారు. ప్రస్తుత పరిస్థితిని చూస్తే నెలన్నర కాలం పోయిందని రైతులు వాపోతున్నారు. వర్షాలు సంతృప్తికంగా పడకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని సుమారు 1800కుపైగా చెరువులు నీళ్లు లేక వెలవెలబోతున్నాయి.

### ఎండిపోతున్న మొక్కలు

వరుణుడు కరుణించకపోవడంతో మొలకెత్తిన మొక్కలు ఎండు ముఖం పడుతున్నాయి. విత్తనాలు నాటి నెలరోజులు దాటినా పంటలకు సరిపడా ఒక్క భారీ వర్షం కురకపోవడంతో రైతులు ఆవేదన చెంతున్నారు. మరో వారం, పది రోజులకు కూడా సరి. పోను భారీ వర్షాలు కురకపోతే ప్రస్తుతం మొలకెత్తిన పంటలన్నీ ఎండిపోయే ప్రమాదం ఉందని కలవరపడుతున్నారు. వారం రోజులుగా ప్రతీ రోజు మేఘాలు కమ్ముకుంటూ వర్షం వస్తుందని ఆశతో ఎదురుచూస్తున్న అన్నదాతలకు నిరాశే మిగులుతోంది. అడపాదపా ఓ మోస్తరు వర్షం మాత్రమే పడుతోంది. లోటు వర్షం పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు పలు కీలక సూచలు చేశారు. వర్షాధార పంటలైన పత్తి, సోయాబిన్, మొక్కజొన్న, కందులు, పెసర్లు వేయాలనుకుంటున్న రైతులు భూమి 15 20 సెంటిమీటర్ల లోతు తడిస్తేనే నాట్లు వేయాలని సూచించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com